ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 1, ఫిబ్రవరి 2025





ఏఎంసీ పాలక మండళ్ల

రిజర్వేషన్లు ఖరారు

లోక్‌సభ నియోజకవర్గం యూనిట్‌గా రాష్ట్రస్థాయిలోనే ప్రక్రియ పూర్తి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక మండళ్ల రిజర్వేషన్లను రాష్ట్ర స్థాయిలో ఖరారు చేసినట్లు తెలిసింది. జిల్లాస్థాయిలో ఏకాభిప్రాయం కుదరకపోవడం, ఇతర రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ మేరకు ప్రక్రియను పూర్తిచేసినట్లు సమాచారం. లోక్‌సభ నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని.. ఆ పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రుల సామాజికవర్గాలను, ఏఎంసీల పరిధిలో ఉండే జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లకు తుదిరూపు ఇచ్చినట్లు తెలిసింది. తొలుత కలెక్టర్, ఆ తర్వాత ఇన్‌చార్జి మంత్రి జోక్యం చేసుకొన్నప్పటికీ జిల్లాలో రిజర్వేషన్లపై ఏకాభిప్రాయం కుదరలేదు. అయినప్పటికీ ఒకట్రెండు స్థానాలు మినహా మిగిలిన వాటికి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ఒక జాబితాను రూపొందించారు. అయితే ఈలోపు రాష్ట్రస్థాయిలో రిజర్వేషన్లు ఖరారు చేసి జిల్లాకు సమాచారం పంపుతున్నారు. నేడో రేపో ఆ మేరకు ఒంగోలు

మిగతా 4వ పేజీలో

అభివృద్ధే లక్ష్యంగా ఐదున్నర దశాబ్దాల క్రితం జిల్లా ఏర్పాటైనా ఆశించిన లక్ష్యం నేటికీ నెరవేరలేదు. అనేక కీలక రంగాలలో వెనుకబడే ఉంది. సాగు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశ్రామిక, ఉపాధి, ఇతర మౌలిక రంగాలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి జరగలేదు. ఆయా రంగాలలో గతంలో కొంత కృషి ప్రభుత్వ స్థాయిలో జరిగినప్పటికీ గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో చూపిన నిర్లక్ష్యం జిల్లా అభివృద్ధికి శాపంగా మారింది. నవ్యాంధ్రలో తొలి ఐదేళ్ల టీడీపీ పాలనలో జిల్లా అభివృద్ధిపై కొంత కృషి జరిగి పలు రంగాలపై దృష్టి సారించగా.. అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ ఏ ఒక్క రంగాన్ని పట్టించుకోక ఆయా ప్రాజెక్టులు ముందుకు సాగలేదు.



అర్ధ ప్రకాశం

జిల్లా ఏర్పడి ఐదున్నర దశాబ్దాలు దాటినా కీలక రంగాలలో లేని పురోగతి

ఒంగోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం ఒకటిన్నర దశాబ్దానికి ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా నాటి గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లోని ఒంగోలు, కందుకూరు, మార్కాపురం డివిజన్లు కలిపి 1970 ఫిబ్రవరి 2న ఒంగోలు కేంద్రంగా జిల్లా ఆవిర్భవించింది. అనంతరం రెండేళ్లకు జిల్లావాసి అయిన ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు పేరును జిల్లాకు పెట్టారు. అలా జిల్లా ఏర్పాటు నాటికి విద్య, వైద్య, సాగు, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు అతి తక్కువ కాగా.. పారిశ్రామిక, ఉపాధి రంగాలు లేవనే చెప్పాలి. కేవలం వ్యవసాయం ప్రధాన ఉపాధి రంగంగా ఉండగా అందులోనూ 90శాతం వర్షాధార మెట్ట సాగే. తదనంతర కాలంలో ఆయా రంగాలలో ప్రభుత్వాల దృష్టి, అప్పటి జిల్లా నేతల కృషి ఫలితంగా కొంత పురోగతి కనిపించింది. అయినా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పరిశీలిస్తే ఏ ఒక్క రంగంలోనూ అవసరమైన స్థాయిలో అభివృద్ధి జరగలేదు.

అంతా వెనుకబాటే

జిల్లా ప్రజానీకం ప్రత్యేకించి పశ్చిమప్రాంత ప్రజలు వర్షాకాలం, శీతాకాలం, వేసవికాలం తేడా లేకుండా తాగునీటి కోసం తల్లడిల్లిపోతున్నారు. రక్షిత నీరు కాదు కదా సాధారణ అవసరాలకు, పశువులకు నీరు దొరకని పల్లెలు వందలాదిగా ఉన్నాయి. సాగర్ ఆయకట్టుతో కొంత ప్రాంతానికి సాగునీటి సౌకర్యం

మిగతా 4వ పేజీలో

- నేటికీ ప్రజలకు తప్పని ఫ్లోరైడ్ పీడ
- అన్నిచోట్లా సాగు, తాగునీటికి ఇక్కట్లే
- విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో వెనుకంజ
- గత వైసీపీ పాలనలో జిల్లాపై మరింత నిర్లక్ష్యం
- కీలకమైన ఒంగోలు డెయిరీకి సమాధి
- పునర్విభజనతో వ్యవసాయరంగం కుదేలు
- ఆచరణాత్మక కార్యాచరణతోనే అభివృద్ధి
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- రేపు జిల్లా 56వ ఆవిర్భావ దినోత్సవం



రిజిస్ట్రేషన్‌ల కోసం వచ్చిన వారితో కిటకిటలాడుతున్న ఒంగోలులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కిక్కిరిశాయి

- భారీ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు
- నేటి నుంచి పెరగనున్న భూ విలువలు
- సర్వర్ డౌన్‌తో క్రయవిక్రయదారుల అవస్థలు
- రాత్రి పొద్దుపోయే వరకు కార్యాలయాల వద్ద రద్దీ

ఒంగోలుక్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భూముల విలువ శనివారం నుంచి పెరగనుండటంతో క్రయవిక్రయదారులతో రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. గత రెండు రోజుల్లోనే జిల్లావ్యాప్తంగా 1,300కుపైగా దస్తావేజులను రిజిస్టర్ చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా రాష్ట్రవాప్తంగా అన్ని కార్యాలయాలలో ఒకేసారి భారీసంఖ్యలో కంప్యూటర్లు పనిచేయడం కారణంగా శుక్రవారం సర్వర్ డౌన్ అయ్యింది. దీంతో మందకొడిగా రిజిస్ట్రేషన్ ప్రకియ జరిగింది. జిల్లాలో 12 రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా కనిగిరి, దర్శి, మార్కాపురం, ఒంగోలు, సింగరాయకొండ, పొదిలి ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో క్రయవిక్రయదారులు తమ ఆస్తులను రిజిస్టరు చేయించుకున్నారు. సాధారణ రివిజన్ అన్ని ప్రాంతాలలో జరిగి నాలుగేళ్లు కావడంతో బహిరంగ మార్కెట్‌కు సమాంతరంగా భూవిలువలను పెంచే విధంగా ప్రభుత్వం కసరత్తు

మిగతా 4వ పేజీలో

రెండు రోజులలో భారీగా రిజిస్ట్రేషన్లు

జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో గురు, శుక్రవారాల్లో 1,300కుపైగా దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గురువారం సింగరాయకొండలో 69, ఒంగోలులో 87, అమ్మనబ్రోలులో 17, కనిగిరిలో 106, సంతనూతలపాడులో 25, పొదిలిలో 62, యర్రగొండపాలెంలో 23, చీమకుర్తిలో 36, గిద్దలూరులో 33, మార్కాపురంలో 95, దర్శిలో 105, కంభంలో 24 దస్తావేజులు పూర్తయ్యాయి. అందిన సమాచారం మేరకు శుక్రవారం ఒంగోలులో 70, మార్కాపురంలో 59, దర్శిలో 80, కనిగిరిలో 75 జరిగాయి.

శిథిలగండం

- ఒకప్పుడు కీర్తి పొందిన భవనం నేడు శిథిలావస్థకు..
- కూలిపోయే దశలో ఉన్న ప్రగతిభవన్
- ప్రమాదం కిందనే ఉద్యోగుల విధులు

5



ఒంగోలులోని పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన జానపద నృత్యాలు అదరహో అనిపించాయి.

సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ

- మెరుగైన బోధన, విద్యార్థుల ఆరోగ్యం కోసం చర్యలు
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి
- ఒంగోలులో కలెక్టర్‌తో కలిసి బాలికల హాస్టల్ తనిఖీ
- వార్డెన్ పనితీరుపై ఆగ్రహం

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన బోధన, వారి ఆరోగ్యంపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారీయాతో కలిసి శుక్రవారం ఒంగోలులోని అంబేడ్కర్ భవన్ సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం (ఆనంద నిలయం)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయమన్నారు. అందుకోసమే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా హాస్టళ్ల మరమ్మతులకు రూ.143కోట్లు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ఒంగోలులోని ఆనంద నిలయం

మిగతా 4వ పేజీలో



వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా, అధికారులు

మీ పిల్లలైతే ఇలాగే ఉంటారా?

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్ డి.దుర్గాలక్ష్మిపై మంత్రి స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ 10వ తరగతి విద్యార్థిని హాస్టల్ నుంచి ఇంటికెళ్లి ఇంకా రాకపోగా, మరో 17మంది విద్యార్థినులు సంక్రాంతి సెలవులు ముగిసినా రాకపోవడాన్ని గుర్తించిన ఆయన ఎందుకు పట్టించుకోలేదని వార్డెన్‌ను ప్రశ్నించారు. వార్డెన్ సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేసి ఆమెపై మండిపడ్డారు. ఇదేసమయంలో విద్యార్థినులు టిఫిన్‌గా ఉప్మా తినలేకపోతున్నామని చెప్పగా, లేదు తింటున్నారంటూ వార్డెన్ సమాధానం చెప్పడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలకు నచ్చని తిండి పెడతారా? లేక నచ్చిన తిండి చేసి పెడతారా? మీ పిల్లలు అయితే ఇలాగే ఉంటారా? అంటూ సీరియస్ అయ్యారు. ఇకపై ఉప్మా కాకుండా టమాటా బాత్ చేసి పెట్టాలని, ఆదేశించారు.



నేటి నుంచి రేషన్ పంపిణీ

- ఈ నెలలోనూ అరకొరగానే కందిపప్పు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం నుంచి రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభంకానుంది. అందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,392 రేషన్ దుకాణాలు ఉండగా మొబైల్ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. 6.70లక్షల రేషన్‌కార్డులు ఉండగా అవసరమైన మేరకు బియ్యం, పంచదారను అందుబాటులో ఉంది. అయితే కందిపప్పు అరకొరగానే రావడంతో కొంతమేరనే సరఫరా చేశారు. గత నెలలో కూడా కేవలం 70శాతం కందిపప్పు అందుబాటులో ఉండటంతో కొన్ని ప్రాంతాలకే పరిమితం చేశారు. ఫిబ్రవరి నెలకు సుమారు 450 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం కాగా అందుబాటులో కేవలం 150 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉంది. దీంతో శనివారం నుంచి జరగనున్న పంపిణీలో కందిపప్పు పూర్తిస్థాయిలో కార్డుదారులకు అందే పరిస్థితి లేకుండాపోయింది. ఇప్పటికే కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.130కిపైగా ఉంది. రేషన్‌షాపుల ద్వారా కందిపప్పు రూ.60కే లభిస్తుండటంతో కార్డుదారులు కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన బియ్యం, పంచదార కార్డుదారులకు అవసరమైన మేర అందుబాటులో ఉండటంతో రేషన్ షాపులకు తరలించారు.

సుజాతనగర్‌లో

సమస్యల పరిష్కారానికి చర్యలు

- 'ఆంధ్రజ్యోతి' చర్చావేదికతో 37వ డివిజన్‌లో పనులు ప్రారంభం

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ఏబీఎన్-ఆంధ్ర జ్యోతి' నిర్వహించిన చర్చావేదికలో ప్రస్తావనకు వచ్చిన సమస్యల పరిష్కారంపై అధికారులు కదిలారు. ఈ మేరకు 37వ డివిజన్‌లో పనులను ప్రారంభించారు. శుక్రవారం స్థానిక సమతానగర్ నుంచి సుజాతానగర్ తాలూకా పోలీస్ స్టేషన్ వరకు పారిశు ధ్య పనులు చేపట్టారు. త్వరలోనే సైడు కాలువల నిర్మాణం చేపడతామని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతోపాటుగా కాలువలపై నిర్మించిన ఆక్రమణలను తొలగిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ పనులను పరిశీలించారు.



ఒంగోలు సుజాతానగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వేణుగోపాల్



- పీఎంఏవై కింద పక్కాగృహాల మంజూరు
- సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ
- యూనిట్ విలువ రూ.2.50 లక్షలపైనే!

తీరనున్న సొంతింటి కల

ఒంగోలు నగరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం కానుంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద పక్కా గృహాలను ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హత కలిగిన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే పక్కా గృహం మంజూరు చేస్తామంటూ ప్రభుత్వం ముందుకొచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం పక్కా గృహాలను నిర్మించుకునేందుకు యూనిట్ విలువ రూ.1.50 లక్షలు మాత్రమే

మిగతా 4వ పేజీలో

ప్రజా సమస్యలపై కదిలిన యంత్రాంగం

- 7, 8 వార్డుల్లో పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి

వివరాలు 4వ పేజీలో



మార్కాపురంలో మరమ్మతులు చేసిన పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నారాయణరావు, కౌన్సిలర్ భాగ్యలక్ష్మి

అర్ధ 'ప్రకాశం'

(3వ పేజీ తరువాయి)

ఏర్పడింది. వెలిగొండ ఎండమావిగానే ఉంది. ఇతర వనరుల అభివృద్ధి ముందుకు సాగలేదు. నేటికీ విద్య, వైద్య రంగాలలో ఆశించిన స్థాయిలో వృద్ధిలేదు. పెద్ద జబ్బులకు వైద్యం కావాలంటే పొరుగు జిల్లాలకు వెళ్లాల్సిందే. ఉన్నత విద్యదీ అదే పరిస్థితి. రోడ్డు రవాణా కొంతమేర అభివృద్ధి చెందినా అది కేంద్రప్రభుత్వ పరిధిలోని జాతీయ రహదారులలోనే అధికంగా ఉంది. రాష్ట్ర, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. జిల్లా ప్రజలకు ప్రధాన ఉపాధి రంగాలుగా ఉన్న వ్యవసాయం, పాడి పరిశ్రమలు తీవ్ర ఒడిదొడుకలలో ఉంటున్నాయి. జిల్లా పునర్విభజనతో వ్యవసాయరంగం ప్రాభవం కోల్పోయింది, ఒక్క పొగాకు తప్ప కాస్తంత ఆదాయం వచ్చే పంటల సాగు జిల్లాలో లేకుండాపోయింది. పాడి పరిశ్రమ కూడా అలాగే ఉంది. ఇక పారిశ్రామిక ఉపాధి రంగాలు పరిశీలిస్తే చీమకుర్తి, ఒంగోలు ప్రాంతాలలో గ్రానైట్ పరిశ్రమలు తప్ప పెద్దగా అభివృద్ధికి నోచుకోలేదు.

వైసీపీ పాలనలో తిరోగమనం

గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల ఏ ఒక్క రంగం పురోగతి సాధించలేకపోయింది. నవ్యాంధ్ర తొలి ప్రభుత్వంగా 2014లో ఏర్పడిన టీడీపీ పాలనలో రామాయపట్నం పోర్టు, దొనకొండ కారిడార్, ట్రిపుల్ ఐటీ, యూనివర్సిటీలకు బీజం పడటంతోపాటు వెలిగొండ పనులు వేగవంతమయ్యాయి. సంక్షోభంలో ఉన్న ఒంగోలు డెయిరీకి ఊరట లభించింది. పశ్చిమప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు భారీ తాగునీటి పథకాలు మంజూరయ్యాయి. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్‌లోనూ కొంత కదలిక వచ్చింది. అయితే అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో పాలకులు జిల్లాపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. జిల్లాకు తలమానికమైన ఒంగోలు డెయిరీని మూసేశారు. వెలిగొండను నిర్లక్ష్యం చేశారు. గుండ్లకమ్మ నిర్వహణ పట్టించుకోక గేట్లు కొట్టుకుపోయి రెండేళ్ల ఆయకట్టుకు నీరందలేదు. పారిశ్రామికరంగ అభివృద్ధి ఊసే లేకపోగా అంతో ఇంతో ఉన్న గ్రానైట్ రంగం కూడా తిరోగమనం బాట పట్టింది. విద్య, వైద్యరంగాలపైనా నిర్లక్ష్యమే కొనసాగింది. కేంద్ర నిధులతో చేసే జలజీవన మిషన్ పథకం పనులు కూడా జరగక నీటి కోసం ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడక తప్పడం లేదు. ఉపాధి కోసం వలసలు పెరిగాయి.

నేతల చొరవ అత్యవసరం

రాష్ట్రంలో మళ్లీ టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాకతో ప్రజల్లో ఆశలు చిగురించాయి. రోడ్లు, రైలు మార్గాలలో కేంద్రం ద్వారా కొంత పురోగతి ఉండగా ఇతర రంగాలలో రాష్ట్రప్రభుత్వ దృష్టి, జిల్లా నేతల చొరవ అవసరంగా కనిపిస్తోంది. అందులో ఆచరణాత్మక కార్యాచరణ మరింత అవసరం. విజన్-2047 పేరుతో రాష్ట్రప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలో ప్రస్తుత ప్రభుత్వ కాలంలోనైనా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. 2024-29 మధ్య ఐదేళ్ల కాలంలో అభివృద్ధిపై జిల్లాలోనూ ప్రణాళికలు రూపొందించారు. ఏటా 15శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించగా ఈ ఐదేళ్లలో ఆ ప్రణాళిక ద్వారా జిల్లా ప్రజల తలసరి ఆదాయం రెట్టింపు చేయాలని నిర్దేశించారు. అందులో ప్రధానంగా పాడి పరిశ్రమ, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలు ఉన్నాయి అలాగే మౌలిక సౌకర్యాల వృద్ధికి పెద్దపీట వేశారు. లక్ష్యసాధన చేయాలంటే జిల్లా ప్రజల ప్రత్యేకించి పశ్చిమ ప్రజలకు వరప్రసాదిని అయిన వెలిగొండ తక్షణం పూర్తి ద్వారా సాగు, తాగునీటి ఇక్కట్లు తీర్చాలి. దొనకొండ కారిడార్, కనిగిరి నిమ్జ్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. గ్రానైట్, ఆక్వా రంగాలకు ఊతం ఇవ్వాలి. ట్రిపుల్ ఐటీ, ఆంధ్రకేసరి యూనివర్సిటీ, మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలి. ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ, ఉన్న సాగునీటి వనరులు, రోడ్లు, రైల్వేమార్గాల అభివృద్ధి వంటివి ప్రధానం. వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాల వృద్ధితోపాటు సహజవనరుల వినియోగం, జిల్లాలో ఉన్న మానవవనరుల వినియోగంలో భాగంగా నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉపాధి మార్గాల పెంపు, రూ.4,600కోట్లతో ప్రతిపాదిస్తున్న జలజీవన మిషన్ పూర్తి వంటి చర్యలు చేపట్టాలి. ఆయా రంగాలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొంత దృష్టిసారించినట్లు కనిపిస్తున్నా దానిని వేగవంతం చేయడం ద్వారా జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కిక్కిరిశాయి

(3వ పేజీ తరువాయి)

చేసింది. ఆ మేరకు విలువల పెంపునకు శ్రీకారం చుట్టింది. 10 నుంచి 20శాతం పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో పాత ధరలతో ఇప్పటికే క్రయవిక్రయాలు జరిగిన ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సంబంధిత కార్యాలయాల వద్ద ప్రజలు కిక్కిరిసిపోయారు.

సర్వర్ డౌన్‌తో పడిగాపులు

ఒకేసారి రాష్ట్రమంతా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలతో సర్వర్ డౌన్ అయింది. దీంతో ప్రక్రియ మందకొడిగా సాగింది. క్రయ, విక్రయదారులు ఉదయం నుంచి కార్యాలయాల వద్ద అవస్థలు పడ్డారు. అదేక్రమంలో రోజు మారితే చార్జీలు అదనంగా చెల్లించాలనే భయంతో తమ దస్తావేజులను రిజిస్టర్ చేయించుకునేందుకు ఎక్కువ మంది అధికారులకు సిఫార్సులు కూడా చేయించుకున్నారు. సర్వర్ డౌన్ కారణంగా రాత్రి పొద్దుపోయే వరకు ప్రక్రియ కొనసాగింది.

నేటి నుంచి పెరగనున్న భూముల విలువ

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం సామాన్యులపై భారం పడకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఉన్న ప్రాంతంలో 10 నుంచి 20శాతం ధరలు పెంచారు. ఇప్పటికే ఎక్కువ ధరలు ఉన్న చోట ప్రస్తుత అలాగే ఉంచారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి వాటిని పరిగణనలోకి తీసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి పెరిగిన విలువలు అమలులోకి వస్తాయి.

ఎలాంటి అసౌకర్యం లేకుండా రిజిస్ట్రేషన్లు

-ఎ.బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

నేటి నుంచి భూముల విలువ స్వల్పంగా పెరగనుంది. దీంతో గత వారంరోజులుగా దస్తావేజుల రిజిస్ట్రేషన్లు పెరిగాయి. గత రెండు రోజులలో 1300కుపైగా వచ్చాయి. రాష్ట్రమంతా ఇదే తరహాగా ఉండటంతో సర్వర్ డౌన్ అయింది. అయినప్పటికి క్రయవిక్రయదారులకు అసౌకర్యం లేకుండా రిజిస్ట్రేషన్లు చేస్తాము.

ఏఎంసీ పాలక మండళ్ల రిజర్వేషన్లు ఖరారు

(3వ పేజీ తరువాయి)

లోక్‌సభ పరిధిలోని ఏఎంసీల రిజర్వేషన్‌ల జాబితా కలెక్టర్‌కు అందనుంది. అందిన సమాచారం మేరకు.. ఒంగోలు ఏఎంసీ ఛైర్మన్ పదవిని ఎస్సీ జనరల్‌కు రిజర్వు చేశారు. గిద్దలూరు బీసీ జనరల్‌కు, కొండపి బీసీ మహిళకు, పొదిలి బీసీ మైనార్టీకి, కంభం ఎస్టీ మహిళకు రిజర్వు చేసినట్లు తెలిసింది. దర్శి కనిగిరి ఏఎంసీ ఛైర్మన్ పదవులను జనరల్ మహిళకు, ఎర్రగొండపాలెం, మార్కాపురం ఏఎంసీ ఛైర్మన్ పదవులను జనరల్ కేటగిరీకి రిజర్వు చేసినట్లు సమాచారం. సంతనూతలపాడు నియోజకవర్గంలోని మద్దిపాడు ఏఎంసీని బాపట్ల లోక్‌సభ కింద రూపొందించిన రిజర్వేషన్‌ల జాబితాలో చేర్చారు. మద్దిపాడు ఓసీ జనరల్, అద్దంకి ఎస్సీ జనరల్, సంతమాగులూరు జనరల్, పర్చూరు జనరల్ మహిళ, చీరాల బీసీకి కేటాయించినట్లు తెలిసింది.

సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ

(3వ పేజీ తరువాయి)

అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ.9.30లక్షలు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. దీంతోపాటుగా మరో రూ.30లక్షలు వెచ్చించి అదనపు అంతస్తు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వసతిగదులు, మరుగుదొడ్లు, వంటశాలను పరిశీలించారు. విద్యార్థినిలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థుల ఆసక్తి మేరకు మెనూలో మార్పులు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఆనంద నిలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు సగం పూర్తయ్యాయని, మిగిలినవి త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు అవసరమైన ఆల్ ఇన్ వన్ గైడులు నాలుగు రోజుల్లోనే పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమాధికారి లక్ష్మానాయక్, దివ్యాంగుల సంక్షేమ శాఖ డీడీ జి.అర్చన, ఏపీడబ్ల్యూఎస్‌ఐడీఎస్ ఈఈ పాలపర్తి భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై

కదిలిన మున్సిపల్ యంత్రాంగం

- 7, 8 వార్డుల్లో పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంతో మొదలైన పనులు



చెరువు అలుగు వద్ద ధ్వంసమైన చప్టాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది

మార్కాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం 'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో ఈ నెల 28న 7, 8 వార్డుల్లో నిర్వహించిన అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమంతో మున్సిపల్ యంత్రాంగం లో కదలిక వచ్చింది. ప్రజల నుంచి అందిన సమస్యలను నమోదు చేసుకున్న అధికారులు వాటి పరిష్కారానికి రంగంలోకి దిగారు. స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు 8వ వార్డు కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి రెండురోజులు నుంచి మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందితో వార్డుల్లోనే పనులు చేయిస్తున్నారు. ఇప్పటికే రెండు వార్డుల పరిధిలో డీప్‌బోర్ మోటార్ల ద్వారా నీటి సరఫరా జరిగే పైప్‌లైన్‌లకు మరమ్మతులను పూర్తి చేశారు. ఎక్కడా లీకేజీ లేకుండా అన్నిచోట్ల పనులు పూర్తి చేశారు. అంతేకాక సాగర్ నీటి సరఫరాలో మురుగు నీరు కలుస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు రహదారులను తవ్వి ఇప్పటికే మూడు చోట్ల మరమ్మతులు పూర్తి చేశారు. పూర్తయిన పనులను పరిశీలిచేందుకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు రెండు వార్డుల్లో పర్యటించారు. ప్రధానంగా అలుగుపై కూలిన చప్టా గురించి ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించాలని డీఈ లక్ష్మీనారాయణను ఆదేశించారు. అంతేకాక చెరువు సప్లై ఛానల్‌పై ఆల్ ఇండియా రేడియో కార్యాలయం సమీపంలోని వంతెనస్థానే వెడల్పుతో నూతన వంతెన నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సాగర్ నీటి సరఫరాలో మురుగు నీరు కలుస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే 3 చోట్ల రహదారులను తవ్వి మరమ్మతులు చేశామన్నారు. మరో రెండు చోట్ల పనులు చేయాల్సి ఉందన్నారు. స్వచ్ఛమైన సాగర్ జలాలు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇవేకాక పింఛన్లు, రేషన్ కార్డులు, ఇంటి నెంబర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఆయా విభాగాలకు ఆదేశాలు ఇచ్చామ న్నారు. రెండు వార్డుల పరిధిలో ఎక్కడా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా మూడు రోజులుగా ఎక్కువ మంది సిబ్బందితో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ లక్ష్మీనారాయణ, ఏఈలు ఉమామహేశ్వరరావు, భూపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వార్డులోని టీడీపీ నాయకులు దొడ్డా నాగిరెడ్డి, వలి పాల్గొన్నారు.

క్షతగాత్రుల పాలిట 'మంచి సంరక్షకుడు'గా మారండి

- ఆసుపత్రులకు తరలిస్తే కేంద్రం రూ.5వేల బహుమతి
- సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవ్..
- ఎంవీఐ రామచంద్రరావు



కిమ్స్ ఆసుపత్రి వద్ద అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారులు

ఒంగోలు క్రైం, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా ప్రమాదాలు సంభవించిన సమయంలో క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చి వారి ప్రాణాలను కాపాడి మంచి సంరక్షుడుగా ప్రతి ఒక్క పౌరుడు నిలవాలని ఎంవీఐ రామచంద్రరావు పిలుపునిచ్చారు. రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఒంగోలులోని కిమ్స్, సంఘమిత్ర, ప్రభుత్వ వైద్యశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా ఆసుపత్రులకు రవాణాశాఖ సిబ్బంది వెళ్లి సందర్శించారు. అక్కడ ప్లకార్డు, ఫ్లెక్సీలు పెట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రామచంద్రరావు మాట్లాడుతూ ఎక్కడైన ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి చేర్చడమే మంచి సంరక్షకుడు (గుడ్ సమ్మారిటన్) కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. క్షతగాత్రులను ఆసుపత్రిలో చేర్చిన వారికి ఎలాంటి చట్టపరమైన అవాంతరాలు ఉండవని తెలిపారు. అంతేగాకుండా ప్రమాదాలబారిన పడిన వారిని వెంటనే ఆసుపత్రిలో చేర్చిన వారికి కేంద్రప్రభుత్వం రూ.5వేల నగదు బహుమతి ఇస్తుందన్నారు. అందువల్ల ప్రమాదాల బారిన పడిన వారి పట్ల ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రికి చేర్చాలని ఆయన కోరారు. వారికి ఎలాంటి పోలీసులు వేధింపులు ఉండవని స్పష్టం చేశారు. ఇష్టమైతేనే వారి చిరునామా వ్యక్తిగత సమాచారం తెలియజేయవచ్చని, లేకుంటే క్షతగాత్రులను ఆసుపత్రిలో చేర్చి వెళ్లిపోవచ్చని వివరించారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు కిరణ్‌ప్రభాకర్, ఎల్.సురేంద్రప్రసాద్, సహాయ వాహన తనిఖీ అధికారులు ధర్మేంద్ర, బి.భానుప్రకాష్, ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతి పత్రం అందిస్తున్న బాధితుడు భాషా

నకిలీ పత్రాలతో మా స్థలాన్ని కాజేశారు!

- డీటీకి మరో బాధితుడి ఫిర్యాదు
- 58 సర్వే నంబరు బాధితులు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నకిలిపత్రాలతో తమ స్థలాన్ని సర్వాయిపాలెం గ్రామానికి చెందిన దొడ్డపనేని యోగమ్మ భర్త శ్రీనివాసరావు పేరిట అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తూ బాధితుడు షేక్ ఖాదర్‌బాషా అనే యువకుడు డిప్యూటీ తహసీల్దారు నలగాటి మల్లికార్జున నాయుడుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ సర్వే నెంబరు 58లో కొంత స్థలాన్ని 1976లో కొని రిజిస్ట్రేషన్ చేసుకోని అక్కడే నివాసం ఉంటున్నామన్నారు. ఇటీవల తమ స్థలంపై కూడా అక్రమ రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తించి నట్లు తెలిపారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌ను అధికారులు పరిశీలించి రద్దు చేయాలన్నారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ చేసిన, చేయించుకున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నూరు శాతం ఫలితాలు సాధించాలి

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రానున్న పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థినులు కష్టపడి చదవాలని సమగ్ర శిక్షా జీసీడీవో చారులత సూచించారు. శుక్రవారం మండల పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యాలయంలో చదువుతున్న పదోతరగతి, ఇంటర్ విద్యార్థినులతో ఆమె మాట్లాడుతూ బడి మానేసిన విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీ ఫలితాలలో ముందుండాలన్నారు. రానున్న రెండు మాసాలు ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యంతో చదవాలన్నారు. అలానే చదువులో వెనుక బడి ఉన్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నూతనంగా నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. ఈ తనిఖీలో ప్రిన్సిపాల్ సరళకుమారి పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో వ్యక్తిపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమో దు చేశారు. గ్రామానికి చెందిన కాటూరి పద్మకు సురేష్‌కు స్థలం వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో అతను ఆమె ఇంట్లోకి చొరబడి దాడిచేయడంతో పాటు ఇంటికి తాళాలు వేసినట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జమ్మనపల్లిలో లబ్ధిదారుడి ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్

ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలి

హౌసింగ్ పీడీ శ్రీనివాస్

మార్కాపురం రూరల్, జనవరి31(ఆంధ్రజ్యోతి). ప్రధాన మంత్రి జన్మాన్ పథకం ద్వారా నిర్మించే ఇంటి నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని అధికారులను డీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. మండలంలోని జమ్మనపల్లి ఎస్టి గిరిజన కాలనీలో చెంచులకు మంజూరైన 6 పక్కా గృహల నిర్మాణ పనులను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం త్వరగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో పీడీ వెంట డీఈ పవన్‌కుమార్, సురేష్‌బాబు, ఎఇలు నిర్మల్ బాబు, పరమేష్, గ్రామ టిడిపి నాయకులు వెన్నా సుబ్బారెడ్డి, శివారెడ్డి ఉన్నారు.

పెద్దదోర్నాల : మండలంలోని హసనాబాద్ గ్రామం సమీపంలోని జగనన్న కాలనీ, మర్రిపాలెం గూడేలలో గృహ నిర్మాణ స్థలాలను గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పీ శ్రీనివాసప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. గత ప్రభుత్వంలో దోర్నాల రెవెన్యూ పరిధిలోని ఆరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు హసనాబాద్ గ్రామం సమీపంలోని కొండబోడుపై స్థలాలను కేటాయించారు. కాని ఇక్కడ నిర్మాణాలకు ఎవరూ ఆసక్తి చూపలేదు. .ఈ క్రమంలో ఆ శాఖ పీడీ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. నివాస యోగ్యమైన ప్రాంతంలో ఇంటిస్థలాలు మంజూరు చేయాలని లబ్ధిదారులు పీడీని కోరారు. పభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ పవన్‌కుమార్, డీఈ సురేష్ బాబు, ఏఈ శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు వెంకట్రావు మృతదేహం

అద్దంకిటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని 16వ వార్డుకు చెందిన సీపీఎం నాయకుడు గుంజి వెంకట్రావు మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుమారులు తన తండ్రి వెంకట్రావు చివరి కోరిక మేరకు మృతదేహాన్ని వైద్య కళాశాలకు అందజేశారు. తమ తండ్రి మరణం తరువాత కూడా ఆయన శరీరాన్ని కళాశాలకు దానం చేయడం వల్ల వైద్య విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వెంకట్రావు మృతేహాన్ని వైద్య కళాశాలకు దానం చేయడంతో ఎందరికో స్ఫూర్తి దాయకమని పలువురు కొనియాడారు. ఒంగోలుకు చెందిన నేత్రదానం, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల ఐక్యవేదిక సభ్యులు అభినందించారు.

వేడి నీళ్లలో పడిన బాలుడు మృతి

పామూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : పొయ్యి మీద వేడి నీళ్ల పాత్రలో ప్రమాదవశాత్తూ పడి ఐదేళ్ల బాలుడు (5) మృతి చెందిన సంఘటనలో పామూరు మండలం మోపాడులో జరిగింది. మోపాడు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన బండ్లమూడి వేణు, ఆదినారాయణమ్మ దంపతుల ఏకైక కుమారుడు నాని మృతి చెందటంతో కుటుంబంలో విషాదచాయలు నెలకొన్నాయి. ఈ నెల 26న ఆదినారాయణమ్మ కట్టెల పొయ్యి మీద వేడి నీళ్ల కాగపెట్టి కిందకు దించింది. ఈ తరుణంలో బాలుడు నాని ఆడుకొంటూ ప్రమాదవశాత్తు వేడినీళ్లలో పడటంతో నడుమ కింద భాగం, వీపు ప్రాంతం వరకు పూర్తిగా కాలింది. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. నాని శుక్రవారం మృతి చెందాడని వైద్యశాల నుంచి ఫిర్యాదు వచ్చిందని ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు.

టెన్త్ పరీక్షల పరిశీలకుడిగా సుబ్బారెడ్డి

ఒంగోలు విద్య, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చి 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లాపరిశీలకుడుగా విద్యాశాఖ అదనపు డైరెక్టర్(సర్వీసెస్) ఎ.సుబ్బారెడ్డిని నియమిస్తూ పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో అధికారులను సమన్వయం చేసుకొని ఏర్పాట్లను పరిశీలించి పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పేస్‌లో నేడు, రేపు బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు విద్య, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాకినాడ అంతర్ కళాశాలల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు శని, ఆదివారాల్లో ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఈ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. యూనివర్శిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి 17 పురుషుల జట్లు, 10 మహిళల జట్లు పాల్గొంటున్నాయన్నారు. వివిధ కళాశాలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులందరికీ ఉచిత భోజన వసతి కల్పించినట్లు ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి తెలిపారు. ఒంగోలు నుంచి కళాశాల వరకు క్రీడాకారులకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీలో ఉత్తమప్రతిభ చూపిన క్రీడాకారులకు యూనివర్శిటీ జట్టుకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ పోటీలకు జేఎన్‌టీయూ నుంచి స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరి జి.శ్యామ్, అంతర్ కళాశాల సెక్రటరీ జీవీ.రాజులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి బ్రిడ్జికోర్సు

ఒంగోలు విద్య, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సు ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు ఒంగోలు ప్రభుత్వ బాలుర ఐటీఐలో బ్రిడ్జికోర్సును నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీ.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 21 వరకు ఈ బ్రిడ్జికోర్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐ పాసైన విద్యార్థులు మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సులో నేరుగా 2వ సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు అర్హులన్నారు. పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ ఒరిజనల్ విద్యార్హతలతో సర్టిఫికెట్లతో ప్రభుత్వబాలుర ఐటీఐలో సంప్రదించాలని, వివరాలకు 9989433298 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లా మలేరియా నివారణాధికారి

బాధ్యతల స్వీకరణ



డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుకు బొకే అందజేస్తున్న మధుసూదనరావు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ మధుసూదనరావు బాధ్యతలు శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో స్వీకరించారు. గుంటూరులో డిప్యూటీ మలేరియా నివారణాధికారిగా పనిచేస్తున్న మధుసూదనరావు ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. అనంతరం ఆయన డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో మలేరియా, డెంగ్యూ కేసులు తదితర అంశాలపై చర్చించారు. ప్రతినెలా సబ్ యూనిట్ అధికారులు, ల్యాబ్ టెక్నిషియన్‌తో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో శేషుబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు మార్కుల జాబితాలు సిద్ధం

ఒంగోలు విద్య, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కులు జాబితాలు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం పరీక్షల విభాగంలో సిద్ధంగా ఉన్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కుల జాబితాల కోసం వచ్చే విద్యార్థులు తాము పరీక్షకు హాజరైన హాల్ టిక్కెట్ జెరాక్స్ లేదా వెబ్‌సైట్‌లో తీసుకున్న పాసైన మార్కుల జాబితా జెరాక్స్ కాపీగాని తప్పనిసరిగా తీసుకరావాలని ఆయన కోరారు.

తీరనున్న సొంతింటి కల

(3వ పేజీ తరువాయి)

ఇచ్చేది. ఈ మొత్తం కూడా కేంద్రప్రభుత్వం విడుదల చేసిన సొమ్మే కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వాటాకు రాష్ట్రప్రభుత్వం కూడా వాటా కలిపి ఇస్తే ఇళ్లను నిర్మించుకునే పేదలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. అలా కాకుండా వైసీపీ ప్రభుత్వం మాత్రం తన వాటా ధనం ఇవ్వకుండా కేవలం కేంద్రం ఇస్తున్న రూ.1.50 లక్షలనే ఇళ్ల నిర్మాణానికి ఇచ్చి లబ్ధిదారులను ఇబ్బందుకు గురిచేసింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యూనిట్ విలువను పెంచుతున్నట్లు ప్రకటించింది. హామీ ఇచ్చినట్లుగానే కేంద్ర వాటా ధనం రూ.1.50 లక్షలకు తన వాటాగా రూ.లక్షను కలిపి మొత్తం రూ.2.50 లక్షలను ఇవ్వనుంది. ఇంకా అదనంగా కూడా ఇచ్చే ఆలోచన చేస్తోంది. దీంతో పేదలకు పక్కాగృహాల నిర్మాణం సులువైంది. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం పట్టణాల్లో, గ్రామాల్లో ఇంటి నిర్మాణానికి సొంత స్థలం ఉండి అర్హులైన వారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద పక్కాగృహాలను మంజూరు చేయనుంది. ఈ పథకం కింద గృహాల మంజూరుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరుతోంది. ఇప్పటికే ఈ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది.

పీఎంఏవై కింద గృహం పొందేందుకు అర్హతలు

1. గతంలో ఎప్పుడూ ఇల్లు మీ పేరుతో మంజూరై ఉండకూడదు.
2. పక్కా ఇల్లు కలిగి ఇంటి పన్ను మీపేరు మీద ఉండకూడదు.
3. ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగులు ఉండకూడదు
4. నాలుగు చక్రాల వాహనం ఉండరాదు
5. ఇంట్లో ఎవరూ ఆదాయ పన్ను కట్టకూడదు
6. 340 చదరపు అడుగులలోపు భూమి ఉన్న వారే అర్హులు
7. దరఖాస్తు చేసుకునే వారి రేషన్ కార్డులో ఉన్న మిగతా వారిలో ఎవరికీ గతంలో ఇల్లు మంజూరై ఉండకూడదు

సచివాలయాల్లో దరఖాస్తు చేయాలి

- పెరుగు శ్రీనివాస ప్రసాద్, గృహనిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ ప్రాంతాల్లోని వారు పక్కా గృహాల మంజూరు కోసం ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలి. పట్టణ ప్రాంతాల్లో 1,700 పక్కాగృహాలను మంజూరు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. దరఖాస్తు ప్రక్రియ జనవరి నెలాఖరుతో పూర్తైంది.



ప్రగతి భవన్‌లో కూలేదశలో ఉన్న బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం

శిథిల గండం

- ఒకప్పుడు కీర్తి పొందిన భవనం నేడు శిథిలావస్థకు..
- కూలిపోయే దశలో ఉన్న ప్రగతిభవన్
- ప్రమాదం కిందనే ఉద్యోగుల విధులు

40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం ఇది. పలు ప్రభుత్వ కార్యాలయాలు ఈ భవనంలోనే నడుస్తున్నాయి. దివంగత మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు చేతుల మీదుగా ప్రారంభించిన ప్రగతిభవన్ శిథిలావస్థకు చేరింది. ఈ భవనంలో సాంఘిక సంక్షేమశాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖలు, ఆయా వర్గాలకు చెందిన కార్పొరేషన్ల కార్యాలయాలు, దివ్యాంగుల పరికరాల తయారీ, శిక్షణ కేంద్రం ఈ భవనంలోనే నడుస్తున్నాయి. రెండు వందల మందికిపైగానే ఉద్యోగులు పనిచేస్తున్నారు. నిత్యం పనుల కోసం వచ్చే ప్రజలు ఎక్కు సంఖ్యలోనే ఉంటారు. గతంలో ఒక వెలుగు వెలిగిన ప్రగతి భవన్ నేడు కూలిపోయే దశకు చేరుకుంది. భవనం వెనుకవైపు భాగం అంతా పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. పైభాగాన ఉన్న వాటర్ ట్యాంకు నుంచి నీరు లీకేజీ అవుతున్నా పట్టించుకునే నాధుడే లేకపోవటంతో భవనం వెనుకభాగం దెబ్బతినిపోయింది. భవనం శిథిలా వస్థకు చేరటంతో వెనుకవైపు ఉన్న భాగాన్ని వాడకుండా ముందు భాగంలోనే కార్యాలయాలను నిర్వహించుకుంటున్నారు. -ఒంగోలు నగరం, ఆంధ్రజ్యోతి



విరిగిపోయిన కిటికీ అద్దాలు.. తుప్పు పట్టిన సన్‌షేడ్ చువ్వలు



కింది భాగంలో విరిగిపోయిన పైపు

జిల్లాకు చేరిన సీపీఎం జాతాలు



సీపీఎం జాతాకు స్వాగతం పలుకుతున్న పార్టీ జిల్లా నేతలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో శనివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పతాక యాత్ర జాతాలకు ఆ పార్టీ జిల్లా నాయకులు ఒంగోలులో స్వాగతం పలికారు. శనివారం ఉదయం విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణపై విశాఖపట్నం నుంచి వచ్చిన జాతకు స్థానిక ఏ1 కన్వెన్షన్ హాలులో వద్ద సీపీఎం నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అద్దంకి బస్టాండు మీదుగా కలెక్టరేట్, నెల్లూరు బస్టాండు మీదుగా సంఘమిత్ర హాస్పిటల్ వరకు నిర్వహించారు. సాయంత్రం పోలవరం జాతా, రాజధాని అమరావతి జాతాలకు పార్టీ శ్రేణులు స్వాగతలలం పలికాయి. స్థానిక సాగర్ సెంటర్‌లో సభ అనంతరం అక్కడి నుంచి ఆ జాతాలు నెల్లూరు బయలుదేరి వెళ్లాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ నెల్లూరులో మూడు రోజులపాటు జరిగే పార్టీ రాష్ట్ర మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నెల్లూరు భారీ ప్రదర్శన, బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీవీకొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, శ్రీనివాసులు, కంకణాల రమాదేవి, కల్పన, రఘురాం, తంబి శ్రీనివాసులు, రమేష్, మహేష్, మారెళ్ల సుబ్బారావు, బాలచంద్రం పాల్గొన్నారు.

జేజేఎం పనుల డీపీఆర్‌పై దృష్టి

- నీటి వనరుల ప్రతిపాదిత స్థలాలు పరిశీలించిన కన్సల్టెన్సీ బృందం



రామతీర్థం వద్ద పరిశీలిస్తున్న కన్సల్టెన్సీ బృందం

ఒంగోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాశ్వత తాగునీటి సౌకర్యం కోసం ఉద్దేశించిన జలజీవన్ మిషన్(జేజేఎం) పనులకు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)లపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఈ పనులకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇప్పటికే రూ.3వేల కోట్లతో ప్రతిపాదన సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. అంతకముందు పశ్చిమప్రాంతానికి రూ.1300 కోట్లతో ప్రాజెక్టు మంజూరు చేసి ఉండగా అది టెండర్ల దశలో ఉంది. అలా మొత్తం రూ.4300 కోట్లతో రానున్న రోజుల్లో జేజేఎం పనులు జిల్లాలో చేపట్టనుండగా వెలిగొండ, గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టుల నుంచి నీటి సేకరణగా ప్రతిపాదన చేశారు. ఆయా పథకాలకు సంబంధించి ప్రభుత్వం సమగ్ర నివేదికల రూపకల్పన కోసం ప్రైవేటు ఏజెన్సీలను, కన్సల్టెన్సీలను నియమించగా సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు శుక్రవారం జిల్లాకు వచ్చారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులతో కలిసి వారు గుండ్లకమ్మ, రామతీర్థం రిజర్వాయర్లను సందర్శించి అక్కడ ఇన్‌టెక్ వెల్ నిర్మాణ ప్రతిపాదిత స్థలాలను పరిశీలించారు. ఆయా అంశాలపై వివరాలు తీసుకున్నారు. జిల్లాలో జేజేఎం ప్రతిపాదనల రిపోర్టును ఆర్‌డబ్ల్యూఎస్ తరుపున డీఈ గొట్టిపాటి మహేష్ వారికి నివేదించారు.

నీటిసౌకర్యం పెంపునకు ప్రణాళికలు

- ఇరిగేషన్ అధికారులకు మంత్రి స్వామి ఆదేశం
- సాగునీటి వనరులపై సమీక్ష
- కొండపి నియోజకవర్గంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు



ఇరిగేషన్ అధికారులతో మంత్రి స్వామి సమీక్ష

ఒంగోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయమే ప్రధాన జీవనంగా ఉన్నా కనీస స్థాయిలో కూడా సాగునీటి వనరులు లేక కరువు, కాటకాలతో అల్లాడుతున్న కొండపి నియోజకవర్గంలో నీటి వనరుల అభివృద్ధిపై అధికారులు దృష్టిసారించాలని మంత్రి డాక్టర్ బాలవీరాంజనేయ స్వామి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న, కొత్తగా ఏర్పాటుకు అవకాశం ఉన్న సాగునీటి వనరుల అభివృద్ధిపై కీలకమైన ఇరిగేషన్ అధికారులతో శుక్రవారం మంత్రి స్వామి సమీక్ష చేశారు. తూర్పునాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి జలవనరులశాఖ ఒంగోలు సర్కిల్ ఎస్ఈ వరలక్ష్మి, డిప్యూటీ ఎస్ఈ రామకృష్ణ, ఒంగోలు డివిజన్ ఈఈ శివప్రసాద్, ప్రాజెక్టుల ఎస్ఈ నాగమురళీ మోహన్, ఈఈ రవికుమార్ వంటి కీలక అధికారులు హాజరయ్యారు. కొండపి నియోజకవర్గంలో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్న సంగమేశ్వర ప్రాజెక్టును గాడిలో పెట్టాలని మంత్రి సూచించారు. ప్రాజెక్టు అధికారులు రూ.246 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో సమీక్షించిన స్వామి ఉన్నతాధికారులతోనూ మాట్లాడతానని సమగ్ర నివేదికలు పంపాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఉన్న పాలేరు, ముసి నదులతో పాటు ఇతర ప్రధాన వాగులపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు ఉన్న అవకాశాలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. పాలేరు నదికి ఎగువన వచ్చే వెలిగొండ తూర్పు కాలువ నుంచి, ముసి నదికి రామతీర్థం ఎగువ ప్రాంతం నుంచి ఎన్నెస్పీకి నీటిని ఇచ్చేందుకు గల అవకాశాలను అధ్యయనం చేసి నివేదించాలని ఆదేశించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ అన్సారియా, ఇతర అధికారులు

బాలికలకు మంచి భవిష్యత్ అందించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలు చేయకుండా బాలికలకు పదిలమైన భవిష్యత్ అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ఆ దిశగా జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. బాలల హక్కుల చట్టాలపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ఎంపీడీవోలు, ఎంఈవోలు, సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు నిర్వహించిన ఒంగోలు డివిజన్ స్థాయి అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో బాలల సమగ్ర ఎదుగుదలకు, బాల్య వివాహాలు నివారించి సాధికారిత దిశగా బాలికలు ఎదిగేలా బంగారు బాల్యం కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. బాలికల ఆరోగ్యం, సంతోషం, సురక్షిత, సాధికారత లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం సంబంధిత శాఖల అధికారులతో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో బంగారు బాల్యం కమిటీలను నియమించామన్నారు. విద్యార్థినుల డ్రాప్ అవుట్స్ నివారించడంతో పాటు బంగారు బాల్యం కార్యక్రమంపై అవగాహన కల్పించేలా జిల్లాలోని ప్రతి స్కూలులో ఒక టీచర్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆయా అంశాలతో కూడిన బంగారు బాల్యం కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. బాల్యవివాహాలు చేసుకోబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హెనసుజన్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీసీపీవో దినేష్‌కుమార్, డీఎల్‌డీవో మహాలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, జిల్లా విద్యాశిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, సార్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీల్, ఇతర అధికారులు ఉన్నారు.



కలెక్టర్‌కు బోకే ఇస్తున్న ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రతినిధులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్, జేసీలను కలిసిన అసోసియేషన్ నేతలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. జిల్లాకు వచ్చిన ఆయన శుక్రవారం జిల్లా అసోసియేషన్ నేతలతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణలను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. కలెక్టర్‌ను కలిసినవారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిన్నిక మధుసూదనరావు, ఆర్.వాసుదేవరావు, కోశాధికారి ఊతకోలు శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులు రాజేష్, రాము, వెంకటేశ్వరరెడ్డి, వై.ప్రశాంత్‌నాయుడు, సాయి శ్రీనివాసరావు, ఆంజనేయులు, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

నూతన డీజీపీని కలిసిన ఎస్పీ

ఒంగోలు క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను ఎస్పీ ఏఆర్.దామోదర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని శాంతి భద్రతలపై వివరించారు.

ఏకేయూ బీఈడీ పరీక్షలు వాయిదా

ఒంగోలు విద్య, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్శిటీ బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. పరీక్షల కొత్త షెడ్యూలను యూనివర్శిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌ను కేవీఎస్.రాజు శుక్రవారం తెలిపారు. సవరించిన తాజా షెడ్యూల్ ప్రకారం పరీక్షలు ఫిబ్రవరి 10నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయి. 10వ తేదీన పేపర్-1, 11న పేపర్-2, 12న పేపర్-3, 13న మెథలాడజీ-1, 14న మేథడాలజీ-2, 15న ఫిజికల్ సైన్స్ మెథలాడజీ పేపర్ల పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు అన్ని కళాశాలలకు తాజా షెడ్యూల్‌ను పంపించారు. కొత్త షెడ్యూల్ ప్రకారం కళాశాల ప్రిన్సిపాళ్ళు, పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులను పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన కోరారు.

నమో వేంకటేశా శ్రీనివాస

- భక్తిరసభరితంగా వేంకటేశ్వర మహత్యం
- అలరించిన స్వాతంత్ర్యోద్యమం గ్రౌండ్ ప్లే
- ఆకట్టుకున్న మహిళల కోలాటం



శ్రీ వెంకటేశ్వర మహత్యం పద్యనాటకం ప్రదర్శన



గాంధపిరి వానమాలి ఫోక్ సాంగ్‌కు విద్యార్థినుల ప్రదర్శన

ఒంగోలు కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళా పరిషత్ నాటకోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి కర్నూలు టీజీవీ కల్చరల్ అకాడమీ వారిచే ప్రదర్శితమైన శ్రీ వేంకటేశ్వర మహత్యం పద్య నాటకం భక్తిరసపూరితంగా కొనసాగింది. శారదా ప్రసన్న రచించిన ఈ నాటకానికి వి.వి.రమణా రెడ్డి దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రియభక్తునిగా పేరొంది ఆనందాళ్వార్‌గా పిలువబడే అనంతాచార్యులు కథ ఆధారంగా ఈ నాటకం రూపొందింది. రామానుజాచార్యులు తిరుమల ఆలయంలో కైంకర్యాల విషయంలో ఏ లోపం లేకుండా ఏకాంగి, యతీంద్ర వ్యవస్థను ఏర్పాటుచేసి శాస్త్రీయ ధర్మ మర్యాద స్థాపన అనే పద్ధతికి నాంది పలుకుతూ అనంతాచార్యుని తొలి ఆచార్యునిగా నియమిస్తారు. ఆలయ మర్యాదల్లో తొలి పీఠం అంటే తొలి శఠారి, మొదటి తీర్థం, తొలి దర్శనం వంటివి అనంతాచార్యులకు దక్కేలా ఏర్పాటు చేశారు. ఆయన సంస్కృతంలో వేంకటాచల ఇతిహాసమాల అనే గ్రంథాన్ని రచించారు. అయితే అనంతాచార్యులు విసిరిన గునపం దెబ్బ తగిలినచోట ఇప్పటికీ స్వామి వారికి పచ్చకర్పూరం అద్ది చిన్న మచ్చ పెడుతుంటారు. అనంతాచార్యుల చరిత్రతో రూపొందిన ఈ నాటకంలోని నటీనటులు చక్కని పద్యాలాపన, సంభాషణలు, హావభావాలతో ప్రేక్షకులను అలరించారు.



'చెట్టు... చెట్టు అమ్మను నేను' పాటకు ఆలకూరపాడు విద్యార్థినుల నృత్యం

- సింగరాయకొండకు చెందిన శ్రీ ప్రసన్న ఆంజనేయ నాదస్వర బృంద సభ్యులు చక్కని నాదస్వర కచ్చేరి చేశారు. గోనుగుంట రామాంజనేయులు, ఉప్పలపాటి జాలరామ, బోరుబొమ్మల నాగేశ్వరరావు, ఎలుతూరి సత్యనారాయణ, బసీరపల్లి శరత్‌బాబు, గోనుగుంత హనుమంతరావు తదితర కళాకారులు ఈ నాదస్వర కచ్చేరిలో పాల్గొన్నారు. అనంతరం నేరేడుమల్లి శ్రీను మాస్టర్ ఆధ్వర్యంలో దర్శి నటరాజ కోలాట సమాజం మహిళలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. నిత్యం నిర్వహించే స్వల్పకాలిక చర్చా కార్యక్రమంలో భాగంగా ఓటుకునోటు అనే అంశంపై చర్చ నిర్వహించగా ఓటు ఎంతో పవిత్రమైనదని దానిని నిజాయితీ కలిగిన నాయకులను ఎన్నుకోవటానికి ఉపయోగించాలే తప్ప నోటుకు అమ్ముకోకూడదని పలువురు అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు ఈ చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ఒంగోలు అపెక్స్ హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన స్వాతంత్రోద్యమం గ్రౌండ్ ప్లే నాటి స్వాతంత్ర్య సంగ్రామాన్ని కళ్లెదుట సాక్షాత్కరింపజేసింది. ఒంగోలు ఆంధ్రా హైస్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు సైతం ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని పంచాయి. కార్యక్రమంలో వివిధ ప్రదర్శనలు ఇచ్చిన సంస్థలు కళాకారులు, విద్యార్థులకు ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు ప్రదర్శనా పారితోషికాన్ని, జ్ఞాపికలను బహూకరించారు.

5న అష్టోత్తర గోపూజా మహోత్సవం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

ఒంగోలు కల్చరల్, జనవరి31(ఆంధ్రజ్యోతి): హిందువులు సకల దేవతా స్వరూపంగా భావించే గోమాత పూజా మహోత్సవాన్ని ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను వారు శుక్రవారం నగరంలోని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులకు అందజేశారు. విశ్వమాత సోషల్ సర్వీస్ సొసైటీ, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్, కేఎస్‌టీ గౌతం ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త నిర్వహణలో రథసప్తమి సందర్భంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దక్షిణం బైపాస్‌రోడ్డులోని మంగమ్మ కళాశాల ప్రాంగణంలో ఉదయం 7గంటలకు 108 గోమాతలకు పూజ కార్యక్రమం, అదేరోజు సాయంత్రం 4 గంటలకు మంగమ్మ కళాశాల నుంచి గోమాతలతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు. కనుక హిందువులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వెంకటేశ్వరరెడ్డి, విశ్వమాత సోషల్ సర్వీస్ వ్యవస్థాపకులు కేఎస్‌టీ.గౌతం, మంగమ్మ కళాశాల ప్రిన్సిపాల్ రంగారావు, బీజేపీ జిల్లా కార్యదర్శి తీగల సత్యవతి, నరసింహులు, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలి



కలెక్టర్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి, పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణానికి రూ.10వేల కోట్లు నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్, వాన్‌పిక్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తపట్నంలో హార్బర్, రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా సింగరాయకొండ మండలంలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, ఒంగోలులోని డెయిరీని ఎన్‌డీడీబీ ద్వారా ప్రభుత్వ నిర్వహించాలని కోరారు. యర్రజర్ల కొండ భూముల్లో ఉన్న ఐరన్ ఓర్‌ను విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కేటాయించాలని, సంక్షోభంలో ఉన్న పలకలు, గ్రానైట్ పరిశ్రమలను ఆదుకునేందుకు రాయితీలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయింపుతో పాటు ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.అశోక్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక సాగర్‌సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం విద్యా రంగానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించి ప్రభుత్వ విద్యాసంస్థలను మూసివేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం తెచ్చిన 84,83,85 జీవోలను రద్దుచేయకుండా విద్యను ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో ఐఫీయా కౌన్సిల్ సభ్యుడు పీవీ.సుబ్బారావు, ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు అమ్మయ్య, పి.ఆంజనేయులు, పీపీ రంగారెడ్డి, పీటీఎస్‌యూ నాయకులు వినయ్, నాగలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి ప్రసాద్, అంజనాదేవి కృషి

● ఘనంగా ఉద్యోగ విరమణ సత్కారం



ప్రసాద్, అంజనాదేవి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు(రూరల్), జనవరి31(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయ దంపతులు కడియాల ప్రసాద్, అంజనాదేవి చేసిన కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. వారి సేవలను ప్రతి విద్యార్థికి జీవితాంతం గుర్తుంటాయన్నారు. ఒంగోలు మండలం కరవది పీఆర్‌ఆర్ జడ్పీ హైస్కూలులో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు అంజనాదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్ దంపతులను శుక్రవారం ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌ను చూచి ఎంతో సంతోషిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులుగా అంజనాదేవి, ప్రసాద్ చేసిన సేవలు అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కాగా ఉద్యోగ విమరణ చేసిన ప్రసాద్, అంజనాదేవి దంపతులు రూ.25వేలు విలువ చేసే రెండు బీరువాలను స్కూలుకు బహూకరించారు. వ్యాయాయ ఉపాధ్యాయులకు రూ.45వేలు విలువ చేసే యునిఫాంను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ నాయకులు ఎర్రయ్య, వెంగళరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఫీజుపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాగార్జున, నాయకులు

మద్దిపాడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని అటకెక్కించిందని మాజీ మంత్రి, వైసీపీ నియోజక వర్గ సమన్వయకర్త మేరుగ నాగార్జున ఆరోపించారు. శుక్రవారం మద్దిపాడు ఘుడియహూడికాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అండగా నిలుస్తూ ఈనెల 5వ తేదీన కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ఫీజుపోరు కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వాకా కోటిరెడ్డి, మండవ బాలచంద్రమౌళి, గుడ్డపాతల రవి, బెజవాడ శ్రీరామమూర్తి, పైనం ప్రభాకర్, బొమ్మల దేవదాసు, నారా వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, మస్తానమ్మ, సంధ్య, జయమ్మ, రజని తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన ప్రకాశం జిల్లా, ఒంగోలు పట్టణం, గోపాల్ నగరం 1వ లైను, కాపురస్తుడు [illegible] మహేష్, తండ్రి వెంకటావు, వయస్సు 50 సంలు, నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా. [illegible] నెం.122లో, య.3.12 సెంట్ల స్థలమును [illegible] తేది. 27-04-1966న ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ వారి దస్తావేజు నెం.636/1966గా [illegible] తేది.28-01-2025న [illegible]

ఒంగోలు [illegible] సుందర వెంకట రంగయ్య, అడ్వకేట్ [illegible] ఒంగోలు, ప్రకాశం జిల్లా, సెల్ : 9949635789

తేది.30-01-2025

చీమకుర్తి అభివృద్ధికి పరస్పర సహకారం

ఎమ్మెల్యే బీఎన్ పిలుపునకు అనుకూలంగా స్పందించిన వైసీపీ కౌన్సిలర్లు ● అభివృద్ధి పనులతో కూడిన అజెండాకు ఏకగ్రీవ ఆమోదం
డీఎంఎఫ్ ఫండ్‌తో పట్టణంలో మౌలిక వసతులు ● చీమకుర్తి మున్సిపల్ సమావేశంలో ఐక్యతారాగం



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ని సత్కరిస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, టీడీపీ కౌన్సిలర్లు

చీమకుర్తి, జనవరి31(ఆంధ్రజ్యోతి) : "చీమకుర్తి మున్సిపాలిటీలో నిధులు కొరత తీవ్రంగా ఉంది. కలెక్టర్‌తో మాట్లాడి డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయించి పట్టణంలో ప్రధాన సమస్యలను పరిష్కరించటంతోపాటు మౌలికవసతులను కల్పిద్దాం. దీనికోసం పార్టీలకతీతంగా పరస్పరం సహకరించుకుందాం. మీ సమస్యలమేన్న ఉంటే చెప్పండి..పరిష్కరిస్తా" అంటూ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాలకపక్షంగా ఉన్న వైసీపీ కౌన్సిలర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఈ మాటలకు సంతోషడిన చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మీతో పాటు వైసీపీ కౌన్సిలర్లు మారు మాట్లాడకుండా గత సమావేశంలో రద్దు చేసిన అజెండాలో ఉన్న అంశాలకు రెండింటిని తప్పించి దాదాపు అవే అంశాలు, పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమెదం తెలిపారు. చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మీ, టీడీపీకి ఉన్న ఇద్దరు కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలితో కలిసి ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ని ఘనంగా సత్కరించారు. వీరితో పాటు వైస్ చైర్మన్లు, మిగతా వైసీపీ కౌన్సిలర్లు బీఎన్‌ను సత్కరించారు. దాదాపు రూ.70 లక్షలతో ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టటానికి తీర్మానించారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చాంబర్‌లో కౌన్సిలర్లతో బీఎన్ భేటీ

సమావేశం ముగిసిన తర్వాత చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆమె చాంబర్‌కు వెళ్లారు. అక్కడ వైసీపీ కౌన్సిలర్లతోపాటు టీడీపీ కౌన్సిలర్లతో కలిసి భేటీఅయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ కౌన్సిలర్లు పలు అంశాలను విజయ్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. తాము గతంలో చేసిన పనులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరగా బీఎన్ అంగీకారాన్ని తెలిపారు. మున్సిపల్ పాలనలో బయటి వ్యక్తి జోక్యం, పెత్తనంపై తమ అభ్యంతరాన్ని కౌన్సిలర్లు తెలుపగా అలాంటిదేమి ఉండదు.. కౌన్సిలర్లు అందరూ కలిసి పార్టీలకతీతంగా పట్టణ అభివృద్ధికి కృషి చేయండి అని ఎమ్మెల్యే కోరారు. ఏమైన సమస్య వస్తే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని కోరగా అంగీకరించారు.

ఒంగోలు డెయిరీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● మంత్రి స్వామికి విజ్ఞప్తి



మంత్రి స్వామితో మాట్లాడుతున్న ఉద్యోగులు, పక్కన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కార్పొరేషన్, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఏపీ డెయిరీ ఒంగోలులో ఉద్యోగులుగా పనిచేస్తున్నవారి సమస్యలు పరిష్కరించాలని ఆ సంస్థ ఉద్యోగులు మంత్రి డాక్టర్ స్వామికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఒంగోలులో కలెక్టర్ అన్సారియాతో కలిసి పర్యటిస్తున్న మంత్రిని వారు కలిసి తమ సమస్యలను వివరించారు. తమకు 27 నెలలు ఈపీఎఫ్ ఇవ్వాల్సి ఉండగా, 22 చెల్లించారని, ఐదు ఈపీఎఫ్ పెండింగ్ ఉందని. 8 నెలల వేతనాలకు గాను ఐదు నెలల వేతనాలు మంజూరు చేసి, మిగిలిన మూడు నెలల వేతనాలు పెండింగ్ లో పెట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరు అయిన నిధులు నేటికి చెల్లించలేదని, అయితే ఈనెల 7వ తేదీలోపు ఆ డబ్బులు చెల్లించకుంటే తాము పెన్షన్‌కు అర్హత కోల్పోతామని వాపోయారు. అలా జరిగితే డెయిరీలో పనిచేసే ఉద్యోగులందరి కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి స్వామి మాట్లాడుతూ గతంలోనూ ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని, దీనిపై సంబంధిత శాఖ కమిషనరుతో సోమవారం మాట్లాడతానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసి వారిలో కాటూరి శ్రీను, యు.బ్రహ్మయ్య, బీఎం శ్రీనివాసరావు, ఆది శేషరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకులో అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలి

● వేలం కేంద్రం అధికారి సునీల్‌కుమార్



గోగినేనివారిపాలెంలో పొగాకు అల్లకాన్ని పరిశీలిస్తున్న వేలం నిర్వహణాధికారి, సిబ్బంది

కొండపి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలని స్థానిక వేలం కేంద్రం అధికారి జి.సునీల్‌కుమార్ రైతులకు సూచించారు. క్షేత్ర పరిశీలనలో భాగంగా గోగినేనివారిపాలెం గ్రామంలో ఆయన సిబ్బంది, కంపెనీ ప్రతినిధులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా పొగాకు బేళ్లలోకి బీడీ, చుట్ట, సిగరెట్ ముక్కలు, గుట్కా ప్యాకెట్లతోపాటు, వేప ఈనెలు, వేప ఆకులు, గడ్డి కలుపు మొక్కలు, ఇతర పదార్థాలు రాకుండా గ్రేడింగ్ చేయాలని సూచించారు. బేళ్లలో కాగితాలు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు ఆర్‌ఎం కార్యాలయ ఏఎస్ తులసి, ఐటీసీ కంపెనీ మేనేజర్ వెంకటరావు, జీపీఐ మేనేజర్ శ్యామల, పీఎస్‌ఎస్‌హెచ్ ప్రతినిధి వివేక్, మోతీలాల్ పాల్గొన్నారు.

జరుగుమల్లి మండలంలో..

పొగాకు తోటల్లో పక్వానికి వచ్చిన ఆకులను రెల్చాలని టంగుటూరు వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మండలంలోని వావిలేటిపాడు, జరుగుమల్లి, చింతలపాలెం, దావగూడూరు, చిర్రికూరపాడు, కమ్మవారిపాలెం గ్రామాల్లో ఆయన పొగాకు తోటలను, క్యూరింగ్‌లోని పొగాకును, గ్రేడింగ్‌ను సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ గ్రేడింగ్ అధికారి జె.తులసి, క్షేత్ర అధికారి ఉపేంద్ర, పొగాకు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీడీ రమేష్

నాగులుప్పలపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశువుల సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణకు నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈదుమూడిలో శుక్రవారం ఏర్పాటు చేసిన పశుఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పశుసంపద అభివృద్ధికి అనేక పథకాలను అందిస్తుందన్నారు. పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు చికిత్స చేయించాలని ఆయన చెప్పారు. అనంతరం ఏడీఏ డాక్టర్ నాగభూషణం, వైద్యులు జాస్మిన్, అనురాధ పశువులకు వైద్యపరీక్షలను నిర్వహించారు. దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించారు. పశుపోషకులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రేమ్‌కుమార్, వైద్యసిబ్బంది రంగనాథ్, రామకృష్ణ, లావణ్య, రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పి.గుడిపాడులో..

సంతనూతలపాడు: పి.గుడిపాడులో శుక్రవారం జరిగిన పశువైద్య శిబిరంలో 1,660 గేదెలు, గొర్రెలు, మేకలకు పశువైద్యుడు చిరంజీవి వైద్య చికిత్సలు చేసి, నట్టలనివారణ మందును తాపించారు. పశుపోషకులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందించారు.

రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం

సంతనూతలపాడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎం.వేములపాడు గ్రామంలో శుక్రవారం మద్దినేని సుబ్బారావు, మద్దినేని లక్ష్మీనారాయణకు చెందిన రెండు పొగాకు బ్యారన్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో పొగాకు, కర్ర టైర్లు కాలిపోయి సుమారుగా రూ.10లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎస్‌ఐ వి.అజయ్‌బాబు పరిశీలించారు.

రేపు గుండ్లకమ్మలో చేపపిల్లల విడుదల

మద్దిపాడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ జలాశయంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లల విడుదల కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆశాఖ అధికారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు మద్దిపాడులో ఉచిత వైద్యశిబిరం

మద్దిపాడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని రామాలయంలో శనివారం ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం, బీపీ, గుండె వ్యాధులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. కంప్యూటర్ పరికరాలతో కంటి పరీక్షలు, గుండె ఆపరేషన్లు, కిడ్నీలో రాళ్ల సమస్యకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారికి ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవలు అందజేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

డ్వాక్రా గ్రూపులను శక్తివంతం చేసేందుకు శిక్షణలు : పీడీ

టంగుటూరు జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాలలోని గ్రూపులను శక్తివంతం చేసేందుకే వీవోఏలకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్ తెలిపారు. కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, మర్రిపూడి, కొండపి మండలాల వీవోఏలకు స్థానిక డీఆర్‌డీఏ భవనంలో శుక్రవారం లోకేస్ యాప్‌పై ప్రత్యేక శిక్షణ కొనసాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ ఈఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి డిసెంబరు 31వరకు బ్యాంకులో డ్వాక్రా సంఘానికి సంబంధించిన పూర్తి వివరాలు పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో సంస్థాగత జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చిరుతోటి నరసింహారావు, లీగల్ కోఆర్డినేటర్ బెజ్జం రమేష్, కార్యాలయ సిబ్బంది మారెళ్ల శ్రీనివాస్, కొండపి నియోజకవర్గ కోఆర్డినేటర్ కత్తి కల్యాణ్, ఏపీఎం సుబ్బారావు, మూడు మండలాల ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

వెలుగు మార్ట్‌లో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు

వెలుగు మార్ట్‌లో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తప్పవని పీడీ రవికుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన స్థానిక మార్ట్‌ను పరిశీలించారు. నిల్వ ఉన్న వస్తువులు, కొనుగోళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ గతంలో మార్ట్‌లో చోటుచేసుకున్న అవినీతిని ప్రస్తావించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి పన్నుల వసూలుపై దృష్టి పెట్టాలి

మద్దిపాడు, జనవరి31(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో ఇంటి పన్ను వసూలుపై కార్యదర్శులు దృష్టిపెట్టాలని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి అన్నారు. శుక్రవారం మద్దిపాడులో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ దీపాలు వెలగటం లేదని, చెత్త సంపద కేంద్రాలు పనిచేయటం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

వాసవి కన్యకాపరమేశ్వరికి పూజలు

సంతనూతలపాడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో ఆర్యవైశ్యకళ్యాణ మండపంలో శుక్రవారం శ్రీవాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వేమా మల్లేశ్వరరావు, ఆంజనేయులు, సత్యనారాయణ, కోశాధికారి వెంకటక్రిష్ణ పాల్గొన్నారు.

మల్లవరంలో..

మద్దిపాడు: మల్లవరంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అన్నదానం జరిగింది. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు కోట హనుమంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మువ్వల శ్రీనివాసు, ఆకుతోట శ్రీనివాస రావు, గుగ్గిలం సోమశేఖర్ గుప్తా పాల్గొన్నారు. కాగా మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా చిన్ని అమరనాథ్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా గుగ్గిలం సోమశేఖర్ గుప్తాను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి పలువురు మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్సై, పోలీసులు

టంగుటూరు జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అంతర్ జిల్లా దొంగను టంగుటూరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతని వద్ద రూ.12వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వల్లూరులో జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డులో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఈనెల 23న చోరీ జరిగింది. వల్లూరుకు చెందిన కుర్రా అంకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుంటూరులోని రామిరెడ్డి తోట ఒకటో లైన్‌కు చెందిన షేక్ నజీర్ ఫైజల్, గుంటూరుకు చెందిన వంశీనాయక్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నజీర్‌ను గురువారం వల్లూరు వద్ద అరెస్టు చేశారు. ఆయన వద్ద రూ.12వేల నగదు, రూ.10వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. వంశీకోసం గాలిస్తున్నట్లు చెప్పారు. గతంలో నజీర్ గుంటూరులో పది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వాటిలో రెండు మర్డర్ కేసులు, రాబరీ, డెకాయిటీ, రాత్రివేళల్లో మూసిఉన్న షట్టర్ల తాళాలు పడులగొట్టి దొంగతనం చేసిన కేసులున్నాయి. అతనిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

గొర్రెల పెంపకందారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో గొర్రెలు, మేకల పెంపకం దారులకు రూ.10వేల కోట్లు కేటాయించాలని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గంటా శ్రీరామ్, కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర గొర్రెలు,మేకలు పెంపకం దారుల సంఘం సమావేశానికి జిల్లాకార్యదర్శి తోట తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో పాటు ప్రతి పెంపకందారునికి 50శాతం సబ్సిడీతో రూ.5లక్షల చొప్పున రుణం ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా చిన్నచూపు చూశాయని, ఇప్పటికైనా స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కండే బాలకృష్ణ, నక్క గంగరాజు, మనసం శివయ్య, కొండరాజు జయరాం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

ఒంగోలు కల్చరల్, జనవరి31(ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ప్రణవ సాయి అనే విద్యార్థిని పుట్టినరోజును వారి తల్లిదండ్రులు మాదాల కోటేశ్వరరావు, అనిత శుక్రవారం ఘనంగా నిర్వహించి దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త, ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, మండల సబిత, మారెళ్ల రాజేశ్వరి, షేక్ సర్దార్, షహనాజ్, జనసేవ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఒంగోలు కల్చరల్, జనవరి31(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి క్రిస్టియన్‌పాలెం, బండ కాలనీలోని వృద్ధులు, దివ్యాంగులకు గాంధీ జయంతి సందర్భంగా రగ్గులు, దుప్పట్లను శ్రీఅభయ సేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దాలి మాధవరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీవో రాజేశ్వరి, చిరంజీవి, మెప్మా ఆర్పీలు అనిత, నాగదేవత, శారద తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ స్టడీ మెటీరియల్ వితరణ



పుస్తకాలను అందజేస్తున్న మురళీకృష్ణ

ఒంగోలు కల్చరల్, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని డీఆర్‌ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ శుక్రవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు మాట్లాడుతూ తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠాలను ఏకాగ్రతతో చదివి వాటిని తోటి విద్యార్థులతో చర్చించినప్పుడు మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. మండవ మురళీకృష్ణ, సవిత దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో నిడమర్రులో నాస్తికమేళా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా నిడమర్రులో ఈనెల 8,9 తేదీల్లో జరగనున్న జాతీయ నాస్తిక మేళాను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచిపుస్తకం కార్యాలయం వద్ద శుక్రవారం నాస్తిక మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు మాట్లాడుతూ నాస్తికమేళ రూపశిల్పి రామకృష్ణ అని పేర్కొన్నారు. నిడమర్రిలో జరిగే మేళాలో ప్రతి ఒక్కరు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చుండూరి రంగారావు, పేరయ్య, దాసరి సుందరం, కొంగర నరసింహం, బి.సుబ్బారావు ఎం.జార్జి, ఏఎల్.ప్రసాద్, ఎస్‌వీ.రంగారెడ్డి, లింగ వెంకటేశ్వర్లు, చైతన్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి పౌర సన్మానం



స్వర్ణలతను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నాగులుప్పలపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దక్షిణ భారతదేశ స్థాయిలో నిర్వహించిన సైన్‌ఫెయిర్‌లో రాష్ట్రం నుంచి సైన్స్ ప్రాజెక్టును ప్రదర్శించి ప్రత్యేక బహుమతి సాధించి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన ఈదుమూడి జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు కాకి స్వర్ణలతకు శుక్రవారం స్థానిక పాఠశాలలో పౌర సన్మానం నిర్వహించారు. గ్రామపెద్దలు, పాఠశాల దాతలు, ఉపాధ్యాయులు స్వర్ణలతకు శాలువా కప్పి ఘనంగా సతకరించి ఆమె ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో కూనం పూర్ణచంద్రరావు, కూనం చినవీరయ్య, ఆళ్ల ప్రేమ్‌చంద్, కూనం వెంకట్రావు, హెచ్‌ఎం పోలూరి శంకరరావు, గాదంశెట్టి శ్రీనివాసరావు, కామిశెట్టి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

సంతనూతలపాడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి) మండలంలో శనివారం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 6,729 మంది లబ్ధిదారులు ఉన్నారని, వీరందరికి ప్రభుత్వం విడుదల చేసిన రూ.2,87,22,500లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6గంటలలోపే ప్రారంభించి, అదేరోజు తమకు కేటాయించిన వారందరికీ అందజేసేలా ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు.

4న మండల సమావేశం

సంతనూతలపాడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్నిశాఖలకు సంబంధించి అధికారులు విధిగా హాజరుకవాలని కోరారు. హాజరుకాని అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని, ఎటువంటి సెలవులు మంజూరు లేదని ఆయన పేర్కొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్స్ అందజేత



విద్యార్థులకు టెస్ట్‌పేపర్స్‌ను అందజేస్తున్న రామారావు

సంతనూతలపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అట్లూరి కోటి లింగమ్మ, నాగయ్య చారిటబుల్ ట్రస్టు ఎండ్లూరు వారి ఆధ్వర్యంలో మండలంలోని రుద్రవరం, మద్దులూరు, ఎనికపాడు హైస్కూల్లో విద్యార్థులకు శుక్రవారం మోడల్‌టెస్ట్ పేపర్స్‌ను ట్రస్టు ప్రతినిధి అట్లూరి రామారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, బాష, రామకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వరిపొట్టు ట్రాక్టర్ బోల్తా



రోడ్డుపై పడిన పొట్టును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

సంతనూతలపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు సమీపంలోని మన్నంవారిపాలెం డొంక వద్ద వరిపొట్టు ట్రాక్టర్‌ను వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడి గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంతనూతలపాడు నుంచి వలేటివారిపాలెం గ్రామానికి వరిపొట్టును తీసుకుని వెళ్తున్న ట్రాక్టర్‌ను రామతీర్థం నుంచి ఒంగోలుకు కంకరచిప్స్ లోడుతో వెళతున్న టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వి.అజయ్‌బాబు తన సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. వెంటనే రోడ్డుపై పడిపోయిన ట్రాక్టర్ తొలగించేలా చేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

అవీ..ఇవీ

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్



బహుమతులు అందజేస్తున్న సబ్ కలెక్టర్

గిద్దలూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తుపదార్థాలు మనిషి మనుగడకే హాని చేస్తాయని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. శుక్రవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణం లోని సాయిదీప్తి ఒకేషనల్, రాజుపారా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో వీధిబాలల దినోత్సవం సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ, ప్రతి మనిషి తన కుటుంబ సంక్షేమం కోసం కష్టపడాలని తెలిపారు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకోవాలన్నారు. యజమానులు పిల్లలను పనుల్లో నియమించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. రాజ్యాంగం ప్రకారం మనకు సంక్రమించిన హక్కులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. ఆడ, మగ అనే తారతమ్యం లేకుండా ఇద్దరూ సమానమేనన్నారు. వీధిబాలలను గుర్తిస్తే తప్పనిసరిగా పోలీసు వారికి అప్పచెప్పాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగంపై జరిగిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు న్యాయాధికారి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజు, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ చేసిన జడ్జి

పట్టణంలోని సబ్‌జైలును జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. విచారణలో ఉన్న ఖైదీలకు దోమల నుండి రక్షణ కల్పించాలని జైలు సిబ్బందికి సూచించారు. వంట చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి రుచి చూశారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేత


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

గిద్దలూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం అనుమలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చిన్ని సేవాసంస్థ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ఎంపీడీవో వెంకట రామిరెడ్డి అందచేశారు. పబ్లిక్ పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున చదివిన పాఠాలను రివిజన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు శ్రీకాంత్, హెచ్ఎం బాలరాజు పాల్గొన్నారు.

పరీక్ష అట్టల పంపిణీ

రాచర్ల ఫారం సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు ఎంఆర్ సేవా సంస్థ పరీక్ష అట్టలను అందజేసింది. కార్యక్రమంలో సేవాసంస్థ అధ్యక్షులు మణికంఠగౌడ్, దాత శంకర్, విద్యా కమిటీ ఛైర్మన్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పశుఆరోగ్య శిబిరాలు


పశువులకు చికిత్స చేస్తున్న ఏడీ శ్రీరాములు

త్రిపురాంతకం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి నిర్వహిస్తున్న పశుఆరోగ్య శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని నాసరరెడ్డినగర్ గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి గేదెలలకు, ఆవులకు ఇతర పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. పశువులలో వచ్చే పలు రకాల సీజనల్ వ్యాధులతోపాటు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ త్రిపురాంతకం ఏడీ ఎన్.శ్రీరాములు మాట్లాడుతూ త్రిపురాంతకం, పెద్దారవీడు మండలాల్లో మొత్తం ఆరోగ్య శిబిరాల సందర్భంగా 1881 లేగదూడలకు ఏలికపాముల నివారణ మందులను పంపిణీ చేశామన్నారు. 1472 సాధారణ కేసులకు పరీక్షలు చేశామన్నారు. 600 గేదెలకు గర్భధారణ చికిత్సలు చేసి, 67,000 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. 1754 మంది పశు రైతులు లబ్ధి పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు సాంబశివరావు, ఉదయలక్ష్మి, వీరనారాయణ రెడ్డి, బాలునాయక్, ఏహెచ్ఏలు అక్రం, బ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్యశిబిరాలు

పొదిలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుపాలెం గ్రామాలలో శుక్రవారం పశువైద్య సహాయసంచాలకులు వేణు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు కె బేబిరాణి పాల్గొని మాట్లాడారు. చలికాలంలో గొర్రెలకు, మేకలకు, పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. కనుక యజమానులు పశువులను, గొర్రెలను ప్రతిరోజు గమనిస్తుండాలన్నారు. గ్రామంలో గొర్రెలకు, మేకలకు నాచునివారణ టీకాలు వేశారు. చూడు పరీక్షలు నిర్వహించారు. అనంతరం నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. అదేవిదంగా గొట్లగట్టు గ్రామంలో రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో 1850 గొర్రెలకు, మేకలకు, 100 దూడలకు, గేదెలకు నట్టల నివారణ ముందులు పంపిణీచేశారు. అదేవిదంగా 30 గేదెలకు కృత్రిమ గర్బదారణ ఇంజక్షన్‌లు, అనారోగ్యంతో ఉన్న పశులకు, గేదెలకు ముందుగా మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కృష్ణ మోహన్, గ్రామ నాయకులు ప్రసాద్, అంజయ్య, లక్ష్మీనారాయణ, గోపాలమిత్ర రాంబాబు, పశువైద్య సిబ్బంది రాఘవ, శివ, గురవయ్య పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

గిద్దలూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘికశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఫిబ్రవరి 1న శనివారం గిద్దలూరు నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో పర్యటించనున్నారు. ఆయన పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి ఉదయం 7గంటలకు బేస్తవారపేట మండలం చిన్న ఓబినేనిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, 10.30 గంటలకు రాచర్ల మండలం యడవల్లి గ్రామంలోని లెదర్‌పార్కు నందు నూతన భవన నిర్మాణాలు, రోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలలో ఎమ్మెల్యే ముత్తుములతో కలిసి పాల్గొననున్నట్లు స్థానిక టీడీపీ కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కళకళ

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుండి రిజిస్ట్రేషన్ విలువ పెరగనుండడంతో స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం విక్రయదారులతో కళకళలాడింది. శుక్రవారం ఒక్కరోజే 32 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సబ్‌రిజిస్ట్రార్ షేక్ సుల్తాన్‌బాషా తెలిపారు.

మున్సిపల్ సమావేశం రసాభాస

● అజెండాలు ఆమోదించకుండానే ముగిసిన సమావేశం ● చైర్మన్, టీడీపీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం


నిరసన తెలుపుతున్న టీడీపీ కౌన్సిలర్లు

మార్కాపురం, జనవరి (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభసగా మారింది. ఒకవైపు అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించాలని టీడీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మరోవైపు మున్సిపల్ కమిషనర్ వ్యవహారశైలిపై వైసీపీ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. దీంతో అజెండాను ఆమోదించకుండానే మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల కృష్ణ వెనుదిరిగి వెళ్లిపోయారు. అజెండాను ఆమోదించాల్సిందే అంటూ టీడీపీ కౌన్సిలర్లు సమావేశ మందిరంలోనే నిరసన చేపట్టారు.

స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ కౌన్సిల్ హాలులో శుక్రవారం సాయంత్రం కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. ఆరంభం నుంచే టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య చర్చ వాడివేడిగా సాగింది. స్థానిక 33వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ పాలకవర్గం అభివృద్ధి పనులపై శీతకన్ను వేసిందన్నారు. ఎలాంటి అభివృద్ధి పనులు అజెండాలో పెట్టినా కొర్రీలు వేసి పట్టణంలో అభివృద్ధి జరగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు 61 అంశాలతో రూపొందించిన అజెండాను తప్పక ఆమోదించాల్సిందేనని పట్టుబట్టారు. అన్ని అంశాలు ఎలా ఉన్నా, 55వ అంశంలో పేర్కొన్న 18 మంది ఒప్పంద కార్మికులను విధుల నుంచి తొలగించేందుకు ససేమిరా ఒప్పుకునేదిలేదని 5వ వార్డు కౌన్సిలర్ మంగమూరి శ్రీనివాసులు అడ్డుతగిలారు. ఆయనకు ఛైర్మన్ చిర్లంచర్ల కృష్ణ కూడా మద్దతుగా నిలిచారు. దీంతో చాలాసేపు టీడీపీ కౌన్సెలర్లకు ఛైర్మన్‌కు మధ్య మాటల యుద్ధం సాగింది. ఐదు మాసాల నుంచి విధులకు హాజరుకాని వారిని ఎలా కొనసాగిస్తారంటూ గట్టిగా నిలదీశారు. తాను ఆ అంశాన్ని అంగీకరించేంది లేదని ఛైర్మన్ తెగేసి చెప్పాడు. దీంతో టీడీపీ కౌన్సిలర్ల నుంచి ఒత్తిడి ఎక్కువకావడంతో ఛైర్మన్ కృష్ణ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. అంజెడాలోని అన్ని అంశాలను తప్పక ఆమోదించాల్సిందేనంటూ టీడీపీ కౌన్సిలర్లు సుమారు గంటపాటు కౌన్సిల్ హాలులో నిరసన వ్యక్తం చేశారు. కమిషనర్ నారాయణరావు చొరవ తీసుకుని వారికి సర్ధిచెప్పి పంపారు.


అజెండాలోని అంశాలపై మాట్లాడుతున్న కౌన్సెలర్ కొండయ్య

కమిషనర్ తీరుపై మండిపడ్డ వైసీపీ కౌన్సిలర్లు

మున్సిపల్ కమిషనర్ నారాయణరావు ఒంటెత్తు పోకడలకు పోతున్నాడని వైస్‌ఛైర్మన్ షేక్ ఇస్మాయిల్ ధ్వజమెత్తారు. ఆక్రమణల తొలగింపుతో ఒరిగిందేమి లేదన్నారు. తొలగింపు అనంతరం ప్రస్తుతం మళ్లీ కాలువలపై ఆక్రమిస్తున్నారన్నారు. పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. దోమల ఉధృతి ఎక్కువగా ఉంది ఫాగింగ్ చేయమని చెప్పినా పట్టించుకునేవారే లేరన్నారు. కొన్నినెలలుగా ఫాగింగ్ మిషన్‌లు మాయం అయ్యిందని ఆరోపించారు. ఈ అంశాలపై కమిషనర్ సమాధానం చెప్పాలని ఇస్మాయిల్ కోరారు. తన హయాంలో ఇవి జరగలేదని కమిషనర్ సమాధానం ఇచ్చారు. అదేవిధంగా ఉర్దూ పాఠశాల తరలింపు, పైప్‌లైన్ పనుల గురించి ప్రశ్నించడంతో అవి తన పరిధిలోనివి కావని కమిషనర్ అన్నారు. దీంతో ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. 27వ వార్డు కౌన్సిలర్ కశ్శేటి నగేష్ మాట్లాడుతూ 2018లో సుమారు 500 మందికిపైగా టిడ్కో ఇళ్ల కోసం రూ25 వేల చొప్పున మున్సిపల్ కమిషనర్ పేరున డీడీలు తీశారన్నారు. ఏడేళ్లు కావస్తున్నా డబ్బులు చెల్లించిన వారికి అటు ఇళ్లు కాని, డబ్బులు కానీ ఇవ్వలేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ నారాయణరావు సమాధానం చెప్పారు. కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి మాట్లాడుతూ మహిళల కోసం మున్సిపాలిటీలో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కోరిన వెంటనే అంజెడాలో చేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. 2వ వార్డు పరిధిలోని ఉర్దూ పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని మరో కోఆప్షన్ సభ్యులు పఠాన్ అమిరుల్లాఖాన్ అధికారులకు నోటీసు అందించారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ చాతరాజుపల్లి అంజమ్మ శ్రీనివాస్, మేనేజర్ శ్రీనివాసన్, డీఈ లక్ష్మీనారాయణ, ఏఈలు ఉమామహేశ్వరరావు, భూపాల్‌రెడ్డి, పలు విభాగాల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలను విజయవంతం చేయాలి

ఏర్పాట్లపై సమీక్షలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్


సమీక్షిస్తున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్

మార్కాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మర్కాపురంలోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఈ నెల 4న జరగనున్న రథసప్తమి వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌లు అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం రథసప్తమి వేడుకలకు సంబంధించి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారివురు మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ముందు రోజునుంచే అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలుగు మాడవీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు ఎప్పటికప్పుడు సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించే దాతలకు మున్సిపాలిటీ ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. రెండు రోజులపాటు ఆవులను మాడవీధుల్లోకి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు వాహన సేవలున్నందున ఒక వాహన సేవ ముగిసిన వెంటనే నాలుగు వీధుల్లో నీటితో శుభ్రం చేయాలన్నారు. వెండిరథం తిరిగే సమయంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరవుతారన్నారు. ఆ సమయాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రథసప్తమి రోజున వన్‌వే ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. గతంకంటే ఎక్కువ సంఖ్యలో పోలీసు సిబ్బందిని విధుల్లో ఉంచాలన్నారు. పెద్ద వాహనాలు నాలుగు మాడ వీధుల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, అగ్నిమాపకశాఖ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. మెడికల్ సిబ్బంది ఒక 104 వాహనంతో పాటు ఎక్కువ సంఖ్యలో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఒకచోట 104 వాహనం, మరోచోట వైద్యశిబిరం ఉండాలన్నారు. కార్యక్రమంలో రథసప్తమి సేవాసంఘం అధ్యక్షులు యక్కలి కాశీవిశ్వనాథం, దేవస్థానం ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, విద్యుత్‌శాఖ ఈఈ నాగేశ్వరరావు, డీఈఈ షియానాయక్, ఆర్టీసీ డీఎం నరసింహులు, ఫైర్ అధికారి రామకృష్ణ, ఎక్సైజ్ ఎస్సై గోపాలకృష్ణ, ఆర్అండ్‌బీ ఏఈ సందీప్, మెడికల్ ఆఫీసర్ హర్ష, టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు, సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి


సీనియర్ అసిస్టెంట్ నారాయణ (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఊట్ల వెంకట నారాయణ శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. సిబ్బంది తెలిపిన వివరాల మేరకు స్థానిక ఎన్‌జీవోలో నివాసం ఉంటున్న ఆయన గురువారం అర్ధరాత్రి చాతిలో నొప్పి ఉండడంతో సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఆయనను ప్రవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స నిర్వహించే సమయంలో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన మృతితో ఇటు కార్యాలయ సిబ్బంది, మండల ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్వగ్రామం త్రిపురాంతకం మండలం మిట్టపాలెం కాగా నరసరావుపేటలో కుటుంబంతో ఉంటున్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలు ఇరువురు ఉద్యోగ రీత్యా విదేశాల్లో ఉన్నారని సిబ్బంది తెలిపారు. నారాయణ మృతి విషయం తెలుసుకున్న టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, నాయకులు చేకూరి సుబ్బారావు, వేగినాటి శ్రీనివాస్‌తో కలసి నరసరావుపేటలోని ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే ఎంపీడీవో బండారు శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది, పలు శాఖల అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

● 5వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి


పారిశుధ్య సమస్యను దగ్గరుండి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక 5వ వార్డు పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అన్నారు. 'మన ఊరు- మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 5వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వార్డు పరిధిలో నీటి సమస్య ఉన్నట్లు గుర్తించారు. వచ్చే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పలుచోట్ల పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో మున్సిపల్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. దళితులు ఎక్కువ సంఖ్యలో ఉండే ఈ వార్డు పరిధిలో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, టీడీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీడీపీలోకి మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు

మార్కాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైఎస్‌ఆర్‌సీపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి 15, 22 వార్డుకౌన్సిలర్లు వి.సుంకయ్య, కె.రామలక్ష్మమ్మలకు పచ్చ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పరిపాలనకు మెచ్చి టీడీపీలోకి చేరుతున్నారన్నారు. పార్టీలోకి వచ్చే వారిని అందరూ ఆహ్వానించాల్సిందేనని అన్నారు. ఆయా వార్డుల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎలాంటి వివక్షలేకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, కనిగిరి బాలవెంకటరమణ, షేక్ మౌలాలి, మాలపాటి వెంకటరెడ్డి, మయూరి ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

నిర్వాసితులను ఆదుకోవాలి : అఖిలపక్షం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నసరయ్య

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రానున్న బడ్జెట్‌లో రూ.2వేల కోట్ల రూపాయలను కేటాయించి ముంపు గ్రామాల బాధితులను ఆదుకోవాలని అఖిలపక్ష కమిటీ రౌంట్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు ఎంపీజే, ఏఐటీయూసీ, సీఐటీయూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కమిటీ కోఆర్డినేటర్ డీకేఎం రఫి అధ్యక్షతన శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ.. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాలలో పూర్తిగా వెనుకబడిన పశ్చిమ ప్రకాశం గత ఏడు దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతునే ఉందన్నారు. వర్షాధారం మినహా మరో నీటి ప్రత్యామ్నాయం లేని పశ్చిమ ప్రకాశానికి కృష్ణా జలాలే శరణ్యమన్నారు. ప్రాజెక్టు శంకుస్థాపన జరిగి నేటికి 28 సంవత్సరాలు దాటినా పూర్తి కాకపోవటం దారుణమన్నారు. సీపీఎం కార్యదర్శి సోమయ్య మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల బాధితులకు నేటికీ ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. సొరంగ మార్గం ఉన్నటు వంటి కొత్తూరు నుంచి కలనూతల వరకు ఫీడర్ కెనాల్‌లో పిచ్చిచెట్లు పెరిగాయని, తొలగించి మరమ్మతులు చేయాలన్నారు. అర్హులందరికీ ఆర్అర్ ప్యాకేజీ మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జావిద్ అన్వర్ మాట్లాడుతూ.. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కోసం వామపక్ష పార్టీలు చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు షేక్ రజాక్, ఏపీ రైతు సంఘం నాయకులు కొండయ్య, కోటేశ్వరరావు, కాశయ్య, తిరుపతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నన్నేసా, నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు కాశీం, పెద్దన్న, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు హసీనా తదితరులు పాల్గొన్నారు.

కనిపించని సమయపాలన


మూసి ఉన్న సచివాలయం

పొదిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పవర్‌ఆఫీస్ సమీపంలోని సచివాలయం-2లో, రైతుసేవ కేంద్రం సిబ్బంది 10.27 గంటలకు కూడా కార్యాలయం తాళం తీయకపోవడంతో వివిధ రకాల పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిరోజు ఇదే పరిస్థితి ఉంటోందని పలువురు వాపోతున్నారు. 10.30 నుండి 12 గంటల వరకు ఎవరికి తీరినప్పుడు వారు వచ్చిపోతుంటారని ప్రజలు చెబుతున్నారు. సచివాలయం పూర్తిస్థాయి సిబ్బందిని చూసిన దాఖలు లేవని పలువురు వాపోతున్నారు. వైజాక్ నుండి సచివాలయం పనిమీద ఓవ్యక్తి 9.30 నుండి ఉన్నా 10.30కి కూడా ఎవరు రాలేదని వాపోయారు. సిబ్బంది నెంబరు తీసుకొని ఫోన్ చేసినా సరైన సమాధానం లేదన్నారు.

అడవి పంది డాడిలో యువకుడికి గాయాలు

మార్కాపురం రూరల్, జన వరి31 (ఆంధ్రజ్యోతి). అడవిపంది దాడిలో యువకుడు గాయపడిన మండలంలోని జమ్మనపల్లి వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం పెద్దారవీడు మండలం గుండచర్ల గ్రామానికి చెంది న కొండేటి వెంటేశ్వర్లు వ్యక్తిగత పనుల నిమిత్తం మార్కాపురం పట్టణానికి వచ్చాడు. తిరిగి బైకు పై స్వగ్రామం గుండంచర్ల గ్రామం వెళుతుండగా మార్గమధ్యలో జమ్మనపల్లి గ్రామ సమీపంలో అడవి పంది అతనిపై దాడిచేసింది. దీంతో ఆయనకు కాలిపై, చేతిపై గాయాలయ్యాయి. స్థానిక సర్వజన వైద్యశాలలో వైద్యం నిమిత్తం చేరాడు.

ఘనంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

గిద్దలూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిశాలలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివిధ వేషాధారణల మధ్య సుమారు 200 మంది మహిళలు కుసుమ హరనాథ మందిరం నుంచి కళశాలు ఎత్తుకుని అమ్మవారిశాల వద్దకు వచ్చారు. అమ్మవారికి కళశాలను సమర్పించి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి సామూహిక పంచామృతాభిషేకం నిర్వహించారు. కుసుమ హరనాథ మందిరం ఆవరణలో అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు జిలకర సత్యం, ముప్పూరి చంటి, దమ్మాల జనార్ధన్, పరుచూరి నాగేశ్వరరావు, వాడకట్టు శివప్రసాద్, ఆవోపా నాయకులు పాల్గొన్నారు.


గిద్దలూరులో విచిత్ర వేషదరణలో విద్యార్థులు

పొదిలి : శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి శుక్రవారం రాత్రి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని ప్రతేకంగా అలంకరించి శాస్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు ఆర్యవైశ్యులు మాట్లాడుతూ దేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును అధికారికంగా ప్రకటించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యమాజీ ఛైర్మన్ గునుపూడి భాస్కర్, తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

కంభం: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మారణ దినోత్సవం సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేశారు. అనంతరం కోనేటి నుంచి కలశాలను తెచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ వైశ్య పతాకావిష్కరణ చేశారు. భక్తులు లక్ష లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం కమిటీ కార్యదర్శి బూరె వెంకట సుబ్బారావు, కోశాధికారి రామడుగు రమేష్, ఉపాధ్యాక్షులు, సహాయ కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఆలయ అర్చకులు రాంప్రసాద్ శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకారణ గావించారు. గణపతి పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని సేవించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు పబ్బతి సుబ్బారావు, పీ రామారావు, గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మార్పణ వేడుకలు

త్రిపురాంతకం : వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ వేడుకలను ఆర్యవైశ్వ సంఘం, యువజన సంఘం ఆద్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కౌతా అనంతయ్య ఆద్వర్యంలో నగరసంకీర్తన, కళశస్థాపన, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, లక్ష్మీగణపతి హోమం తదితర పూజలను నిర్వహించారు . అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న అశోక్‌రెడ్డి

ఘనంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

ఎర్రగొండపాలెం రూరల్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి అత్మార్పణ దినోత్సవం వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా అధికారకంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లు ఇటీవల ప్రకటించారు. అందులో భాగంగా శుక్రవారం ఆమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం వేడుకలను స్థానిక వాసవి కన్యాక పరమేశ్వరి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటి సభ్యులు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

దొనకొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీల్లోని అన్ని కులాలు, ఈబీసీ కింద కాపు(బలిజ), రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వయం ఉపాధి పథకాల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. ఈనెల 7వ తేదీలోపు వారి గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన లబ్ధిదారులకు మార్చి నెల 10 నుంచి 20వ తేదీ వరకు రుణమేళా ద్వారా యూనిట్లు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ పరీక్ష

కనిగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచ్చే 2వ తేదీన ప్రతిభా పరీక్షలు నిర్వహించనున్నట్లు చైర్మన్ శ్యామల కాశిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురికి నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. బహుమతులు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు అందించనున్నట్లు వివరించారు. వివరాలకు 8106750221, 7097739597 నెంబరును సంప్రదించాలని కోరారు.

అధిక దిగుబడులు సాధించాలి

ముండ్లమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులు పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ చెప్పారు. శుక్రవారం మండలంలోని కెల్లంపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

పాఠశాలకు కుర్చీలు బహూకరణ

కురిచేడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కురిచేడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు శుక్రవారం పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కమతం రమణ కుర్చీలు బహూకరించారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, లలిత్ సాగర్‌లతో కమతం రమణ కుర్చీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నెమిలయ్య, నాగరాజు, కమతం నాగిరెడ్డి, కాశీ, గడ్డం బాలయ్య, దాసరి ఏడుకొండలు పాల్గొన్నారు.

విశ్రాంత జీవితం ప్రశాంతంగా గడపాలి

కురిచేడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఎవరైనా రిటైర్ అయిన తరువాత విశ్రాంత జీవితం ప్రశాంతంగా గడపాలని మండల విద్యాశాఖాధికారి సుబ్బారావు చెప్పారు. మండలంలోని పడమరవీరాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న తుమ్మల సూర్యనారాయణ శనివారం రిటైర్ కానున్నారు. ఆయన సన్మాన కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చాపూర్ల చంద్రరావు అధ్యక్షతన జరిగింది.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పశువుల కోసం ఉచితంగా నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సిద్ధవరం నీటి సంఘం అధ్యక్షుడు యార్లగొర్ల రమేష్ చెప్పారు. మండలంలోని కంభాలదిన్నె పంచాయతీ సిద్ధవరం గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈమని శ్రీసాయి, పొన్నగంటి రోశయ్య, వర్ధినేని వెంకటేశ్వర్లుతో పాటు సిబ్బంది సిద్ధయ్య, రమణయ్య పాల్గొన్నారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శంకరాపురంలో జరిగిన పశువైద్య శిబిరంలో ముండ్లమూరు పశు వైద్యాధికారి విజయలక్ష్మి.. పాడి గేదెలు, చూడి గేదెలు, లేగ దూడలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణ స్వామి, ఎర్రయ్య, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలి

పామూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : పామూరులో చెత్త సంపద కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో సురేష్ చెప్పారు. చెత్త సంపద కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి గ్రీన్ అంబాసిడర్‌లతో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి జీవీ అరవింద తెలిపారు. చెత్తను రీసైక్లింగ్ చేసే యంత్రాలను పరిశీలించారు.

ఘనంగా వాసవీమాత 'ఆత్మార్పణ' కార్యక్రమాలు



పామూరులో బంగారు చీర అలంకరణలో వాసవీమాత

దర్శి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం వాసవీమాత ఆత్మార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ పెద్దలు సూరె చిన్నసుబ్బారావు, ఏఆర్‌వీ సుబ్బారావు పాల్గొన్నారు.

తాళ్లూరు, తూర్పుగంగవరంలో...

తాళ్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత ఆత్మార్పణ రోజు సందర్భంగా తాళ్లూరు, తూర్పుగంగవరంలో వాసవికన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ఆర్యవైశ్యులు హోమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే వాసవి మాత చిత్రపటాన్ని కలశాన్ని ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో చందోలు ఆంజనేయులు, చందోలు రామారావు, రవికుమార్, మల్లికార్జునరావు, తూర్పుగంగవరం గ్రామ దేవస్థానకమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

కురిచేడులో...

కురిచేడు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ అమ్మవారి ఆలయంలో అమ్మవారి గుండ ప్రవేశ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య మహిళలు, ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, లలిత్‌సాగర్ దంపతులు వాసవీ అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయంలో వారిని దుశ్శాలువాతో సత్కరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అయ్యప్పశెట్టి, ఆర్యవైశ్య ప్రముఖులు మేడా నాగేశ్వరరావు, గ్రంధిశిల అల్లూరి నాగరాజు, పువ్వాడ చలపతిరావు, తల్లం సుబ్రహ్మణ్యం, జవ్వాజి సుబ్రహ్మణ్యం, కాశీ విశ్వనాథరావు పాల్గొన్నారు.



దర్శిలో వాసవీ మాత ఆలయంలో పూజలు చేస్తున్న లక్ష్మీ, లలిత్‌సాగర్ దంపతులు

పామూరులో..

పామూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, నగేశ్వరస్వామికి అభిషేకాలు, గణపతి పూజ, మూల మంత్రశాంతి హోమాలు, సహస్ర కుంకుమార్చన పూజలు మహాపూర్ణాహుతి, కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రికి పలువురు భక్తులు అగ్ని గుండం ప్రవేశం చేసి తమ భక్తి ప్రపత్తును చాటుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని బంగారు చీరతో అలంకరించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన కమిటీ గౌరవ అధ్యక్షుడు విశ్వనాథుని సత్యనారాయణ, చైర్మన్ యేల్చూరి బాల కొండలరావు, దరిశి మస్తాన్‌రావు, పందిటి హరీష్, కోటా నరసింహారావు, మెంటా నరసింహారావు, ఆనంద్, శేగు కృష్ణయ్య, గురు, ఎం గణేష్, వెంకట స్వామి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

దర్శి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి టీడీపీ కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో శుక్రవారం నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు తాము ఎంచుకున్న రంగాల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఐన్‌స్టీన్, న్యూటన్, లూయిస్‌బ్రెయిలీ, హెలన్‌కెల్లర్ తదితర ఉద్దండులైన వ్యక్తులు విభిన్న ప్రతిభావంతులే అన్న విషయాన్ని గుర్తించి వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు గతంలో ఎన్నడూలేని విధంగా రూ.6వేలు, పూర్తి అంగవైకల్యం కలిగిన వారికి రూ.15వేలు చొప్పున పింఛన్లు ఇస్తోందన్నారు. అవసరమైన పరికరాలు అందిస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీ, వేదికపై రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, పాపారావు, సాగర్

అమలవుతున్న హామీలు కనిపించడం లేదా...

హామీల అమలులో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని కొంతమంది వైసీపీ నాయకులు విమర్శించటం విడ్డూరంగా ఉందని లక్ష్మి విమర్శించారు. తొలి ఆరు నెలల కాలంలో అనేక హామీలు నెరవేర్చిన విషయం వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గుర్తించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ నాయకులు గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించి దోచుకున్నారని విమర్శించారు. విజయసాయిరెడ్డి లాంటి వ్యక్తులు ఎక్కడ దొరుకుతామోనన్న భయంతో రాజకీయాల నుంచి తప్పుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, జిల్లా విభిన్న ప్రతిభావంతుల ఏడీ అర్చన, ఎంపీడీవో కృష్ణమూర్తి, దర్శి నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రసవాలు ప్రభుత్వాసుపత్రిలో చేయించాలి

ఆశా కార్యకర్తలతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రసవాలు ప్రభుత్వాసుపత్రిలో చేయించేలా ఆశా కార్యకర్తలు చొరవ చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో నియోజకవర్గ పరిధిలోని ఆశా కార్యకర్తలతో ఎమ్మెల్యే శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాను ప్రచార కార్యక్రమంలో ఉండగా ఏ గ్రామం వెళ్లినా చాలామంది ప్రసవం ఖర్చులు భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసిన ఘటనలెన్నో ఉన్నాయన్నారు. అందుకే తాను ప్రధానంగా కనిగిరి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధిపై దృష్టి సారించినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర, హాజరైన ఆశాలు

ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టాలంటే ఓ ప్రణాళిక ప్రకారం ముందుకుపోవాలన్నారు. అందుకే దాతల సహకారంతో ప్రభుత్వాసుపత్రిలో అధునాతన హంగులతో, వైద్య పరికరాలతో వైద్య సేవలు అందించేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే కనిగిరిలో 'కంగారు కేర్' సెంటర్‌ను ప్రారంభించామన్నారు. మత్తుడాక్టర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుకు మీ సహకారం తోడైతేనే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆశా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. గర్భం దాల్చిన రోజు నుంచి ప్రత్యేక రిజిస్టరులో నమోదై 9నెలల పాటు వైద్యం పొంది ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం చేయించిన ఆశా కార్యకర్తలకు ప్రోత్సాహక బహుమతి కింద రూ.1000 ఇస్తానన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో సృజన, వైద్యాధికారులు ప్రియార్షానంద, స్వప్న, మంజుల, హైమావతి, జీవిఫణి, ఎంవీ జయకుమార్, సందీప్, ఫిరోజ్, మహేష్, తులసీదాసులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రి కంటే బాగుంది

సమావేశం అనంతరం ఆశా కార్యకర్తలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర స్థానిక ప్రభుత్వాసుపత్రి సందర్శనకు తీసుకెళ్లారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, తల్లీ, బిడ్డ సంరక్షణ కేంద్రాలు, ప్రసవ గదులు, ప్రత్యేక మిషనరీ, కంగారుకేర్ కేంద్రం, లాబోరేటరీలను ఆశా కార్యకర్తలు పరిశీలించారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

దర్శి నగర పంచాయతీ చైర్మన్



మాట్లాడుతున్న చైర్మన్ పిచ్చయ్య

దర్శి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, మంచినీటి కొళాయిల ఏర్పాటు చేయాలని సూచించారు. అందుకు సంబంధించిన తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పల్లెవనం పార్క్‌ను నగర పంచాయతీ పరిధిలోకి మార్చి అభివృద్ధి చేసేందుకు సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వరరావు, వైస్ చైర్మన్లు జి. స్టీవెన్, తలారి కోటయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అమ్మవారి దేవస్థాన రజిత ద్వారం ప్రారంభం

సీఎస్‌పురం(పామూరు) జనవరి 31(ఆంధ్రజ్యోతి) : స్థానిక వాసవీమాత దేవస్థానంలో భక్తుల సహకారంతో నిర్మించిన రజిత వాకిలిని నుడా మాజీ చైర్మన్ ద్వారకానాథ్ శుక్రవారం ప్రారంభించారు. అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమంలో భాగంగా రజిత వాకిలి, గర్భాలయ అమ్మవారి రజిత పాదుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మణికంఠస్వామి, బాలకొండలు, ఎం సుబ్బారావు, గోన్గు రామారావు, దరిశి సత్యనారాయణ, పాబోలు రమేష్, కోటా నరసింహారావు, హరగోపాల్, జి. గురు, పి. చంద్ర, ఆర్. గణపతి, ఆర్. వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

పామూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలపాలెం రెవెన్యూ గ్రామాల్లో రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ బీవీ రమణారావు చెప్పారు. రీసర్వే ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సరస్వతి, దినేష్ పాల్గొన్నారు.

టీటీడీ దేవస్థాన క్యాలెండర్ ఆవిష్కరణ

పామూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభాలదిన్నె గ్రామ సచివాలయంలో స్వర్ణభూమి ఫెర్టిలైజర్ అనంతపురం తరఫున ముద్రించిన టీటీడీ దేవస్థాన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని మోపాడు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ చుంచు కొండయ్య శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు మన్నం రమణయ్య, కంభాలదిన్నె నీటి సంఘం వైస్ చైర్మన్ ఉడుత కిశోర్, టీడీపీ ఉపాధ్యక్షులు ఏలూరి నరసింహారావు, వీఆర్వో డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

దర్శిలో ముమ్మరంగా రిజిస్ట్రేషన్లు

నేటి నుంచి భూముల విలువ పెంపు

రెండురోజుల నుంచి కార్యాలయం కిటకిట

సొమ్ము చేసుకుంటున్న సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు

దర్శి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : భూములు, స్థలాల విలువలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పెరుగుతుండటంతో దర్శి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూడు రోజులుగా ముమ్మరంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. గతంలో క్రయవిక్రయాల కోసం ఒప్పందాలు చేసుకున్న వ్యక్తులు భూముల విలువలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఎగబడడంతో కార్యాలయం కిటకిటలాడింది. రాత్రి 8 గంటలకు కూడా రద్దీగానే ఉంది. ఈ అవకాశాన్ని కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు వెండర్లు సొమ్ము చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వ్యక్తులతో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు ఫీజులో అదనపు సొమ్ము మాట్లాడుకున్నారు. కొంతమంది రిజిస్ట్రేషన్ అయ్యేందుకు సమస్య ఉందని చెబుతూ అధికంగా కూడా వసూళ్లు చేశారు. గడువు దాటితే ఇబ్బంది పడాల్సి వస్తుందని రిజిస్ట్రేషన్లు చేయించుకునే వ్యక్తులు డాక్యుమెంట్ రైటర్ల మాటలు నమ్మి అడిగిన మేరకు చెల్లిస్తున్నట్లు సమాచారం.



రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఎదురుచూస్తున్న ప్రజలు

● రెండు రోజుల్లో రెండొందలకుపైనే...

దర్శిలో గురువారం అధికసంఖ్యలో 105 రిజిస్ట్రేషన్లు జరిగాయి. శుక్రవారం కూడా సుమారు వంద రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇటీవలకాలం వరకు రోజులకు పది లేక పదిహేను రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగేవి. ఒక్కసారిగా రిజిస్ట్రేషన్ల సంఖ్య మూడంకెలకు చేరటంతో అక్కడ పనిచేస్తున్న వారికి పండగలా మారింది.

● దస్తావేజుల ధరకు రెక్కలు

స్టాంపువెండర్లు దస్తావేజులను అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. రూ.100 స్టాంపును రూ.200 పైగా విక్రయిస్తున్నారు. కొంతమంది రూ.250 నుంచి రూ.300 వరకు తీసుకుంటున్నారని తెలిసింది. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ ఎం శ్రీనివాసరావును వివరణ కోరగా ఈ విషయాలు తమ దృష్టికి రాలేదన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అవీఇవీ



వెంకటయ్య మృతదేహం

దొనకొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సంగాపురం సమీపంలోని రోడ్డుపక్కన శుక్రవారం జరిగింది. అందిన వివరాల మేరకు... మండలంలోని కలివెలపల్లికి చెందిన శ్రీరాం చిన్నవెంకటయ్య(52) తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై దొనకొండ నుంచి కలివెలపల్లికి వెళ్తూ సంగాపురం సమీపంలో తన ద్విచక్రవాహనంతో సహా రోడ్డు పక్కన రక్తపుమడుగులో పడి ఉన్నాడు. అటువైపు వెళ్లేవారు గుర్తించి సమాచారం అందించటంతో భార్య, బంధువులు హుటాహుటిన సంఘటన ప్రదేశానికి చేరుకున్నారు. అపస్మారకస్థితిలో ఉన్న చిన్నవెంకటయ్యను ఆటోలో దొనకొండ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి కుడివైపు గొంతు కింద బలమైన గాయం ఉండటంతో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ రంగనాయకులు, కానిస్టేబుల్ చెన్నకేశవులు మృతదేహాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

టీడీపీ నాయకుడికి ఆర్థిక సహాయం

దొనకొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసింహనాయునిపాలేనికి చెందిన రామగిరి మీరావలి తల్లి సైదమ్మ(52) గుండెపోటుకు గురై శుక్రవారం మృతి చెందింది. గ్రామ టీడీపీ నాయకుడు శృంగారపు నాగసుబ్బారెడ్డి స్పందించి రూ.10వేలను సమకూర్చి మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ద్వారా మీరావలికి అందజేశారు. టీడీపీ నాయకులు కొత్తం రఘునాథరెడ్డి, మోడి ఆంజనేయులు, నిమ్మకాయల సుబ్బారెడ్డి, కొమ్మతోటి సుబ్బారావు, షేక్ తోహిద్, షేక్ మస్తాన్‌లు సైదమ్మ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిబంధనలు పాటించకుంటే వాహనాలు సీజ్



డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై కోటయ్య

పీసీపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని ఎస్సై జి.కోటయ్య చెప్పారు. శుక్రవారం మండలంలోని పెదఅలవలపాడు వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. అందులో భాగంగా కనిగిరి-కందుకూరు మార్గంలో తిరుగుతున్న వాహనాలను తనిఖీచేశారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని వాహనదారులకు సూచించారు.

రెస్టారెంట్‌ను పరిశీలించిన ఏడీఈ



రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ ఏడీఈ కృష్ణారెడ్డి

ముండ్లమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదర గ్రామంలో బాలాజీ రెస్టారెంట్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయిన విషయం తెలిసిందే. శుక్రవారం దర్శి ఇన్‌చార్జ్ ఏడీఈ డీ కృష్ణారెడ్డి వెళ్లి కాలిపోయిన రెస్టారెంట్‌ను పరిశీలించారు. నివాస ప్రాంతాల మధ్య ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభం మీద పక్షి పడటం వల్ల షార్ట్ సర్క్యూట్ మంటలు రేగి పక్కనే ఉన్న రెస్టారెంట్ కాలిపోయిందని ఏడీఈ గుర్తించారు. టీ చినఅంకబాబు, లైన్‌మెన్ కోటేశ్వరరావు సిబ్బంది ఉన్నారు.

జాతరకు టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ



విద్యుత్ ప్రభ ఏర్పాటుకు జెండాను ఆవిష్కరించిన డీసీ చైర్మన్ శ్రీనివాసరావు, టీడీపీ నేతలు

ముండ్లమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 12వ తేదీ జరగనున్న కొండగురునాథ స్వామి జాతర మహోత్సవం సందర్భంగా మండలంలోని వేములబండ గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రభ ఏర్పాటుకు శుక్రవారం అంకురార్పణ చేశారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం రవ్వారం వద్ద కొండగురునాథ స్వామి సన్నిధిలో ప్రభ ఏర్పాటు చేసే స్థలాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా టీడీపీ జెండాను అక్కడ ఆవిష్కరించారు. ముందుగా గ్రామ టీడీపీ నాయకులందరూ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, సర్పంచ్ సిమ్మిలి కోటేశ్వరమ్మ కుమారులు రామకృష్ణ, ప్రసాదు, సీనియర్ నాయకులు దిరిశాల వెంకటరావు, కనమర్లపూడి శంకరరావు, మామిళ్లపల్లి కోటేశ్వరరావు, కంచుమాటి శ్రీనివాసరావు, ఆకుల శేషయ్య, కంచుమాటి ఏడుకొండలు పాల్గొన్నారు.

భైరవకోన శైవక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి

పామూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం, నెల్లూరు, జిల్లాల సరిహద్దులో ఉన్న ప్రముఖ శైవ క్షేత్రమైన భైరవకోన అభివృద్ధికి నిధులు కేటాయించాలని దేవదాయ ధర్మశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని పామూరు సింగిల్‌విండో మాజీ చైర్మన్ భైరెడ్డి జయరామిరెడ్డి కోరారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉదయగిరి టీడీపీ నాయకులు చంద్ర ఉమామహేశ్వరరావు, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ హజీగౌస్, షేక్ చినహజిమలాన్‌లు ఉన్నారు.

రవాణా శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రవాణ శాఖాధికారులు

దర్శి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

చినఉల్లగల్లు ఎస్సీకాలనీలో పౌరహక్కుల దినోత్సవం

ముండ్లమూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన ఉల్లగల్లు ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం జరిగింది. తహసీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాలనీలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, వీఆర్‌వో ఎం పెద్దన్న పాల్గొన్నారు.




..వరాలిచ్చేనా?

అమరావతి అభివృద్ధి.. తీర ప్రాంతంలో పర్యాటకం పరుగులు.. రైల్వే ప్రాజెక్టులతో పాటు ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలకు అడుగులు.. కేంద్ర పథకాలతో ముడిపడి ఉన్న వివిధ కార్యక్రమాలకు నిధులు.. ఇవన్నీ కేంద్ర బడ్జెట్‌తో ముడిపడి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో శనివారం కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ తన బడ్జెట్ ద్వారా ఇచ్చే వరాల కోసం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాజధాని అమరావతి బాధ్యత తమదేనని కేంద్రం ప్రకటించింది. అదేవిధంగా కేంద్రం మంజూరు చేసే నిధులపై ఆధారపడి మూడు జిల్లాల పరిధిలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఏ మేర ఆయా ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు ఉంటోందని ప్రజలు బడ్జెట్‌పై ఆశక్తి చూపుతున్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో అమృత్ పథకం ద్వారా రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం చేయూత ఇవ్వాలని రాజధాని వాసులు కోరుకుంటున్నారు. ఇక పేద, మధ్యతరగతి వర్గాల ఆశలు ఏమేరకు ఆర్థిక మంత్రి నెరవేరుస్తారో మరికొన్ని గంటల్లో తేలిపోనున్నది.

కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల ఆశ

- నిధుల కేటాయింపుల కోసం ఎదురుచూపు
- మౌలిక సదుపాయాలకు తోడ్పాటు ఉంటుందా?
- ఆర్‌వోబీలు, ఆర్‌యూబీ నిర్మాణాలకు అడుగులు పడేనా
- తీరప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి నిధుల్లో వాటా ఉండేనా
- నిధులు కేటాయిస్తే అమరావతి రాజధాని నిర్మాణం పరుగులే



బాపట్ల, గుంటూరు జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కేంద్రమైన గుంటూరు.. సుదీర తీర ప్రాంతంతో అలరారుతున్న బాపట్ల.. అభివృద్ధి కోసం ఎదురుచూస్తోన్న పల్నాడు జిల్లాలపై కేంద్రం కరుణించేనా అన్న విషయం మరికొన్ని గంటల్లో తేలనున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ శనివారం ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నిధుల కేటాయింపులపై జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు ఎన్నెన్ని నిధులు వస్తాయోనని ఉత్కంఠ నెలకొంది. ఇక సామాన్య ప్రజలు మాత్రం నిత్యావసర సరుకుల ధరలు తగ్గాలని కోరుకుంటున్నారు. ఈ బడ్జెట్‌లో సుంకాలు తగ్గితే కొంతమేరకు ధరలు దిగి వస్తాయని మధ్య తరగతి వాసులు ఆశిస్తున్నారు. ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇస్తే మిర్చి ధరలు పెరుగుతాయని మిర్చి రైతులు కోరుకుంటున్నారు.

- రైల్వే ప్రాజెక్టుల విషయానికి వస్తే నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గం నిర్మాణ దశలో ఉన్నది. గత ఏడాది రూ.310 కోట్లు కేటాయించినా అందులో మూలధనం రూ.60 కోట్లు మాత్రమే. మిగతా రూ.250 కోట్లు ఎస్. ఫండ్ రూపంలో

(మిగతా 6వ పేజీలో)



- అమరావతి నూతన రైలు మార్గం (106 కిలోమీటర్లు) ప్రాజెక్టు వ్యయం రూ.2679.59 కోట్లు కాగా రూ.50 కోట్ల మూలధనం ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం భూసేకరణ దశలో ఉన్నది. ఈ బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా మంజూరు చేస్తే త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడానికి అవకాశం కలుగుతుంది.

అమరావతి ఆశలు

కేంద్ర ప్రభుత్వం శనివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో నవ్యాంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతిపై ఎన్నో ఆశలు రేపుతోంది. గత బడ్జెట్లో రూ.15 వేల కోట్ల సహాయం ప్రకటించి అమరావతికి ప్రాణం పోసిన కేంద్రం ఈసారి అమరావతి అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేలా కేటాయింపులు ఉంటాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలన తాలూకు ఇబ్బందులు, ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడి నవనగర నిర్మాణం పరుగులు తీయాలంటే కేంద్రం చేయూత ఎంతో అవసరమన్నది అటు కేంద్రం, ఇటు రాష్ట్రం భావిస్తున్న నేపథ్యంలో బడ్జెట్ కేటాయింపులపైనే అందరి చూపులు ఉన్నాయి. అమరావతికి మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ, సివిల్ వర్కు లతో సహా మొత్తం ఖర్చంతా కేంద్ర ప్రభుత్వ మే భరిస్తానని ఇప్పటికే హామీ ఇచ్చింది. దాదా పుగా అలైన్‌మెంటు పూర్తి కాగా రూ.16,310 కోట్లు కేంద్రమే భరించనుంది. ఈ పరిస్థితుల్లో ఇందుకు సంబంధించి బడ్జెట్లో కొంత మేర నిధుల కేటాయింపు ఉండవచ్చని భావిస్తున్నారు. విజయవాడ తూర్పు బైపాస్‌కు కేంద్ర నో చెప్పినందున ఐఆర్‌ఆర్ విషయంలో తోడ్పాటును ఇవ్వాలన్న డిమాండ్ బలంగా ఉంది. 2014- 19 మధ్య మెట్రో ప్రతిపాదనలు తెరపైకి రాగా 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేదు. కూటమి ప్రభుత్వం అధికారం లో ఉన్న నేపథ్యంలో ఈసారి కేంద్ర బడ్జెట్లో మెట్రో ప్రస్తావన ఉంటుందన్న ఆశతో రాష్ట్ర ప్రజలు ఉన్నారు. అదే విధంగా అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటా యిస్తే బాగుంటుందని పలువురు భావిస్తున్నారు. గతంలో అమృత్ పథకం కింద కేంద్రం అమరావతికి కొంతమేర చేయూత నిచ్చింది. వైసీపీ హయాంలో ఆ ప్రస్తావనే లేకుండాపోయింది.

- గుంటూరులోని కొరిటెపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిస్థితి



రిజిస్ట్రేషన్లకు.. రద్దీ

- కిటకిటలాడిన కార్యాలయాలు
- నేటి నుంచి భూములకు కొత్త ధరలు
- చార్జీల సవరణతో ఎగబడిన కొనుగోలుదారులు
- ఒత్తిడి తట్టుకోలేక పలు దఫాలు మొరాయించిన సర్వర్లు

(బాపట్ల, అద్దంకి - ఆంధ్రజ్యోతి)

నూతనంగా పెరి గిన మార్కెట్ ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. 29న అమావాస్య. దీంతో గురు, శుక్రవారాలు రిజిస్ట్రేషన్లకు జనం పోటెత్తారు. రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారితో రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. రాష్ట్ర ప్రభుత్వం శనివారం(ఫిబ్రవరి 1) నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచనున్నట్లు ప్రకటించింది. దీంతో స్థిరాస్తులు కొనుగోలు, అమ్మకాలు చేసిన క్రయ విక్రయదారులు గురు, శుక్ర వారాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు కార్యాలయాల వద్ద బారులు తీరారు. రెండు, మూడు రోజులు క్రితమే ఆయా దస్తావేజులు సిద్ధం చేసుకున్నప్పటికీ బుధ, గురు వారాలు అమావాస్యకావడంతో ఆయా రోజుల్లో పెద్దగా రిజిస్ట్రేషన్స్



బాపట్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సందడి

జరగలేదు. ఈ నేపథ్యంలో ముందుగానే దస్తావేజులు సిద్ధం చేసుకున్న వారంతా శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కట్టారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వేలాది దస్తావేజులు సబ్ రిజిస్ట్రార్‌ల టేబుళ్ళ మీదకు వచ్చాయి. మొత్తం మీద ఒక్కరోజులోనే ప్రభుత్వ ఖజానాకు కోట్లలో ఆదాయం సమకూరింది. అదే సమయంలో ఒక్కరోజు ముందు రిజిస్ట్రేషన్స్ చేసుకోవడం ద్వారా ఆయా కక్షిదారులు కొంతమేర అదనపు భారం నుంచి తప్పించుకోగలి గారు. కొన్ని ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాత్రి 10 గంటల వరకు కూడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరిగింది. పాత రిజిస్ట్రేషన్ చార్జీలకు చివరి రోజు కావడంతో శుక్రవారం జనం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కట్టారు. ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కా ర్యాలయాల్లో సందడి నెల కొంది. సాధారణంగా అయితే శుక్రవారం రిజిస్ట్రేషన్లు పేలవంగా ఉంటాయి. అయితే శనివారం నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి రానుండడంతో పాటు శుక్రవారం నెలపొడుపు కావడంతో శుభసూచకం అనే ఉద్దేశంతో కక్షిదారులు చివరి రోజు వరకు వేచి ఉన్నారు. దీంతో పెద్దసంఖ్యలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు దస్తావేజులు రావడంతో అధికారులు, సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తలమునకలయ్యారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు కొన్ని పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు రాత్రి వరకు కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరగడంతో సర్వర్లపై ఒత్తిడి పెరిగి పలు దఫాలు మొరాయించాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు విఘాతం కలిగింది. గుంటూరు కలెక్టరేట్‌లోని ప్రధాన కార్యాలయంలో, కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రాత్రి వరకూ రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ కొనసాగింది. ప్రధాన కార్యాలయంలో 220 దస్తావేజులు, కొరిటెపాడు కార్యాలయంలో 100 వరకు రిజిస్ట్రేషన్స్ జరిగాయి. రేపల్లె, బాపట్ల, అద్దంకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రాత్రి వరకు రద్దీ ఎక్కువగా కనిపించింది. అద్దంకిలో సరాసరిన రోజుకు 25 నుంచి 30 రిజస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే శుక్రవారం 110 వరకు జరిగాయి. నరసరావుపేటలో రాత్రి 7 గంటలకు 200 పైగా రిజిస్ట్రేన్లు జరిగినట్టు అధికారులు తెలిపారు. నరసరావుపేటతో పాటు సత్తెనపల్లి, క్రోసూరు తదితర ప్రాంతాల్లో రాత్రి కూడా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గురువారం నరసరావుపేటలో దాదాపు 227 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.



అద్దంకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో వేచి ఉన్న క్రయ, విక్రయదారులు

రియాల్టీపై చార్జీల ప్రభావం

ఇప్పటికే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలతో పాటు ప్రధాన పట్టణ ప్రాంతాల్లో దాదాపు 10 నుంచి 20 శాతం మేర చార్జీలు పెరిగాయి. సత్తెనపల్లి వంటి కొన్ని పట్టణాల్లో చార్జీలు దాదాపు రెట్టింపయ్యాయి. మిగిలిన పట్టణ ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య కూడళ్లలో మాత్రం కొంతమేర ఎక్కువగానే పెరిగాయి. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కొంత కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో రిజిస్ట్రేషన్స్ చార్జీలు వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై కొంత మేర ప్రభావం చూపుతుందని ఆయా వర్గాలు అంటున్నాయి. అంతేగాక పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా వాణిజ్య ప్రాంతాల్లో మార్కెట్ విలువలు భారీగా పెంచడం వల్ల ప్రజావసరాలకు ప్రభుత్వం భూములు సేకరించాల్సిన తరుణంలో ప్రభుత్వంపై భారం పడే అవకాశం ఉంది.

మిర్చియార్డు కార్యదర్శిగా చంద్రిక

- బాధ్యతల స్వీకారం.. అధికారుల అభినందనలు
- మిర్చి రైతుల శ్రేయస్సుకే ప్రాధాన్యమన్న చంద్రిక

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డు(వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఉన్నత శ్రేణి కార్యదర్శిగా చంద్రిక బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం యార్డు పరిపాలన భవనానికి వచ్చిన ఆమె చార్జి తీసుకుని ఫైలుపై సంతకం చేశారు. ఈ సందర్భంగా పలువురు సెక్రటరీలు, సిబ్బంది ఆమెకు పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. గ్రేటర్ విశాఖపట్టణానికి చెందిన చంద్రిక 2012 గ్రూపు-1 ద్వారా మున్సిపల్ పరిపాలన శాఖలో గ్రేడ్-2 కమిషనర్‌గా ప్రభుత్వ సర్వీసులోకి వచ్చారు. ఈ సందర్భంగా



చంద్రిక

ఆమె మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చియార్డుకు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పదవి తనకు ఒక సవా లు లాంటిదని, అందరి సహాయ, సహకారాలు తీసుకుని రైతులు, మార్కెట్ కమిటీ శ్రేయస్సు కోసం కష్టపడి పని చేస్తానన్నారు. ప్రస్తుతం మిర్చి సీజన్ ఉచ్ఛదశలో ఉందని, కచ్చితంగా నిరంతరం అప్ర మత్తంగా ఉంటూ యార్డు కార్యకలాపాలు సజావుగా, సాఫీగా జరిగేలా చర్యలు చేపడతానన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రాధాన్యమిచ్చి కార్యక్రమాలు అమ లు చేస్తామని చెప్పారు. అనంతరం సెక్రటరి చంద్రిక మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత చుట్టుగుంటలోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత కమి షనరేట్ అధికారులు, జాయింట్ కలెక్టర్, మిర్చియార్డు పర్సన్ ఇన్‌చార్జి అమిలినేని భార్గవతేజని మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా చంద్రికను కలిసి యార్డు కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, జయరామిరెడ్డి, ఆంజనేయులు, అధికారులు నరేంద్ర, రాఘవరావు, వేమెన్ అసోసియేషన్ల నాయకులు అభినందనలు తెలిపారు.

బాధ్యతతో సమస్యలు పరిష్కరిస్తున్నాం

- రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్‌లు నిర్మించాం
- కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపనలో మంత్రి గొట్టిపాటి

మేదరమెట్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజల పట్ల బాధ్యతతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శుక్రవారం మేదరమెట్లలో మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఎస్టీ కాలనీలో రూ.25 లక్షలతో కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేదరమెట్లలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లను నిర్మించామన్నారు. మరో రూ.80లక్షలతో మురుగు కాల్వ నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు పెట్టకుండా నీటిని సముద్రం పాలు చేసిందన్నారు. ఇసుక దోపిడీ కోసం ఆయకట్టులోని రైతులకు అన్యాయం చేశారని గొట్టిపాటి ధ్వజమెత్తారు. ఇప్పటికే రిజర్వాయర్ గేట్లు పూర్తి చేశామని, త్వరలో రిజర్వాయర్‌లో 6 లక్షల చేప పిల్లలను వదలబోతున్నామని మంత్రి తెలిపారు. ఎస్టీ కాలనీలో ఎంతో కాలంగా పొజిషన్ సర్టిఫికెట్లు లేని 374మందికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎలక్ట్రికల్ ఈఈ మస్తాన్‌రావు, సర్పంచ్ బి.ఎలీశమ్మ, టీడీపీ నాయకులు మన్నె రామారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, సింగమనేని వాసు, బొల్లేపల్లి సుబ్బారావు, కె.పూర్ణచంద్రరావు, మన్నె ప్రసాద్, చావా రాజేష్, బీజేపీ నాయకులు సాతులూరి భావన్నారాయణ, సింథైట్ ప్రతినిధులు ఏ అంజనేయులు, అబ్దుల్‌సలాం, జయరామన్ పాల్గొన్నారు.



మేదరమెట్లలో రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గొట్టిపాటి

క్రీడలతో ఒత్తిడి దూరం

- మానసిక ప్రశాంతతకు దోహదం
- పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో ఏఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఒత్తిడిని దూరం చేయవచ్చని ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్ తెలిపారు. జిల్లా వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను శుక్రవారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్ మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. తొలుత బాపట్ల, చీరాల, రేపల్లె సబ్ డివిజన్ల ఆర్మడ్ రిజర్వు పోలీసు అధికారులు, సిబ్బంది మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. అనంతరం క్రీడాకారులతో స్పోర్ట్స్‌మీట్ ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్పీ జెండా ఊపి పురుషుల 100మీటర్ల పరుగుపందెంను ప్రారంభించారు. మూడురోజులపాటు క్రీడాపోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మోయిన్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, జగదీష్‌నాయక్, పి.విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు.. రూ. 5,266 కోట్లు



విస్తరించనున్న దుర్గి - వెల్దుర్తి రహదారి



గోతులు మయంగా కొండమోడు రహదారి

- కేంద్రం నిధులతో రోడ్లకు మహర్దశ
- పలు రోడ్లు నాలుగు వరసలుగా విస్తరణ
- ఇప్పటికే కొన్ని ప్రారంభం.. మరికొన్ని వేగవంతం
- రాష్ట్ర రహదారులు.. జాతీయ రహదారులుగా అభివృద్ధి

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలోరూ.5,266 కోట్లు మంజూరుతో జిల్లా లోని రోడ్లకు మహర్దశ పట్టనుంది. రెండేళ్లలో రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చి అభివృద్ధి చేస్తోంది. కేంద్ర రహదారి మౌలిక సదుపాయల పథకం కింద జిల్లాలోని పలు రోడ్లకు ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయి. ఆయా రోడ్ల విస్తరణతో అటు బాపట్ల, ప్రకాశం ఇటు గుంటూరు జిల్లాలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. రహదారులు వినియోగంలోకి వస్తే ప్రజా రవాణా వేగవంతమవుతోంది. ఇప్పటికే రెండు జాతీయ రహదారుల పనులు పూర్తయ్యాయి. నాగార్జున సాగర్- దావులపల్లి జాతీయ రహదారిని రూ.230 కోట్లతో 47 కిలోమీటర్ల మేర రెండు వరుసలుగా విస్తరించారు. ఇటీవల ప్రధాని మోదీ దీనిని ప్రారంభించిన విషయం తెలిసిందే.

భారత్ మాలా ప్రాజెక్టులో..

కొండమోడు-పేరేచర్ల 167 ఏజీ జాతీయ రహదారి విస్తరణకు రూ.881.61 కోట్లు మంజూరయ్యాయి. భారత్ మాలా ప్రాజెక్టు కింద పనులు చేపడుతున్నారు. 49.917 కిలోమీటర్లు నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తారు. సత్తెనపల్లి, మేడికొండూరులో బైపాస్ ఏర్పాటు చేయనున్నారు. టెండర్ల ప్రక్రియ కొలిక్కిరాగా భూసేకరణ దాదాపు పూర్తయింది. పనులకు ప్రధాని మోదీ ఇటీవల విశాఖ పర్యటనలో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన విషయం తెలిసిందే.

రెండు ప్యాకేజీల్లో 167ఏ రహదారి..

కేంద్ర ఉపరితల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఓడరేవు - పొందుగల 167ఏ జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. బాపట్ల జిల్లా ఓడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డరోడ్డు వరకు నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. 85 కిలోమీటర్లు పొడవున రూ.1,064 కోట్లతో రహదారి నిర్మాణం జరుగుతుంది. ఓడరేవు నుంచి చిలకలూరిపేట వరకు రూ.678 కోట్లతో 47 కిలో మీటర్లు రహదారి పనులను ప్యాకేజీ ఒకటి కింద చేపట్టారు. చిలకలూరిపేట నుంచి అడ్డరోడ్డు వరకు 38 కిలోమీటర్లలో పనులను రెండో ప్యాకేజీలో చేపట్టారు. మొదటి ప్యాకేజీలో పనులు వేగవంతం కాగా రెండో ప్యాకేజీలో పనులు టెండరు, భూసేకరణ దశలో ఉన్నాయి.



బొప్పూడి వద్ద ఓడరేవు రహదారి విస్తరణ పనులు

వినుకొండ నుంచి పేరేచర్ల వరకు

వినుకొండ నుంచి గుంటూరు జాతీయ రహదారి 544డీ విస్తరించేందుకు కేంద్రం నిధులు (మిగతా 6వ పేజీలో)



ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అభివృద్ధికి కార్యకర్తలు పాటుపడాలి

ఎమ్మెల్యే కొండయ్య పిలుపు

చీరాలటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ కూటమి కార్యకర్తలందరూ పాటుపడాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెంకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 400 కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్య వారికి పార్టీ కండువాలను వేసి స్వాగతించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కక్షలుకార్పణ్యాలకు తావులేకుండా అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ప్రతి ఒక్కరు గ్రామీణ స్థాయిలో సమన్వయ పరచుకుని పార్టీ సంక్షేమాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. అనంతరం సిద్ధి వెంకట బుచ్చేశ్వరరావు, నాదెండ్ల కోటేశ్వరరావు గజమాలతో కొండయ్యను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.

వాసవీమాతకు పట్టువస్త్రాల సమర్పణ

నల్లగాంధీ బొమ్మ సమీపంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వాసవీమాతకు పట్టువస్త్రాలను సమర్పించారు. అంతకుముందు కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక శివదత్త క్షేత్రంలో గణపతి సచ్చిదానందసామిని ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. స్వామీజీ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా సాహితి



బీజేపీ మండల అధ్యక్షురాలుగా ఎన్నికైన సాహితిని అభినందిస్తున్న నాయకులు

ఇంకొల్లు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలిగా ఇంకొల్లుకు చెందిన కంభంపాటి సాహితి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి యడ్లపాటి స్వరూపారాణి, సహ అధికారి జగన్నాథశాస్త్రి, మండల ఎన్నికల అధికారి ఉలిచి ఏసుబాబు పర్యవేక్షణలో ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన సాహితి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మండవ రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నల్లూరి కృష్ణయ్య, నాదెండ్ల సారథి, పెనుమాల రామయ్య, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అద్దంకికి జీపు జాతా

అద్దంకిటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న జీపు జాతా శుక్రవారం అద్దంకికి చేరింది. సీపీఎం నాయకులు, కార్యకర్తలు జాతాకు స్వాగతం పలికి పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన


అద్దంకి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం పలు కార్య క్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు పంగులూరు మండలం ముప్పవరంలో సామాజిక పెన్షన్ల పంపిణీ, 10 గంటలకు ఒంగోలు లోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు పంగులూరు మండలం ముప్పవరం వద్ద టీడీపీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 3-30 గంటలకు మద్దిపాడు మండలం మల్లవరం సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద జరిగే మీనోత్సవంలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

చినగంజాం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తహసీల్దార్ జె.ప్రభాకరరావు అన్నారు. చినగంజాం పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మీకాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి, పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను అమలు చేయడం ద్వారానే సమానత్వం సాధ్యమని అన్నారు. హక్కులతో పాటు సమాజంలోని ప్రతి పౌరుడు తమ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.సుబ్బారావు, ఏపిఎం గద్దె పెద్దసుబ్బారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటకృష్ణారావు గుండెపోటుతో మృతి

ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతి



వెంకటకృష్ణారావు

పర్చూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పర్చూరు పట్టణపార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు (60) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. టీడీపీలో క్రియాశీలక నాయకునిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న తరుణంలో కూడా పంచాయతీ మెంబర్‌గా పోటీచేసి విజయం సాధించి ప్రజల సమస్యల కోసం ఆయన పనిచేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అత్యంత సన్నిహితంగా ఉంటూ పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారు. పర్చూరులోని తన నివాసంలో గుండెపోటు రావడంతో హుటాహుటీన సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

భార్య మృతి చెంది నెల గడవకముందే

నెల కిందట సతీమణి అగ్నిగుండాల శ్రీలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. భార్య మృతితో వెంకటకృష్ణారావు మానసిక ఉద్వేకానికి గురయ్యారు. నెల రోజులు గడవకముందే శుక్రవారం వెంకటకృష్ణారావు గుండెపోటుతో మృతిచెందారు. భార్యాభర్తల మృతి స్థానికులతోపాటు పార్టీ శ్రేణులను తీవ్రంగా కలచివేసింది.

వెంకటకృష్ణరావు మృతి పార్టీకి తీరనిలోటు

విధేయుడిని కోల్పోయామని, వెంటకకృష్ణారావు మృతి తనను ఎంతగానో దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

వివాహిత ఆత్మహత్య

చీరాలటౌన్ : విఠల్‌నగర్‌కు చెందిన దుంపా ముగతమ్మ (28) ఇంట్లో ఉరివేసుకొని శుక్రవారం రాత్రి మృతి చెందింది. భర్త స్థానిక హోటల్‌లో పనిచేస్తుండగా, ఇద్దరు అబ్బాయిలున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పొగాకు రైతులను వేధిస్తున్న కూలీల కొరత

- భారమవుతున్న పెట్టుబడులు
- ఆందోళనలో సాగుదారులు



పర్చూరు ప్రాంతంలో వైట్‌బర్లీ పొగాకు ఆకులను తాళ్లకు గుచ్చుతున్న కూలీలు



ఉప్పుటూరు సమీపంలో కూలీలు దొరక్క ఎండిపోతున్న పొగాకు

పర్చూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వైట్ బర్లీ సాగుకు ఉమ్మడి ప్రకాశం జిల్లా రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందింది. ఐటీసీ వంటి కంపెనీలు సాగును ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా దిగుబడితోపాటు, ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో వైట్ బర్లీ సాగు విస్తీర్ణం పర్చూరు ప్రాంతంలో గణనీయంగా పెరిగింది. ఈఏడాది దాదాపు పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాలలో 10వేల హెక్టార్లకు పైగా వైట్‌బర్లీ పొగాకును సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు అంచనావేస్తున్నారు. దీనికి తోడు గత ఏడాధి సాగుచేసుకున్న మిర్చికి తెగుళ్లు సోకడం, అరకొర దిగుబడులు, ధర లేకపోవడం పెట్టు బడులు అధికం కావడంతో అధిక శాతం రైతులు వైట్‌బర్లీ సాగువైపు మొగ్గు చూపారు. దీంతో గతంలో ఎన్నడూలేని విధంగా అంతా వైట్‌బర్లీ పొగాకు మయం అన్నట్లు రైతులు సాగు చేశారు. పెట్టుబడులను కూడా లెక్కచేయని పరిస్థితి. కౌలు పెట్టుబడులను కలుపుకొని ఎకరానికి రూ.లక్షలకు పైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. ఈఏడాది వైట్ బర్లీ పొగాకు విస్తీర్ణంగా భాగా పెరగడం, పంట చేతికి అందే సమయం ఒకేసారి రావడంతో కూలీల కొరత ఏర్పడింది. సకాలంలో కూలీలు దొరక్కపోవడంతో ఆకులు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రూ.300 నుంచి 400లోపు ఉండే కూలీ, ప్రస్తుతం 1000కి పైగా పెరగడం ఇందుకు నిదర్శనం. దీంతో సకాలంలో కూలీలు దొరక్కపోవడం, కళ్లముందే చేతికి వచ్చి పంట ఎండిపోవడంతో రైతులు దిగాలు చెందున్నారు. కూలీల కోసం రైతులు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పొరుగు ప్రాంతాల నుంచి కూలీలను దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని, దీంతో పెట్టుబడులు గణనీయంగా పెరిగిపోతున్నాయని రైతులు అంటున్నారు.

ఏబీసీ ఆయకట్టు పంటలకు నీటి విడుదల

- 18వ మైలు వద్ద 1350 క్యూసెక్కుల ప్రవాహం
- రైతుల హర్షం



ఏబీసీ కాలువ కట్ట అంచులు తగిలేలా ఉధృతంగా వస్తున్న నీరు



33వ మైలు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎన్ఎస్పీ అధికారులు

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో సాగు నీటికి శుక్రవారం పూర్తిస్థాయిలో నీటిని అధికారులు విడుదల చేశారు. ఏబీసీ కాలవ అయకట్టు పరిధిలో ఉన్న దిగువ గ్రామాలలో ఉన్న మెట్ట పంటలకు సాగు నీరు అందించేలా అధికారులు నీటిని విడుదల చేసి కాలపై పర్యటిస్తున్నారు. శుక్రవారం ఉదయంకు 18వ మైలు వద్దకు 1350 క్యూసెక్కుల నీటి విడుదల జరగ్గా మండలం వల్లాపల్లి లాకులు 33వ మైలు వద్దకు 1000 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుంది. దిగువన ఉన్న మార్టూరు, పంగులూరు మండలాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వరి, పొగాకు పంటలకు నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు అధికారులు పెద్ద ఎత్తున నీటిని విడుదల చేయించారు. 33వ మైలు వద్ద నీటి ప్రవాహాన్ని అద్దంకి ఎన్ఎస్పీ డీఈ రామకష్ణ, జేఈ క్రాంతికుమార్ ఏబీసీ పై పర్యటించారు. అన్ని మేజర్లకు నీటిని విడుదల చేయించారు. పంటలకు సకాలంలో నీరు అందించేలా చర్యలు చేపడతామని, సిబ్బందిని కాలవపై నిరంతరం ఉంచుతామని తెలిపారు. రైతులు కూడా నీటిని వృధా చేయవద్దు అని వారు ఈసందర్భంగా కోరారు. ఏబీసీకి పూర్తి స్థాయిలో నీటి విడుదల కావడంతో కాలవ అంచులు తగిలేలా నీటి ప్రవాహం కొనసాగుతుంది.

తప్పులు లేకుండా రీ-సర్వే నిర్వహించాలి



రీసర్వేని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చినగంజాం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రైతులందరూ సర్వేకి హాజరయ్యేట్లు తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, తప్పులు లేకుండా సర్వే సక్రమంగా నిర్వహించాలని చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి టి.చంద్రశేఖర్‌నాయుడు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మోటుపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేని క్షేత్రస్థాయిలో శుక్రవారం ఆయన పరిశీలించి, రెవె న్యూ అధికారులకు పలు సూచనలు అందజేశారు. అనంతరం మోటుపల్లి గ్రామ సచివాలయంలో రీసర్వే టీమ్ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ మోటుపల్లి పరిధిలోని వాన్‌పిక్, అటవీ, దేవదాయ శాఖలకు సంబంధించిన భూముల విషయమంలో ఆయా శాఖల అధికారులకు సమాచారం అందజేసి నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, డివిజన్ సర్వే ఇన్స్పెక్టర్ జీవి.ముసలయ్య, రీ సర్వే డీటీ కే.సుజాత, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రహదారులకు.. రూ.5,266 కోట్లు

(5వ పేజీ తరువాయి)

మంజూరు చేసింది. అనంతపూర్-గుంటూరు రహదారి విస్తరణలో భాగంగా వినుకొండ నుంచి పేరేచర్ల వరకు ఉన్న రహదారిని నాలుగు వరసలుగా విస్తరిస్తారు. సుమారు 90 కిలోమీటర్ల పొడవునా రహదారిని విస్తరించేందుకు రూ.2,360 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వినుకొండ నుంచి నరసరావుపేట మీదగా రహదారిని విస్తరిస్తారు. రహదారి విస్తరణకు కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. భూసేకరణతో పాటు రహదారి పనులకు ఎన్‌హెచ్ అధికారులు సమాయత్తమవుతున్నారు.

పనులు వేగవంతం.. ప్రారంభం

-దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.312 కోట్లతో 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు. ఈ పనులకు ఇటీవల మోదీ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. పనులు ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథార్టీ చర్యలు చేపట్టింది.

- దాచేపల్లి మాచర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారి 167ఏడీగా మార్చారు. రూ.403.22 కోట్లతో పనులు చేపట్టారు. దాచేపల్లి నుంచి గురజాల, రెంటచింతల, పాల్వాయిగేటు మీదగా మాచర్ల వరకు 37 కిలోమీటర్ల పొడవున పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పాల్వాయిగేటు వద్ద రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.

- సత్తెనపల్లి, గురజాల ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లపై బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సత్తెనపల్లి రెడ్డిగూడెం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.57.13 కోట్లు మంజూరు చేసింది. గురజాల నియోజవర్గంలోని తుమ్మలచెరువు - నడికూడి స్టేషన్ల మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70.49 కోట్లు మంజూరయ్యాయి.

- మాచర్ల నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.117.75 కోట్లు మంజూరు చేసింది. దుర్గి నుంచి వెల్దుర్తి వరకు 17.6 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.31.60 కోట్లు మంజూరయ్యాయి. 8/6 కిలోమీటరు వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మిస్తారు. రెంటచింతల మండలం పాలువాయి జంక్షన్ నుంచి పసర్లపాడు, జెట్టిపాలెం మీదగా సత్రశాల వరకు 11.2 కిలోమీటర్ల పొడవున రహదారి విస్తరణకు రూ.21.65 కోట్లు మంజూరయ్యాయి. ఈ రహదారిలో 2/4 కిలో మీటరు వద్ద వాగుపై బ్రిడ్జి మంజూరైంది. మాచర్ల నుంచి విజయపూరిసౌత్ వరకు 22.8 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.31 కోట్లు, లోయపల్లి నుంచి గొట్టిపాళ్ల, కండ్లకుంట, గుడిపాటి చెరువు మీదగా లచ్చంబావితండా వరకు 25.40 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.33.50 కోట్లు మంజూరయ్యాయి.

వరాలిచ్చేనా?

వస్తుందని అంచనా వేశారు.

- గుంతకల్లు - గుంటూరు డబ్లింగ్‌కు గత ఏడాది రూ.480 కోట్లు కేటాయించింది. అయితే దిగువమెట్ట వద్ద రిజర్వు ఫారెస్టులో ఇంకా కొన్ని అనుమతులు రావాల్సి ఉండటంతో పనులు జరగడం లేదు. ఈ కారణంగా అదొక బాటిల్ నెక్‌గా మారింది.

- గుంటూరు - బీబీనగర్(248 కిలోమీటర్ల) రైల్వే డబ్లింగ్‌కి గత ఏడాది రూ.220 కోట్ల మూలధనం మంజూరు కావడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇంకా ఎక్కువ మొత్తంలో నిధుల కేటాయింపు జరగాలని రైల్వేవర్గాలు ఆశిస్తున్నాయి. విష్ణుపురం వద్ద బైపాసు లైన్‌కు కూడా నిధుల కేటాయింపు ఎక్కువమొత్తంలో జరగాలని ఆశిస్తున్నారు.

- గుంటూరులో శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి ఇటీవలే రూ.109 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంత మొత్తం కేటాయిస్తారోనన్న ఉత్కంఠ నెలకొన్నది. పలకలూరు రైల్వేగేటు, ఇన్నర్‌రింగురోడ్డు రైల్వేగేటు వద్ద కూడా ఆర్‌వోబీలు మంజూరయ్యాయి. వీటికి కూడా నిధుల కేటాయింపు ఎక్కువమొత్తంలో జరగాలని పలువరు కోరుకుంటున్నారు.

- కేంద్ర ప్రభుత్వ నిధులతో పేరేచర్ల - కొండమోడు నాలుగు వరసల జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్నది. దీనికి ఏమేరకు కేటాయింపులు జరుపుతారోనని అంతా ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

- అనంతపురం - అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకి ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో, లేదోనన్న అనుమానాలు నెలకొన్నాయి.

- 72 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉన్న బాపట్ల జిల్లాకు పర్యాటకంగా కేంద్రం ఊతమిస్తే ఉపాధి పరంగా వేల సంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుంది. జిల్లా అభివృద్ధికి ఇంధనంగా ఆతిథ్యం రంగం మారే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. తొలి అడుగులో సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.93 కోట్ల కేటాయింపులకు కేంద్రం ఇటీవల పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. ఆ నిధులకు బడ్జెట్‌లో కేటాయింపులపై ఉత్కంఠ నెలకొంది.

- నిజాంపట్నం మండలం దిండి తీరప్రాంతంలో సమీకృత ఆక్వా పార్కు నిర్మాణానికి అదనంగా ఈ బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

- బాపట్ల జిల్లాలో 22,000 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుంది. ఇక్కడ నుంచి పెద్ద ఎత్తున రొయ్యలు, చేపలు విదేశాలకు ఎగుమతి అవుతాయి. కేంద్రం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఆక్వా రంగానికి రాయతీల వరాల జల్లు కురిపించడంపై రైతాంగం ఆశతో ఉంది. ఆక్వా పార్కు ప్రాజెక్టు నిర్మాణం వ్యయం పెంచడానికి గతంలోనే కేంద్రం ఆమోద తెలిపింది. రూ.90 కోట్ల నుంచి రూ.190కోట్ల వరకు పెంచే ప్రతిపాదనలకు అనుమతిచ్చింది. దీనికి సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై కూడా జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు.

వైభవంగా అష్టలక్ష్మి ఆలయ ప్రతిష్ఠోత్సవం


- శ్రీగణపతి సచ్చిదానంద స్వామి, విజయానంద తీర్థ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



ప్రతిష్ఠోత్సవానికి వచ్చిన భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న సచ్చిదానంద స్వామి

పర్చూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో నూతనంగా నిర్మించిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి సమేత అష్టలక్ష్మీ దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీ, దత్త విజయానంద తీర్థ స్వామి హాజరై ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమానికి నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని చూసి తరించారు. నూతనంగా నిర్మించిన ఆలయాన్ని పచ్చతోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నాలుగు రోజులుగా రుత్వికుల సారథ్యంలో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు జరుగుతున్నాయి. ప్రతిష్ఠ అనంతరం శ్రీ సచ్చిదానంద స్వామి మాట్లాడుతూ ఒకే ప్రాంగణంలో అన్ని దేవతామూర్తులను ఒకే చోట ఏర్పాటు చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఇలాంటి దివ్యక్షేత్రాన్ని సందర్శించుకుంటే అన్ని పుణ్యక్షేత్రాలను సందర్శించుకున్నట్లే అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి, అమ్మవార్లను ప్రార్థించారు. ఆలయ నిర్మాణంలో భాగం పంచుకున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుం డా ఉండేలా డీఎస్పీ జి.రామాంజనేయు లు, మార్టూరు, సంతమాగులూరు సీఐలు ఎం.శేషగిరిరావు, శ్రీనివాసరావు, ఆరుగులు ఎస్సైలు, 83 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాతకు పూజలు



అద్దంకిలో ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

అద్దంకి, జనవరి31(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి అమ్మవారి అగ్ని ప్రవేశ విశ్వరూప దినోత్సవం శు క్రవారం అద్దంకిలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం లో శు క్రవారం వైభవంగా నిర్వహించారు. సు ప్రభాత సేవ, వేదపారాయణం, అఖండ దీపారాధన, పంచామృతాభిషేకము, సుగంధ ద్రవ్యాలతో అభిషేకము నిర్వహించారు. బియ్యం తో అర్చన, వాసవి మూల మం త్ర హోమము నిర్వహించారు. వాసవి మూలమం త్ర హోమము నిర్వహించారు. మహిళా భక్తులచే సామూహిక లలితా సహ స్ర నామ పారాయణము, కుంకుమార్చన జరిగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో పూజ, హోమము జరిగాయి. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు వూటుకూరి రామకోటేశ్వరరావు,కార్యనిర్వహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, అర్వపల్లి హనుమంతరావు, నేరెళ్ళ శ్రీనివాసరావు, పోకూరి వెంకట శ్రీనివాసరావు ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

అమ్మ వారికి ప్రత్యేక పూజలు

మార్టూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బొడ్డురాయిసెంటరు వద్ద ఉన్న దేవస్థానంలో భక్తులు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత దేవస్థానం నుంచి మహిళలు 108 కలశాలతో ఊరేగింపుగా దేవస్థానానికి వచ్చారు. ఈ కలశాలలోని నీటితో అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేశారు. అదేవిధంగా ఆర్య వైశ్యనాయకులు వెంటరాగా మార్టూరు టౌన్ టీడీపీ నాయకులు కామినేని జనార్దన్ ఊరేగింపుగా దేవస్థానానికి చేరి తాను తీసుకువచ్చిన పట్టు వస్త్రాలను అమ్మవారికి బహుకరించారు. అనంతరం అమ్మవారిని నూతన వస్త్రాలతో అందంగా అలంకరణ చేశారు. కొంత మంది దంపతులు అగ్ని హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు మహిళలతో పాటు గుర్రం శ్రీనివాసరావు, గట్టా యానాదిరావు,సాంబయ్య, వెంకటేశ్వర్లు, కమ్మ శివనాగేశ్వరరావు, నాని, ఆంజనేయులు, వెంకట్రావు పాల్గొన్నారు.

ఎంతటి మహనీయులైనా నాడు విద్యార్థే



జయరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నేడు ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా కూడా వారు ఒకనాటి విద్యార్థి అని వేటపాలెం ఎమ్ఈవోలు సుబ్బయ్య, పురుషోత్తం అన్నారు. శుక్రవారం అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు మాగులూరి జయరావు ఉద్యోగవిరమణ సందర్భంగా జయరావు దంపతులను హెచ్ఎం బద్రిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జయరావు సుమారు 34 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పినట్లు కొనియాడారు. వారి తదుపరి జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంఎల్‌సీ స్టాకు పాయింట్‌ను పరిశీలిస్తున్న జేసీ ప్రఖర్ జైన్

స్టాకు నిర్వహణ పారదర్శకంగా చూడాలి : జేసీ

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రేషన్ స్టాకు డీలర్‌లకు జాగ్రత్తగా చేర్చడమే కాకుండా పారదర్శకంగా ప్రజలకు అందించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. శుక్రవారం వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేటలోని ఎంఎల్‌సీ స్టాకు పాయింట్‌ను జేసీ పరిశీలించారు. అక్కడ రికార్డులను నిశితంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జేసీ వెంట డీఎస్‌వో విలియమ్స్, తహసీల్దార్ గోపీకృష్ణ, సివిల్ సప్లయ్ డీటీ గీత ఉన్నారు.

రెండు నెలల్లోగా రెండు అండర్‌పాస్‌లు

- ఎమ్మెల్యే ఏలూరి కృషితో త్వరలో పనులు ప్రారంభం
- తీరనున్న ప్రయాణికుల కష్టాలు

మార్టూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళ్లే జాతీయరహదారిపై మార్టూరు మండల పరిధిలో మంజూరైన రాజుపాలెం కూడలి వద్ద పెద్ద అండరుపాస్, జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద మినీ అండరుపాస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషితో నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా వారు రాజుపాలెం కూడలి వద్ద (వీయూపీ), జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద (ఎల్వీయూపీ) నిర్మాణానికి రూ.67కోట్లను మంజూరు చేశారు. అందుకు సంబంధించి రెండు అండరుపాస్‌ల నిర్మాణాలవద్ద ఇప్పటికే నేషనల్ హైవే అధికారులు స్థలాలను, రోడ్డును పరిశీలించారు. పనులను ప్రారంభించి తర్వాత వాహనదారులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలపై హైవేవారు ప్రణాళికను తయారు చేసుకున్నారు. వాటి నిర్మాణాల పరిధిలో


రాజుపాలెం కూడలి వద్ద అండరుపాస్ లేకపోవడంతో రోడ్డు దాటుతున్న గొర్రెలు, మేకలు (ఫైల్)

చిరువ్యాపారాలు చేసుకుంటున్నవారికి అండరుపాస్ నిర్మాణ పనులు మొదలయ్యేనాటికి వాటిని ఖాళీ చేయాలని తెలిపారు. ఈ విషయమై హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. రెండు అండరుపాస్‌ల నిర్మాణాలకు టెండర్ల దశ కూడా పూర్తయ్యిందన్నారు.సంబంధిత అగ్రిమెంటు తదితర ప్రక్రియలు పూర్తయ్యాయన్నారు.రెండు నెలలు లోపు పనులు ప్రారంభమవుతాయన్నారు.


కస్తూర్బా బాలికలతో మాట్లాడుతున్న సమగ్ర శిక్షా జీసీడీవో చారులత

నూరు శాతం ఫలితాలు సాధించాలి

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రానున్న పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థినులు కష్టపడి చదవాలని సమగ్ర శిక్షా జీసీడీవో చారులత సూచించారు. శుక్రవారం మండల పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యాలయంలో చదువుతున్న పదోతరగతి, ఇంటర్ విద్యార్థినులతో ఆమె మాట్లాడుతూ బడి మానేసిన విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీ ఫలితాలలో ముందుండాలన్నారు. రానున్న రెండు మాసాలు ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యంతో చదవాలన్నారు. అలానే చదువులో వెనుక బడి ఉన్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నూతనంగా నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. ఈ తనిఖీలో ప్రిన్సిపాల్ సరళకుమారి పాల్గొన్నారు.

నిరుపేద యానాదులకు పథకాలను అందించండి

చీరాలటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీ జేవీకే కాలనీకు చెందిన యానాదులకు సంక్షేమాలు అందజేయాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. కాలనీవాసులు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో తహసీల్దార్ పార్వతి సమక్షంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలు వివరించారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే వారికి ఆధార్, రేషన్ కార్డులు అందజేసి పథకాలు చేరేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాలబాలికలకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ


విద్యార్థులకు స్టీల్ వాటర్‌బాటిళ్లను అందజేస్తున్న దాత వెంకటేశ్వర్లు

పంగులూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూజెళ్లపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల బాలబాలికలకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మద్దినేని వెంకటేశ్వర్లు దివంగత మద్దినేని ఈశ్వరయ్య, అంజమ్మ జ్ఞాపకార్థం రూ.10వేల విలువైన 90 స్టీల్ వాటర్ బాటిల్స్‌ను పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహూకరించి వితరణ చాటారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన స్టీల్ వాటర్ బాటిల్స్ సమకూర్చిన ఆర్టీసీ డ్రైవర్ వెంకటేశ్వర్లును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీరాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాన్యాలకు చట్టబద్ధత కల్పించాలి

మార్టూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రజకులకు కేటాయించిన భూ మాన్యాలను ఆక్రమణల నుంచి తొలగించి, వాటికి చట్టబద్ధత కల్పించాలని టీడీపీ బాపట్ల పార్లమెంట్ రజక సాధికార కమిటీ సభ్యులు పోలూరి సింగయ్య అన్నారు. శుక్రవారం మార్టూరులో రజకవృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగయ్య మాట్లాడుతూ రజక సంఘం నాయకులు ద్రోణాదుల వెంకటరావు, ద్రోణాదుల సాంబయ్య, శ్రీనివాసరావు, ముక్తిపాటి పర్వతాలు,పాపారావు, గోపి, సీఐటీయూ నాయకులు హనుమంతురావు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో వ్యక్తిపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన కాటూరి పద్మకు సురేష్‌కు స్థలం వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో అతను ఆమె ఇంట్లోకి చొరబడి దాడిచేయడంతో పాటు ఇంటికి తాళాలు వేసినట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలకు వెంకట్రావు మృతదేహం

అద్దంకిటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని 16వ వార్డుకు చెందిన సీపీఎం నాయకుడు గుంజి వెంకట్రావు మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుమారులు తన తండ్రి వెంకట్రావు చివరి కోరిక మేరకు మృతదేహాన్ని వైద్య కళాశాలకు అందజేశారు. తమ తండ్రి మరణం తరువాత కూడా ఆయన శరీరాన్ని కళాశాలకు దానం చేయడం వల్ల వైద్య విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వెంకట్రావు మృతేహాన్ని వైద్య కళాశాలకు దానం చేయడంతో ఎందరికో స్ఫూర్తి దాయకమని పలువురు కొనియాడారు. ఒంగోలుకు చెందిన నేత్రదానం, అవయవ, శరీర దాన పోత్సాహకుల ఐక్యవేదిక సభ్యులు అభినందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు మజుందర్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

మహాశివరాత్రి తిరునాళ్లను విజయవంతం చేయాలి

చినగంజాం, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానం 6వ వార్షికోత్సవం, మహాశివరాత్రి తిరునాళ్లను విజయవంతం చేసేందుకు సోపిరాల గ్రామస్థులంతా సహకరించాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు అన్నారు. సోపిరాలలో లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం ఆలయ వార్షికోత్సవం, మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 10న అయ్యప్ప స్వామి దేవస్థానం 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానంలో హోమాలు, అభిషేకాలు, పడిపూజ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీఎస్ఆర్.ఆంజనేయులు తెలిపారు. 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా దేవస్థానంలో స్వామి వారికి అభిషేకాలు చేయించే భక్తులకు చిన్న శివలింగం, ప్లేటు, పంచామృతాలతో భక్తులతోనే ఆలయ పూజారి అభిషేకములు చేయించే వినూతన పద్దతని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. తిరునాళ్లలో ఎనిమిది భారీ విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

లక్ష్యాలను అందిపుచ్చుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు లక్ష్యాను ఎంచుకుని, కష్టపడి చదివి వాటిని అందిపుచ్చుకోవాలని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం బ్యాంక్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ యాక్టివిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా స్థానిక రామ్‌నగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు నోట్ బుక్స్ ప్యాడ్‌లు, పెన్నులు, స్కేల్స్ వంటివి బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ వినోద్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ పల్లెపోగుత వీరాస్వామి, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


బైటమంజులూరులో రికార్డులను పరిశీలిస్తున్న చీరాల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి సుబ్బారావు

రైతుల సమక్షంలో భూ సర్వే చేపట్టాలి

పంగులూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ-సర్వేను భూయజమానుల సమక్షంలో చేపట్టాలని చీరాల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి కె.సుబ్బారావు అన్నారు. మండలంలోని బైటమంజులూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ పి.సింగారావుతో కలసి పరిశీలించారు. రీ-సర్వే సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సర్వే నిర్వహించే సమయంలో ఆ ప్రాంత రైతులను పిలవాలని, వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని తెలిపారు. వివాదాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా సర్వే ప్రక్రియ కొనసాగించాలన్నారు. గ్రామాలలో చేపట్టే రీ సర్వే కొన్ని తరాల పాటు నిలిచి ఉంటుందని, సిబ్బంది ఎలాంటి అలసత్వం లేకుండా నిజాయితీగా సర్వే చేయాలని తహసీల్దార్ సింగారావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం జరిగన కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

చింతల కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి


శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం టీడీపీ నాయకుడు చింతల శ్రీనివాసరావు తండ్రి సుబ్బయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శ్రీనివాసరావు, భార్య జడ్పీటీసీ సభ్యురాలు చింతల అంజలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో మృతి చెందిన జంధ్రాజుపల్లి పిచ్చయ్య కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. అదే గ్రామంలో మరో ఇరువురు కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమాలలో మంత్రి వెంట మండల పార్టీ సీనియర్ నాయకులు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, ధూళిపాళ్ల బుల్లిరామయ్య, దద్దాల అంజయ్య, నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, వంకాయల వెంకటరామాంజనేయులు, వెల్లలచెరువు సత్యం ఉన్నారు.

పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు


బాతులు పెంపకం చేస్తున్న వారితో మాట్లాడుతున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చదువుకోవాల్సిన పిల్లలను పనులకు పంపిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రవినాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వల్లాపల్లి గ్రామానికి ఇతర ప్రాంతం నుంచి వలస వచ్చి బాతులు పెంపకం చేస్తూ వారి పిల్లలను బడికి పంపకుండా పనులు చేయిస్తున్న వారికి తహసీల్దార్ కౌన్సిలింగ్ ఇచ్చారు. వలస పనులకు వచ్చిన పిల్లలను అక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నారు. అలా కాకుండా పనులు చేయిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ వారికి తెలిపారు. కార్యక్రమంలో సర్వే డీటీ ప్రహర్ష, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పౌరహక్కులతో జీవన మనుగడకు రక్షణ

వేటపాలెం తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పౌరుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వేటపాలెం వేటపాలెం తహసీల్దార్ పార్వతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సర్వోదయ కాలనీలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1955 పౌర హక్కుల చట్టం ద్వారా ప్రతిపౌరుడు వారి స్వేచ్ఛ జీవితం గడపవచ్చని చెప్పారు. బలవంతంగా ఇతరుల ప్రలోభాలకు లోనవాల్సిన అవసరం లేదన్నారు. హక్కుల ద్వారా సంక్షేమాలు, ప్రభుత్వం అందించే పథకాలు సాధించవచ్చని సూచించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. తహసీల్దార్ వెంట వీఆర్వో సాల్మన్, గ్రామస్థులు ఉన్నారు.


హక్కులపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ పార్వతి

సాధారణ కౌన్సిల్‌లో పొలిటికల్ హైడ్రామా

- రెండు పార్టీల కౌన్సిలర్‌లు ఢీ అంటే ఢీ
- సభ ఆరంభం నుంచే ఉత్కంఠ
- టీడీపీ కౌన్సిలర్ సత్యానందంను మూడు నెలల సస్పెండ్‌కు వైసీపీ వ్యూహం
- ఎమ్మెల్యే కొండయ్య రాకతో వ్యవహారం తారుమారు


మునిసిపల్ ఛైర్మన్‌కు డీసెంట్‌ను అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్‌లు

చీరాలటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరిగింది. సభ ప్రారంభం నుంచే పొలిటికల్ హైడ్రామా నడిచింది. ముందుగా వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు మాట్లాడుతూ గత నెలలో జరిగిన సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ సల్లూరి సత్యానందం ఛైర్మన్ హోదాకు విలువలేదని అన్నారని, రాజ్యాంగ విధివిధానాలకు కట్టుబడి ఎంతో విలువైన స్థానాన్ని అపహాస్యం చేస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు హేయమన్నారు. సభ జరగాలంటే ముందు సత్యానందం క్షమాపణ కోరాలని లేదా అతనని సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సత్యానందం బదులిస్తూ ఛైర్మన్ హోదాకు ఎక్కడా భంగం కలిగించలేదని అలా జరిగి ఉంటే వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పారు. అతనికి టీడీపీ మరో కౌన్సిలర్ సాంబశివరావు మద్దతు పలికారు. దీంతో ఆరంభమైన రగడ హోరాహోరీగా మారింది. వైసీపీ కౌన్సిలర్‌లు గుంటూరు ప్రభాకరరావు, కీర్తి వెంకటరావు, బత్తుల అనిల్‌కు టీడీపీ కౌన్సిలర్‌లు మించాల సాంబశివరావు, సత్యానందం, సూరగాని లక్ష్మి, గోలి స్వాతి తదితరుల మధ్య వాడి వేడిగా వాదనలు జరిగాయి. ఒకరిపై ఒకరు ఘాటుగా విమర్శించుకున్నారు. ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు వైసీపీ కౌన్సిలర్‌లకు అనుకూలంగా మాట్లాడారు. దీంతో టీడీపీ కౌన్సిలర్ సత్యానందంను మూడు మాసాలు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు.

కౌన్సిల్‌లో వాణి వినిపించిన కౌన్సిలర్ లక్ష్మి

అనంతరం అజెండాలోని 27 అంశాలకు గాను రెండు మూడు అంశాలపై


సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కొండయ్య

అభ్యంతరాలు తెలుపుతూ మిగిలిన వాటిని పాస్ చేయాలని వారికి వారే చెప్పారు. దీంతో 5వ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు తీరుపై అసహనం చెందారు. వైసీపీ కౌన్సిలర్‌లు మాట్లాడుతున్నప్పుడు వారికి సహకరించి టీడీపీ సభ్యులు మాట్లాడుతున్నప్పుడు మాట్లాడనివ్వడం లేదని మండిపడ్డారు. ఇది పద్ధతి కాదని సభలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేద ప్రజలకు, పూట కూలీలకు నాణ్యమైన ఆహారం అందించే దిశగా అన్న క్యాంటీన్‌లు ప్రారంభిస్తే వాటి ఆధునికీకరణలో భాగంగా వైఫై కనెక్షన్, సీసీ కెమెరా, ఫుడ్ వేయింగ్ మిషన్, డోర్లు విండో గ్లాస్‌లకు అవసరమైన మరమ్మతులకు సంబధించిన అంశాలను రద్దు చేయాలని వైసీపీ కౌన్సిలర్‌లు, ఛైర్మన్ వ్యవహరించిన తీరు ఘోరమన్నారు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్యా వాద సాగింది. మిగిలిన అంశాలు పాస్ అంటూ కౌన్సిలర్ ముగించే దశలో ఉండగా ఎమ్మెల్యే కొండయ్య రాకతో వైసీపీ వ్యూహాలు తారుమారయ్యాయి.

అసాధారణమైన సభను ప్రశంతంగా జరిపించండి

- ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ఈవిధమైన వివాదాలు రేగుతుండగా ఎమ్మెల్యే, ఎక్స్ అఫిషియో సభ్యుడు ఎంఎం కొండయ్య రాకతో పరిస్థితులు మారిపోయాయి. సభలో చోటుచేసుకున్న పరిస్థితులను కౌన్సిలర్‌లు ఎమ్మెల్యేకు వివరించారు. ఇది జరుగుతుండగా కొందరు వైసీపీ సభ్యులు వెళ్లిపోయారు. దీంతో మళ్లీ ఎక్స్ అఫిషియో సభ్యులను గౌరవించకపోవడం సభామర్యాద కాదని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విలువైన సమయాన్ని వృథా చేయకూడదన్నారు. ప్రశాతంమైన వాతారణంలో అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించి ఆమోదించాలని తెలిపారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు పట్టంగట్టారని ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పటికే రూ. 10కోట్లతో పనులు చేసినట్లు వివరించారు. త్వరలో మరో రూ.2కోట్లు మంజూరవుతున్నట్లు చెప్పారు. ఈసమయంలో సభను సజావుగా నిర్వహించాలన్నారు. తమ కౌన్సిలర్లు బయటకు వెళ్లారంటూ సభను 10 నిమిషాలు వాయిదా వేశారు. తిరిగి సభకు హాజరైన ఛైర్మన్ సత్యానందం తీరుపై తమకౌన్సిలర్‌లు అసంతృప్తిగా ఉన్నారని సభను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే కొండయ్య వాయిదా వేయడం సమంజసం కాదని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని, అవసరమైతే అవిశ్వాస తీర్మానం ప్రకటిస్తామని హెచ్చరించారు. అయినా కూడా ఛైర్మన్ సభ నుంచి వెళ్లిపోయారు. దీంతో టీడీపీ కౌన్సిలర్‌లు ఛైర్మన్‌కు డీసెంట్‌ను అందజేశారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

నిలిచిపోయిన పనులు మార్చి లోపు పూర్తికి చర్యలు

అద్దంకి, జనవరి31(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సమావేశం శుక్రవారం సాదాసీదాగా సాగింది. ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశం ఉదయం 11-30 గంటలకు ప్రారంభమై అర్ధగంట సమయానికే ముగిసింది. అజండాలోని 34 అంశాలను ఆమోదించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను మార్చిలోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంకా పనులు ప్రారంభించని మూడు రోడ్లకు సంబంధించి గత టెండర్‌లు రద్దు చేసి మరలా టెండర్‌లు పిలవాలని కౌన్సిల్‌లో తీర్మానించారు. ప్రధానంగా కొత్తగా వీధి లైట్లు ఏర్పాటు, మంచినీటి సరఫరా మెరుగు కు అవసరమైన కొత్త మోటార్ లు కొనుగోలు తదితర అంశాలను ఆమోదించారు. ఇళ్ల ప్లాన్‌ల అప్రూవల్‌కు సంబంధించి ప్రభుత్వం సడలింపులు


మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

ఇచ్చినందున ప్రజలు వినియోగించుకోవాలని టీపీఎస్ లక్ష్మీ కోరారు. వైస్ ఛైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్‌లు, మేనేజర్ శ్రీదేవి, ఏఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు. పలువురు వైసీపీ కౌన్సిలర్‌లు సమావేశానికి గైర్హాజరయ్యారు.

పశు ఆరోగ్య శిబిరాలతో పాడి పరిశ్రమ వృద్ధి

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలతో గ్రామాలలో పాడి పరిశ్రమ వృద్ధి చెందుతుందని పశు వైద్యాధికారులు మహేశ్వరరావు, పావనీకుమారి తెలిపారు. మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా గ్రామంలో ఉన్న గేదెలు, దూడలు, గొర్రెలకు మందులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పుమాగులూరి శాంతి, నీటి సంఘం అధ్యక్షుడు కక్కెర సుబ్బారావు, గ్రామ పెద్దలు దేవినేని నరేంద్ర, అమరనేని కాశీయ్య, వినోద్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం లభ్యం

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి సమీపంలో గల జాతీయ రహదారిలో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈమేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గంగమ్మ తల్లికి రెండున్నర కేజీల వెండి తొడుగును అందజేస్తున్న గిరిరాజ్ గ్రానైట్ క్వారీ యజమాని లక్ష్మీనారాయణ దంపతులు

వీర్ల గంగమ్మకు వెండి తొడుగు బహూకరణ

బల్లికురవ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రసిద్ధి చెందిన వీర్ల గంగమ్మ దేవాలయానికి గిరిరాజ్ గ్రానైట్ క్వారీ యజమాని రావిపూడి లక్ష్మీనారాయణ ప్రమిలాదేవి దంపతులు శుక్రవారం రెండున్నర కేజీల వెండి తొడుగును బహూకరించారు. ఈ మేరకు వెండితొడుగును ఆలయ పూజారికి అందజేశారు. వీర్ల కొండ వద్ద గల గిరిరాజ్ గ్రానైట్ క్వారీ యజమాని లక్ష్మీనారాయణ గంగమ్మతల్లికి రూ.2.50లక్షలు వెచ్చించి అమ్మవారి మూలవిరాట్‌కు తొడుగును తయారు చేయించి అందజేశారు. గతంలో ఆలయంలో చోరీ జరిగి అమ్మవారికి చెందిన వెండి వస్తువులు పోయాయి. దీంతో దేవాలయ పూజారి చల్లగుండ్ల శ్రీనివాసరావు అమ్మవారికి కావాల్సిన వెండి ఆభరణాలగురించి భక్తులకు తెలియజేశారు. దీంతో వెండి తొడుగును అందించారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న గంగమ్మ వార్షిక తిరునాళ్ల సందర్భంగా అమ్మవారు వెండి వస్తువులతో భక్తులకు ప్రత్యేక దర్శనం ఇవ్వనున్నారు.

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఇస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ ఫిబ్రవరి నెలకు శనివారం జరగనుంది. జిల్లా వ్యాప్తంగా 3,08,266 మంది పింఛనుదారులకు రూ.132.23 కోట్లను పంపిణీ చేయనున్నారు. 768 మంది ప్రభుత్వ సిబ్బంది శనివారం ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టనున్నారు. పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి తెలిపారు.

నిర్మలమ్మ.. కరుణించేనా!?

అన్ని వర్గాల ప్రజలను ఊరిస్తున్న కేంద్ర బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టబోతున్నారు. జిల్లాలోని కేంద్ర పథకాలకు నిధుల మాట అటుంచితే మధ్య తరగతి ప్రజలే ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు. వార్షిక ఆదాయ పరిమితిని పెంచడంతోపాటు పన్ను విధానంలోనూ మార్పు తెస్తారా!? అని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

• జిల్లా ప్రాజెక్టులకు నిధులు దక్కేనా!? • వేతనజీవుల్లోనూ చిగురిస్తున్న ఆశలు



• నేడు కేంద్ర బడ్జెట్

నెల్లూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌పై జిల్లావాసుల అంచనాలు పెరిగిపోతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు జతకట్టిన క్రమంలో, బీజేపీకి అత్యంత సన్నిహితుడైన జనసేనాని పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండటంతో నేటి బడ్జెట్‌లో పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయని, భారీగా నిధులు కేటాయిస్తారని ప్రజలు ఆశ పడుతున్నారు. మొన్నటి ఓట్ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై కూడా జిల్లా ప్రజలు అంచనాలు పెట్టుకున్నా నామమాత్రపు నిధులతో సరిపెట్టారు. నేటి బడ్జట్‌లో నిధుల విడుదల భారీగానే ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



• ప్యాసింజర్ రైలు కలేనా!?

మెట్టవాసులకు ప్యాసింజర్ రైలు ప్రయాణం కలగానే మిగిలిపోయింది. కృష్ణపట్నం - ఓబులాపురం రైల్వే లైను పూర్తయి గూడ్సు రైళ్లు పరుగెడుతున్నాయి. ఆ మార్గంలో ప్యాసెంజర్ రైళ్లు నడుపుతామని ఉప రాష్ట్రపతి హోదాలో వెంకయ్యనాయుడు హామీ ఇచ్చారు. కానీ రోజులు గడుస్తున్నా ప్యాసింజర్ రైలు నడపడం లాభదాయకం కాదని రైల్వే శాఖ మిన్నకుండిపోయింది. ఈ మార్గంలో ప్యాసింజర్ రైలు నడిపితే రాయలసీమ - నెల్లూరు ప్రాంతాలకు రాకపోకలు సులభమవుతాయి. గూడూరు-విజయవాడ మధ్యలో రైల్వే ఫ్లైఓవర్లు నిర్మించాలని గతిశక్తి పథకంలో ప్రతిపాదించారు. కానీ అవి కూడా ఆచరణకు నోచుకోలేదు.

● నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ ప్రాజెక్టు ప్రారంభమై పుష్కరకాలం గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు. ఆశించిన స్థాయిలో నిధులు దక్కకపోగా, భూసేకరణ కూడా పూర్తి కాలేదు. ఈ రైల్వే లైనుపె మెట్టప్రాంత వాసులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు. ప్రతి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఎదురుచూస్తున్నా నిరాశే ఎదురవుతోంది. ఈ బడ్జెట్‌లో అయినా నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు.


వెంకటాచలంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి కేటాయించిన 5 ఎకరాల భూముల చుట్టూ నిర్మించిన ప్రహరీ

• తెలుగు అధ్యయన కేంద్రంలో కదలిక వస్తుందా!?

వెంకయ్యనాయుడు మానస పుత్రిక ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం. కేంద్ర మంత్రిగా, ఉప రాష్ట్రపతిగా ఉన్న సమయంలో వెంకయ్య పట్టుబట్టి జిల్లాకు ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రాన్ని సాధించుకొచ్చారు. కానీ ప్రధాన భవన నిర్మాణానికి ఇప్పటివరకు నిధులు విడు దల కాలేదు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా రూ.2 కోట్లు మాత్రమే కేటాయించింది. ఆ నిధులతో ప్రహరీ, ఆర్చి, గార్డ్ రూంలు నిర్మిస్తున్నారు. ప్రధాన భవన నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో అయినా నిధులు కేటాయిస్తారని తెలుగు భాషాభిమానులు ఎదురుచూస్తున్నారు.

● విశాఖ-చెన్నై కారిడార్ మాటేమిటి!?

చెన్నై- బెంగళూరు ఇండ్రస్టియల్ కారిడార్ పనులు ఊపందుకున్నాయి. కృష్ణపట్నం పోర్టును అనుసంధానంగా క్రిష్‌సిటీని 2500 ఎకరాల్లో ఫస్ట్ ఫేస్ కింద అభివృద్ధి చేస్తున్నారు. అయితే విశాఖ-చెన్నై కారిడార్‌లో కదలిక లేదు. ఈ ప్రాజెక్టు పనులు మొదలైతే పారిశ్రామికంగా జిల్లా మరింత అభివృద్ధి చెందుతుంది. కేంద్ర బడ్జెట్‌లో విశాఖ-చెన్నై కారిడార్‌లో కదలిక వస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.

● ఇదిలా ఉంటే ఆదాయ పన్ను విధానం పెంపుపై వేతనజీవులు ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఇప్పటివరకు రూ.3 లక్షల వార్షికాదాయం వరకు పన్ను పోటు లేదు. ఈ పరిమితిని రూ.5.7 లక్షలకు పెంచాలి. అలాగే వార్షిక ఆదాయ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలని కోరుతున్నారు. అలాగే ప్రస్తుతం బ్యాంకు పొదుపు ఖాతాలోని మొత్తాలపై వచ్చే వార్షిక వడ్డీ కనీసం రూ.20వేలకైనా పెంచాలని వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. మరోవైపు మధ్య తరగతి ప్రజలు, వేతన జీవులకు ప్రధాన ఊరట ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద లభించే మినహాయింపులే. ప్రస్తుతం పాత పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి ఈ సెక్షన్ కింద వివిధ ఖర్చులు, పెట్టుబడులకు రూ.1.5 లక్షల వరకు మినహాయింపు ఇస్తున్నారు. ఇది రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలైనా ఉండాలని మధ్య తరగతి పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు.


చవటపాళెం పంచాయతీ పరిధిలో ఎన్‌సీఈఆర్‌టీకి కేటాయించిన 52 ఎకరాల భూములకు సంబంధించి ఆవిష్కరించిన శిలాఫలకం

● జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలికి (ఎన్‌సీఈఆర్‌టీ) వెంకటాచలం మండలం చౌటపాలెం వద్ద శంకుస్థాపన చేసి ఏడేళ్లు దాటింది. కానీ నేటికీ ఆ సంస్థకు పునాదులు కూడా పడలేదు. భూసేకరణ జరగకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

● హైవేలకు నిధుల మాటేమిటి?

ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో దాదాపు రూ. మూడు వేల కోట్లతో ఏడు జాతీయ రహదారులను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ప్రతిపాదించారు. ఈ రహదారులు పూర్తయితే జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుంది. డీపీఆర్ సిద్ధమైనప్పటికీ నిధులు లేక ఈ ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదు. నెల్లూరు-తడ మధ్య జాతీయ రహదారిలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ఈ రోడ్డు విస్తరణకు ఎప్పటి నుంచో విజ్ఞప్తులు అందుతున్నాయి. ఈ బడ్జెట్‌లో అయినా విస్తరణకు అనుమతి లభించాలని ప్రజలు కోరుకొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.8400 కోట్ల అంచనాతో

జల్ జీవన్ మిషన్ పనులు

• ప్రతి గ్రామంలో మంచినీరు అందించడమే లక్ష్యం
• ఇంజనీరింగ్ అధికారుల సమీక్షలో మంత్రి ఆనం


ఇంజనీరింగ్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

నెల్లూరు (హరనాథపురం) జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అమృతధార-2 పేరుతో ఉమ్మడి నెల్లూరుజిల్లాలో రూ.8400 కోట్లతో ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చడానికి బృహత్తర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమీక్షించారు. గత ప్రభుత్వంలో మంజూరైన జల్ జీవన్ పనులను రద్దు చేసి కొత్త

- మిగతా4లో

పెరిగిన మార్కెట్ విలువలు ఇలా...

ప్రాంతం	చదరపు గజం (రూ.లలో) ప్రస్తుతం	పెరిగినది
నెల్లూరు		
వీఆర్సీ సెంటర్	38,000	42,000
ట్రంకురోడ్డు	46000	51000
పెద్దబజారు	38000	42000
పొగతోట	38000	42000
హరనాథపురం	14300	16000
రామలింగాపురం	23000	26000
డైకస్‌రోడ్డు	11500	13000
పొట్టేపాళెం	2500	3250
స్టోన్ హౌస్‌పేట	28000	32000
బాలాజీనగర్	15000	16500
ధనలక్ష్మీపురం	4000	5500
బుజబుజనెల్లూరు	3700	5000
కాకుటూరు	2700	3600
కల్లూరుపల్లి	6000	7200
ఆచారివీధి	38000	41600
భూములు (ఎకరా)		
● కొండాయపాళెం	81 లక్షలు	1.05 కోట్లు
● కనుపర్తిపాడు	21.25 లక్షలు	27లక్షలు
● దేవరపాళెం	9.46 లక్షలు	12.30లక్షలు
● పొట్టేపాళెం	48.15 లక్షలు	63.37లక్షలు
కావలి		
కావలి ట్రంకురోడ్డు	35000	40000
జనతాపేట	11000	13000
ముసునూరు	10000	11500
మద్దూరుపాడు	6000	7000
గౌరవరం	5000	6000
● భూములు (ఎకరా)		
కావలి బిట్ వన్	57లక్షలు	65లక్షలు
గౌరవరం	15లక్షలు	20లక్షలు
కోవూరు	3500	4000
పడుగుపాడు	4700	5000
ఇనమడుగు	2500	3000
ఆత్మకూరు		
● జేఆర్‌పేట	5000	6000
● అనంతసాగరం	800	1000
● ఏఎస్‌పేట	1100	1400
ముత్తుకూరు	10000	11500
కందుకూరు	2600	2800
ఇందుకూరుపేట	2000	3000
నరుకూరు	1500	2000
గుడిపల్లిపాడు	3000	4000


నెల్లూరు : విద్యుద్దీప వెలుగుల్లో సీపీఎం కార్యాలయం

సీపీఎం మహా వేడుక

● నేటినుంచి నెల్లూరులో రాష్ట్ర మహాసభలు
● మూడు రోజులపాటు నిర్వహణ
● విస్తృత ఏర్పాట్లు చేసిన పార్టీ శ్రేణులు
● బృందాకారత్, ఎంఏబేబి, బీవీ రాఘవులు వంటి అగ్రనేతల రాక
● 3న నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

నెల్లూరు (వైద్యం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్కిస్ట్, సీపీఎం) రాష్ట్ర 27వ మహాసభలు శనివారం నుంచి మూడు రోజులపాటు నెల్లూరులో జరగనున్నాయి. 1978 తర్వాత అంటే 47 ఏళ్ల అనంతరం ఈ మహాసభలు నగరంలో జరుగుతుండటంతో సీపీఎం నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు పూర్తి చేశారు. సభలు జరిగే అనిల్ గార్డెన్స్‌కు సీతారాం ఏచూరి ప్రాంగణంగా నామ కరణం చేసి శుక్రవారానికి సర్వం సిద్ధం చేశారు. నగర మంతా పెద్ద పెద్ద హోర్డింగ్‌లతో పాటు ఎర్రజెండాలతో సుందరంగా తీర్చిదిద్దారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్, ఎంఏ బేబి, బీవీ రాఘవులు ప్రత్యేక పరిశీలకులుగా వ్యవహరిస్తుండగా, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించనున్నారు. మహాసభల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 5 పతాక యాత్రలు నెల్లూరుకు చేరుకుని నేతల పతాక ఆవిష్కరణలో పాల్గొంటాయి 500 మంది ప్రతినిధులు పాల్గొనే ఈ సభలు సజావుగా సాగేందుకు జిల్లాకు చెందిన మరో 5వేల మంది సీపీఎం నాయకులు, కార్యకర్తలు వలంటర్లుగా వ్యవహరిస్తున్నారు.

3న భారీ సభ

అనిల్ గార్డెన్స్‌లో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలకు రాష్ట్రం నుంచే కాకుండా జాతీయ స్థాయి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. ఇందులో ప్రారంభ సమావేశాలతోపాటు అంతర్గత సమావేశాలూ జరగనున్నాయి. మూడవ రోజు సోమవారం నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి వీఆర్సీ వరకు భారీ ప్రదర్శన జరగనుంది. అనంతరం వీఆర్సీ క్రీడా మైదానంలో జరిగే బహిరంగ సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్ పాల్గొని ప్రసంగిస్తారు. అలాగే చివరిరోజున పార్టీ అంతర్గత సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక కూడా జరుగనుంది.



వాసవీ మాతా.. పాహిమాం!

కన్యకాపరమేశ్వరి ఆలయంలో వైభవంగా అగ్ని ప్రవేశ మహోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్యులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వాసవీ కన్యకాపరమేశ్వరి అగ్నిప్రవేశ మహోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించి నిర్వహించింది. ఉదయం రంగనాథ స్వామి ఆలయం వద్ద పెన్నానదికి పూజలు చేసి 102 మంది గోత్రీకులు కలిశాల్లో నదీ జలాన్ని సేకరించి ఊరేగింపుగా కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకున్నారు. ఆ జలాలతో అమ్మవారిని అభిషేకించారు. అనంతరం విశేష పూజలు, హోమాలు, కుంభ సంప్రోక్షణ జరిగాయి. సాయంత్రం కన్యపూజ, సువాసినీ పూజ, నిప్పుల గుండ ప్రవేశం నిర్వహించారు. భక్తులు వాసవీ మాత నామ స్మరణ చేస్తూ అగ్ని గుండం తొక్కారు. ఈ సందర్భంగా భక్తుల దేవీ నామ స్మరణ మారుమోగింది. ఆలయ పాలక మండలి పర్యవేక్షించింది.




నెల్లూరులోని రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న జనం

నేటి నుంచి భూముల విలువ పెంపు

10 నుంచి 30 శాతం వరకు పెరుగుదల
13 అభ్యంతరాలకు ఆమోదం
ప్రతిపాదనల్లో మార్పుతో తాజాగా అమలు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 31 : జిల్లాలో భూములు, స్థలాల మార్కెట్ విలువ పెంపునకు రంగం సిద్ధమైంది. శనివారం నుంచి నూతన విలువలు అమల్లోకి రానున్నాయి. జిల్లాలో 10 నుంచి 30 శాతం వరకు ధర పెంచాలని నిర్ణయించారు. నెల్లూరు నగరంలో వాణిజ్య, మాస్టర్ ప్లాన్ రోడ్లున్న ప్రాంతాల్లో భూముల విలువను సవరించారు. రిజిస్ట్రేషన్ శాఖకు నెల్లూరు రూరల్, అర్బన్, కందుకూరు, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మ కూరు, వెంకటాచలం, ఇందుకూరుపేట, టీపీ గూడూరు, ముత్తుకూరు మండలాల నుంచి 65 శాతం ఆదాయం వస్తోంది. మిగిలిన 35 శాతం ఆదాయం ఇతర మండలాల నుంచి లభిస్తోంది. ఇందుకు తగ్గట్టుగా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు. ఆర్డీవోలను, నుడాను సంప్రదించి విలువల పెంపునకు నివేదికలు తయారు చేశారు. అయితే మార్కెట్ విలువ పెంపుపై పలు వర్గాల నుంచి అభ్యంతరాలు రావటంతో జనవరి 1 నుంచి అమలు కావలసిన ప్రక్రియ వాయిదా పడింది. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో వచ్చిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 17 అభ్యంతరాలు రాగా, వాటిలో 13 అభ్యంతరాలకు ఆమోదం తెలిపారు. గత ప్రతిపాదనల్లో మార్పులు చేసిన తరువాత కొత్తగా తయారు చేసిన నివేదికలకు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఆమోదం తెలిపారు.

మౌలిక వసతులు, అభివృద్ధి ప్రామాణికంగా...

ఈసారి మార్కెట్ విలువల పెంపునకు అభివృద్ధి, మౌలిక వసతులను ప్రామాణికంగా తీసుకున్నారు. జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ రోడ్ల పక్కనుండే భూములకు మంచి డిమాండ్ ఉంది. జిల్లాలో కొత్తగా లేఔట్లు, నిర్మాణాలు ఎక్కడ వస్తున్నాయో అక్కడ బహిరంగ మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ ధరలు మాత్రం చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో విలువైన భూముల మార్కెట్ విలువ పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో చాలా ప్రాంతాలలో వ్యవసాయ భూములు ఇళ్ల స్థలాలుగా మార్పు చెందాయి. కొత్త వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ భూములను, వ్యవసాయేతర భూములుగా మారుస్తున్నారు. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ఏటా ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకొకసారి రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతారు. ఈసారి పట్టణ, గ్రామీణ ప్రాంతాలు రెండింటిలోనూ ఫిబ్రవరి 1 నుంచి విలువలు పెరగనున్నాయి.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోటెత్తిన జనం

భూములు, స్థలాల మార్కెట్ విలువ శనివారం నుంచి పెరగనుండ టంతో శుక్రవారం రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు జనం పోటెత్తారు. జిల్లా రిజిస్ట్రార్, అన్నీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆస్తుల కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. భూముల విలువ పెరిగితే తదనుగుణంగా స్టాంప్ డ్యూటీ పెరుగుతున్నందున ఆ భారాన్ని తగ్గించుకునేందుకు ఎక్కువ మంది దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు తరలివచ్చారు. అయితే సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు కొంతమేర ఆటంకం కలిగింది. నెల్లూరులోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు జనం ఎక్కువ సంఖ్యలో వచ్చారు.శుక్రవారం ఒక్కరోజే 750 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరగడం విశేషం. రూ.2.50కోట్ల నుంచి రూ.3కోట్లకు పైబడి రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం వచ్చినట్లు సమాచారం. జనాల రాకను ముందుగానే ఊహించిన అధికారులు వారికి తగిన ఏర్పాట్లు చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాఫీగా సాగింది.

ప్రభుత్వం మారి 10 నెలలైనా..

ప్రభుత్వం మారి 10నెలలైనా నార్తుమోపూరు సచివాలయం భవనంపై ఇప్పటికీ మాజీ సీఎం ఫొటోలు కన్పిస్తున్నాయి. నూతనంగా నిర్మించిన నాటి నుండి సదరు భవనంపై ఉన్న ఈ ఫొటోలు మాత్రం అధికారులు చెరిపివేసే ప్రయత్రం చేయలేదు. భవనం ఉండేది ప్రధానరోడ్డులో అయినా దీన్ని ఎవరూ గమనించకపోవడం గమనార్హం. ఇదంతా చూస్తుంటే ఈ అధికారులకు పాతాభిమానం తగ్గలేదనే విషయం తేటతెల్లమవుతోంది.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)





తుప్పుపడుతున్న చెత్త తరలింపు రిక్షాలు

గ్రామ పంచాయతీల్లో చెత్తాచెదారాన్ని చెత్త సంపద కేంద్రాలకు తరలించేందుకు మంజూరు చేసిన చెత్త తరలింపు రిక్షాలు ఎండ, వానకు తడుస్తూ తుప్పుపట్టి పోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)



నాపరాళ్లే చేనుకు రక్ష..

వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగించే మెట్ట ప్రాంత రైతులు పంటలను కాపాడుకునేందుకు నూతన విధానాలకు శ్రీకారం చుడుతూ ముందుకు సాగుతున్నారు. సాధారణంగా ఇనుప, ముళ్ల కంచెలు, పాత చీరలు, దుస్తులు పొలం చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసుకోవడం పరిపాటి. అయితే అందుకు భిన్నంగా మండలంలోని ఆర్లపడియ గ్రామానికి చెందిన కొంత మంది రైతులు శాశ్వతంగా పంటకు రక్షణగా నిలిచేలా నాపరాళ్లను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఏటా పెట్టుబడులు పెట్టే అవసరం ఉండదని, కొంతమేర ఆర్థికభారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అటుగా ప్రయాణాలు సాగించే ప్రతి ఒక్కరూ రహదారికి ఆనుకొని ఉన్న పొలాలను చూసి రైతుల ఆలోచనను అభినందిస్తున్నారు.

- ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)

నేడు జగన్నాథ రథయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శనివారం శ్రీగౌర నిత్యాయ్ (జగన్నాథ - బలరామ్) 12వ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి పేర్కొన్నారు. ఈ యాత్ర మధ్యాహ్నం 2.30 గంటలకు మూలాపేట హనుమాన్ విగ్రహం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. రథయాత్ర అలంకార్ సెంటర్, మూలాపేట, బారకాసు, పెద్దబజారు, చిన్నబజారు, ములుముడి బస్టాండ్, సంతపేట, ఏసీ బొమ్మ, గాంధీబొమ్మ, వీఆర్సీ సర్కిల్ మీదుగా ఆర్టీసీ బస్టాండు ఎదుట ఉన్న సర్వోదయ కళాశాల మైదానానికి చేరుకుంటుందని వివరించారు. అక్కడ ముగింపు సభ జరుగుతుందని, భక్తులందరూ యాత్రలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌పై నేడు ట్రయల్ రన్

- 3 నుంచి పూర్తిస్థాయిలో అమలు

నెల్లూరు(క్రైం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని రవాణా శాఖ జిల్లా కార్యాలయంలో నూతనంగా నిర్మించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌పై రవాణా శాఖ అధికారులు శనివారం ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. అత్యాధునిక టెక్నాలజీతో 13 సెన్సార్లు, 14 వీడియో కెమెరాలు, 8 వీఎంఎస్ బోర్డులు, సెన్సార్లతో కూడిన పదుల సంఖ్య బుల్లెట్లతో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ సిద్ధమైంది. శనివారం ఉదయం 11 గంటలకు ఈ ట్రాక్‌పై డీటీసీ చందర్ పర్యవేక్షణలో రవాణా శాఖ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఆ ట్రాక్‌పై పూర్తిస్థాయిలో డ్రైవింగ్ టెస్ట్‌లు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.

పుస్తక మహోత్సవానికి విశేష స్పందన



జక్కా వెంకయ్య ఆత్మకథ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, మంతెన సీతారామ్ తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ మైదానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న సింహపురి పుస్తక మహోత్సవానికి పుస్తక ప్రియులు నుంచి మంచి స్పందన లభిస్తోంది. సాహితీవేత్తలు, విద్యావేత్తలు విద్యార్థులతోపాటు పుస్తక ప్రియులు ఈ ఉత్సవంలో పాల్గొని తమకు నచ్చిన పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా శుక్రవారం పలు కార్యక్రమాలు జరిగాయి. మూఢనమ్మకాలు, బురిడీబాబాలు చేస్తున్న మోసాల గురించి జనవిజ్ఞాన వేదిక సభ్యులు తమ ప్రయోగాల ద్వారా అవగాహన కల్పించారు. చంటి బిడ్డలతో మహిళ గాజు పెంకులపై నడిచి అందులో ఉన్న శాస్త్రీయ కోణాన్ని విద్యార్థులకు వివరించారు. బురిడీ బాబాలు చేసే గారడీలను మిమిక్రీ ద్వారా వివరించారు. కూల్‌డ్రింక్ ట్రిక్స్, తాడు ట్రిక్స్‌లను ప్రదర్శించారు. చైతన్యం కలిగించే పాటలు పాడి అలరింపచేశారు. రాత్రి సాహిత్య వేదికలో ఉద్యమ పథంలో నేను - జక్కా వెంకయ్య ఆత్మకథ పుస్తకాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. నెల్లూరు జిల్లా అమరవీరులు, పోరాట యోధులు అనే పుస్తకాన్ని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారామ్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వామపక్ష పార్టీలు ఎల్లప్పుడూ పేదల పక్షమే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర అధ్యక్షుడు మాదాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రమాదేవి, ప్రజాశక్తి ఎడిటర్ బీ తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను కే లక్ష్మయ్య, అరుణ, పీ గోపీనాథ్ పర్యవేక్షించారు.

ప్రతిభ PRATIBHA

భళా... లక్ష్మీ కళ

ప్రకృతి, పల్లె పడచులు, దేవతామూర్తులు, ఆధునిక ప్రపంచం... ఇలా ఏ దృశ్యమైన ఆ కుంచెతో జీవం పోసుకుంటుంది. గురువు లేక పోయినా అందరూ గుర్తుంచుకునేలా ప్రతిభను చాటుతోంది. ఒకవైపు చదువుకుంటూ నే మరోవైపు చిత్ర కళలో నైపుణ్యాన్ని పెంపొందించుకుంది. వివిధ పోటీల్లో పాల్గొని తన ప్రతిభతో బహుమతులు అందుకుంది. చిన్న చిత్రా లు మొదలు పోస్టర్ల వరకు చిత్రాలు గీయడం, పెయింటింగ్ చేయడంలో తనకంటూ ప్రత్యేకశైలిని రూపొందించుకుంది. అమే నెల్లూరు నగరానికి చెందిన లక్ష్మీ సన్నిహిత.







లక్ష్మీ సన్నిహిత వేసిన చిత్రాలు

కలర్స్ ఆఫ్ నెల్లూరు ఎగ్జిబిషన్‌లో తొలిసారి తన చిత్రాలను ప్రదర్శించింది. తొలి ప్రదర్శనలోనే ఆమె చిత్రాలు ఎనిమిదింటిని వీక్షకులు కొనుగోలు చేయడం ఆమె ప్రతిభకు నిదర్శనం.

జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలి

చిన్నప్పటి నుంచే చిత్రకళ సాధన చేస్తున్నాను. జాతీయ స్థాయి చిత్రకారిణిగా గుర్తింపు పొందాలన్నదే నా ఆశయం. నేను వేసిన చిత్రాలను జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తాను. ఉద్యోగంలో చేరినా, వివాహమైనా ఈ కళను కొనసాగిస్తాను. దీని ద్వారా ఎంతో మానసిక ఆనందం పొందుతున్నాను.

- వంజివాక లక్ష్మీ సన్నిహిత

చిత్రలేఖనంలో అందెవేసిన చెయ్యి

ఆకట్టుకుంటున్న కళారూపాలు

లక్ష్మీ సన్నిహిత చిత్రకళలో అద్వితీయ ప్రతిభను చూపుతోంది. బీటెక్ కంప్యూటర్ సైన్స్ చేసిన ఆమె వేసిన చిత్రాలు చూప రులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. తల్లిదండ్రులు వంజివాక శాంతిప్రియ, సతీష్‌రెడ్డి ప్రోత్సాహంతో 8వ ఏట నుంచే చిత్రలేఖనంపై మక్కువ పెంచుకుంది. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత చిత్రకళనే వ్యాపకంగా మలచుకుంది. కాన్వాస్‌పై అందమైన దృశ్యాలకు జీవం పోసి ఆన్‌లైన్‌లో పోస్టు చేస్తోంది. ఎక్కువగా ప్రకృతి రమణీయతకు దృశ్యరూపమిస్తోంది. ఆన్‌లైన్‌లో చూసిన సందర్శకులు ఆమె చిత్రాలు నచ్చి ఆర్డరు కోరితే వారికి నచ్చిన చిత్రం వేసి రంగులు అద్ది ఇస్తోంది. అక్రలిక్, ఆయిల్ పెయింటింగ్, నేచర్ పెయింటింగ్, క్యాన్వాస్ పెయింటింగ్‌లో ఎన్నో కొత్త ప్రయోగాలు చేస్తోంది. ఇటీవల నెల్లూరు టౌనుహాలు వర్ధమాన సమాజంలో ఏర్పాటు చేసిన

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- వ్యాపారులు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- సిటీ డీఎస్పీ సింధుప్రియ



సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని నెల్లూరు నగర డీఎస్పీ సింధుప్రియ అన్నారు. చిన్నబజారు, సంతపేట పోలీసు స్టేషన్ల ఆధ్వర్యంలో నగరంలోని చిన్నబజారులో ఉన్న క్లాత్‌మార్చెంట్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సీసీ కెమెరాల ఏర్పా టుపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ వ్యాపారస్తులు దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటి వల్ల నేరాలను కట్టడి చేయవచ్చని, నేరం జరిగినా వెంటనే నిందితులను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నబజారు, సంతపేట పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కోటేశ్వరరావు, దశరథరామారావు, వ్యాపార సంఘాల నాయకులు కిషోర్, శోభన్, తదితరులు పాల్గొన్నారు. కాగా, నగరంలోని నవాబుపేట పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ఆధ్వర్యంలో వ్యాపారస్తులకు సీసీ కెమెరాలపై అవ గాహన సదస్సు నిర్వహించారు.

22 నుంచి ఇస్తిమా శాంతి సభలు

- ఏర్పాట్లు పరిశీలించిన వేమిరెడ్డి దంపతులు, అజీజ్
- వీపీఆర్ ఫౌండేషన్ నుంచి రూ.25 లక్షల వితరణ



మత పెద్దలతో కలసి నమాజ్ చేస్తున్న వేమిరెడ్డి దంపతులు

కొడవలూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రశేఖర పురం వద్ద ఫిబ్రవరి 22, 23వ తేదీల్లో తబ్లిగ్ జమాత్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి ఇస్తిమా (ఇస్లామిక్ శాంతి సభలు) కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు శుక్రవారం ఏర్పాట్లను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ చంద్రశేఖ రపురంలో జరిగే ఇస్తిమా కార్యక్రమా నికి రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే వారికి ప్రభుత్వ పరంగా తాగునీరు, శానిటేషన్, విద్యుత్, రవాణా, తదితర సౌకర్యాలు కల్పిం చేందుకు కృషి చేస్తామన్నారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మన ప్రాంతంలో జరిగే ఈ కార్యక్రమం విజయ వంతానికి పరిసర ప్రాంతాల ప్రజలు సహకరిం చాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమం నిర్వహణకు వీపీ ఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.25 లక్షలు విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ ఇస్తిమా కార్యక్ర మాన్ని ఎలాంటి ఇబ్బందులకు లేకుండా సమష్టి కృషితో విజయ వంతం చేయాలన్నారు. అందు కు తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనారిటీ నాయకులు జాకీర్ షరీఫ్, నన్నేసాహెబ్, టీడీపీ నేత బోలా సతీష్, తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు

(3వ పేజీ తరువాయి)

డీపీఆర్‌లు తయారు చేసి ప్రతి ఇంటికి నీరు అందించేలా అధికారులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు, డీఈలు స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి పనులను ప్రతిపాదించాలని సూచించారు. థర్డ్ పార్టీ కన్సల్టెన్సీలను కూడా ఏర్పాటు చేశామని, అధికారుల సమన్వయంతో వీరు పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేయనున్నట్లు చెప్పారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపి పనులు మొదలుపెట్టనున్నట్లు తెలిపారు.

- 2058 జనాభా అవసరాలకు అనుగుణంగా...

సోమశిల, కండలేరు జలాశయాల నీటిని వినియోగించుకుని ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2058 సంవత్సరం జనాభా అవసరాలకు అనుగుణంగా నీటిని అందించేందుకు బృహత్తర ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు. సోమశిల నుంచి 24 మండలాలకు 1.58 టీఎంసీలు, కండలేరు నుంచి 23 మండలాలకు 2.64 టీఎంసీలను మంచినీటి అవసరాలకు వినియోగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. జల్‌జీవన్ మిషన్ పథకాన్ని సంపూర్ణంగా వినియోగించుకుని ప్రతి పల్లెకు నీరందిస్తామన్నారు. మరో మూడేళ్లలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఇక 9వ తేదీన ఆత్మకూరులో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి, శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని, ఇందులో నలుగురు మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కేశవ్, ఎస్‌ఈలు వెంకటరమణ, వెంకటరమణారెడ్డి, రాధాకృష్ణా రెడ్డి, దేశ్‌నాయక్, గంగాధర్, మోహన్, అశోక్‌కుమార్, జడ్పీ సీఈవో విద్యారమ, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, ఆత్మకూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.శేష రత్నం తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యల నివారణే ధ్యేయం

నెల్లూరు (వైద్యం) : లింగ నిర్ధారణ పరీక్షలు చేయడమంటే భ్రూణ హత్యలను ప్రోత్సహించినట్లేనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. భ్రూణ హత్య లను నివారించటమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో లింగనిర్ధారణ నిషేధిత చట్టం జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సర్దార్ సుల్తానా, సీహెచ్ కిరణ్, అనాటమీ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వర్ణరెడ్డి, డివిజన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ దయాకర్, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

మళ్లీ శ్రమశక్తి సంఘాలు!

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



- ఉపాధి హామీ పథకంలో మార్పు
- ప్రతి 50 మందికి ఓ కమిటీ
- రూ.300 కూలి గిట్టుబాటే లక్ష్యం
- నేటి నుంచే అమలు

మనుబోలు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం బలోపేతంపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. గత వైసీపీ పాలనలో ఈ పథకం కొంత దుర్వినియోగం అయిందన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఈ పథకంలో చేపట్టిన పనుల్లో లోపాలు వెలుగుచూశాయి. వాటిని సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా శ్రమశక్తి సంఘాలను ప్రారంభించాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 1నుంచి ఈ సంఘాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం వ్యవసాయానికి సంబంధించిన పనులు 50శాతం మేర పూర్తి కావడంతో ఇక గ్రామాల్లో ఉపాధి హామీ పనులు పెద్దఎత్తున చేపట్టాలని నిర్ణయించింది. అందుకే శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేసి పారదర్శకంగా పనులు చేపట్టాలని, తద్వారా ప్రతి వేతన దారుడికి రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా చూడాలని భావిస్తోంది.

- జిల్లాలో 3.44 లక్షల జాబ్‌కార్డులు

జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 44 వేల జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 2.79 లక్షల మంది వేతనాదారులు మనుగడలో ఉన్నారు. ఈ ఏడాది మార్చికల్లా 1.15 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే జనవరి నెలాఖరుకు 85 లక్షల పనిదినాలు పూర్తి చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పనిదినాలు పెంచి, వేతనదారులకు చెల్లింపుల మొత్తాన్ని పెంచాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. అందుకే మళ్లీ శ్రమశక్తి సంఘాలను తీసుకురానుంది.

- 6 వేల సంఘాలు

ఈ శ్రమశక్తి సంఘాల ద్వారా పనికి దరఖాస్తు చేసుకోవడం, మస్టర్లు, చేసిన పనికి కొలతలు వంటివి పక్కాగా అమలుకానున్నాయి. ఇప్పటికే ఈ విషయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు, సాంకేతిక అసిస్టెంట్లకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. 25 నుంచి 50మంది కూలీలు కలిసి ఓ సంఘంగా ఏర్పాడాల్సి ఉంటుంది. ఈ విధంగా లెక్కిస్తే జిల్లాలో సుమారు 6 వేల సంఘాలు వరకు ఏర్పడే అవకాశం ఉంటుంది.

పారదర్శకత కోసమే..

పారదర్శకంగా పథకాన్ని అమలు చేసి అర్హులందరికీ పని కల్పించడమే లక్ష్యం. ప్రతి వేతనదారుడు శ్రమశక్తి సంఘాల్లో చేరాలి. రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పిస్తాం.

- గంగాభవాని, డ్వామా పీడీ

- గతంలోనూ ఇవే సంఘాలు

2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న శ్రమశక్తి సంఘాలు మంచి సేవలందించేవి. పనుల్లో పారదర్శకతతో పాటు, వేతనదారులకు గిట్టుబాటు లభించేది. అప్పుడు మెరుగైన సంఘాలకు పనిముట్లు అంటే గడ్డపార, పలుగు, బుట్టలు ఉచితంగా అందించారు. వైసీపీ అధికారంలోకి రాగానే శ్రమశక్తి సంఘాలను రద్దు చేసింది. దీంతో మస్టర్లు వేయడంలో అనేక అవకతవకలు, కొలతలు తీయడంలో సైతం వివక్ష ఎదురయ్యేది. ఆ ప్రభావం వేతనాలపై పడేది. దీంతో రోజంతా కష్టపడితే రూ.200కూడా రాని పరిస్థితి. దీంతో చాలా మంది ఉపాధి పనులకు రావడం మానేశారు. అందుకే మళ్లీ శ్రమశక్తి సంఘాల ద్వారా అన్నింటినీ సరిచేసి రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వేతన దారుల సమ్మతితోనే కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ సంఘంలో చదవడం, రాయడం వచ్చినఒకరిని మేట్‌గా నియమిస్తారు. సంఘాల వివరాలను టీసీఎస్ సర్వర్‌లో నమోదు చేయాలి. కొత్తగా జాబ్‌కార్డు పొందిన వారిని సంఘంలో సభ్యులుగా తీసుకోవాలి. గతేడాదిలో కనీసం 25 పనిదినాలు చేసిన వారు సంఘంలో ఉండాలి. ఒకసారి ఏర్పడిన కమిటీలో మార్పులు, చేర్పులు చేయరు. కమిటీ తీర్మానాన్ని ఫీల్డ్ అసిస్టెంటుకు అందించాలి.

ఆత్మకూరు నియోజకవర్గంలో భారీగా

అభివృద్ధి పనులు

● 9వ తేదీన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు : మంత్రి ఆనం

నెల్లూరు (హరనాథపురం) జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా ఆత్మకూరు నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనుల ప్రారంభానికి తిరిగి శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్షించారు. 9వ తేదీన మంత్రులు నారాయణ, సత్యకుమార్, సవిత, బీసీ జనార్ధన్‌రెడ్డిలతో ఆత్మకూరులో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో గృహాల సముదాయాలలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రామాలయాల నిర్మాణానికి సీఎం అనుమతులు ఇచ్చారని, తొలుత ఆత్మకూరు టిడ్కో కాలనీ నుంచే ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి చెప్పారు. ఆత్మకూరుకు మంజూరైన బీసీ బాలికల గురుకుల పాఠశాలను తాత్కాలికంగా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన ఫర్నిచర్, ఎలక్ట్రికల్ సామగ్రి ఇతర సదుపాయాలను కలెక్టర్ నిధులు, దాతల సహకారంతో సమకూర్చినట్లు చెప్పారు. రూ.9.6 కోట్లతో ఆత్మకూరు పట్టణానికి తాగునీటి సరఫరా కోసం అమృత్-2 పథకం ద్వారా పనులు మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నుంచి బైపాస్ రోడ్డు విస్తరణ, బ్యూటిఫికేషన్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఆత్మకూరు మండల కాంప్లెక్స్ వద్ద జడ్పీ నిధులు రూ.1.70 కోట్లతో పంచాయతీరాజ్ అతిథి గృహం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ హైస్కూల్‌లో ఎంపీ వేమిరెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా 107 మంది దివ్యాంగులకు మోటరైజ్డ్ ట్రై సైకిళ్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రూ.30లక్షలతో మున్సిపాలిటీకి లిఫ్ట్ సౌకర్యం, రూ.2 కోట్లతో ఆత్మకూరు రిజర్వాయర్ బ్యూటిఫికేషన్ పనులు, నుడా నిధులు రూ.కోటితో రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ప్రారంభానికి చర్యలు చేపట్టామని, వంద పడకల ఆసుపత్రి స్థాయిని కూడా పెంచేందుకు ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకుళ్తామని ఆనం చెప్పారు.

అన్న క్యాంటీన్‌లో టీడీపీ నేతల సంబరాలు



ఎమ్మెల్యే ఇంటూరిని సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కందుకూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హిందూపు రం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణకు కేంద్రం పద్మ భూషణ్ అవా ర్డు ప్రకటించిన సందర్భం గా టీడీపీ పట్టణ నాయ కులు, కార్యకర్తలు శుక్ర వారం అన్నా క్యాంటీన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యేను నందమూరి అభిమానులు గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన కేకు కట్‌చేసి అన్నా క్యాంటీన్‌కు వచ్చే పేదలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్‌లో రెండురోజులు ఉచిత భోజనాలు ఏర్పాటుచేసిన పట్టణ టీడీపీ మాజీఅధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లును అభినందించారు. సినీరంలో పేరు తెచ్చుకున్న నందమూరి బాలకృష్ణ బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌తో రెండు తెలుగురాష్ట్రాల ప్రజలకు అందిస్తున్న సేవలు నిరుపమానం అని కొనియాడారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, చిలకపాటి మధు, వడ్డెళ్ల రవిచంద్ర, షేక్ రఫీ, బెజవాడ ప్రసాదు, కూనం నరేంద్ర, షేక్ సలాం, చేకూరి వీరాస్వామి, కాకుమాని మాల్యాద్రి, మధిర మధు, షేక్ నజీర్ పాల్గొన్నారు.

మాంసం, చేపల మార్కెట్ల పరిశీలన

పట్టణంలోని మాంసం మార్కెట్, చేపల మార్కెట్లను ఎమ్మెల్యే సాయంత్రం సందర్శించారు. మటన్, చికెన్ దుకాణాల గదులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. అనంతరం చేపల మార్కెట్‌ను ఆయన పరిశీలించి పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ అనూష ఉన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

● జిల్లా మలేరియా అధికారి హుసేనమ్మ



ఇంటింటా సర్వేను తనిఖీ చేస్తున్న హుసేనమ్మ

ఉదయగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో పని చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి హుసేనమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని శకునాలపల్లి హెల్త్ విలేజ్ క్లినిక్ సెంటర్‌ను తనిఖీ చేసి ఓపీ రిజిస్టర్ పరిశీలించారు. ఎస్సీ కాలనీలో ఇంటింటా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లార్వా నివారణ చర్యలను చేపట్టాలన్నారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా జ్వరాలు దోమల ద్వారా వ్యాపించే అవకాశం ఉందని, ప్రతి శుక్రవారం ఇంట్లో నీటినిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి తొలగించాలన్నారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, ఆరోగ్య విద్యాధికారి కె వెంకటసుబ్బయ్య, ఎంఎల్‌హెచ్‌పీ రాజరాజేశ్వరి, ఏఎస్ఎం చంద్రకళ, ఆశ కార్యకర్తలు సుహాసిని, అనిత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయండి



కావలి టౌన్: ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కావలి టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనతాపేటలోని ఆంధ్రకేసరి మున్సిపల్ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని శుక్రవారం విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాల ఎదుట, ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేసి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకట కృష్ణ మాట్లాడారు. 71ఏళ్ల చరిత్ర కలిగిన స్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయకపోవం విచారకరం అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కరవది భాస్కర్, శ్యామల ఉన్నారు.

ఆదిఆంధ్ర కాలనీ స్కూల్‌ను కొనసాగించాలి

వలేటివారిపాలెం : తూర్పు పోలినేనిపాలెం ఆదిఆంధ్ర కాలనీలోని ఎంపీపీ స్కూల్‌ను యూపీ స్కూల్‌లోకి విలీనం చేయకుండా యథావిధిగా కొనసాగించాలని ఎస్ఎంసీ చైర్మన్ గాజులవర్తి సౌజన్య శుక్రవారం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ఉదయగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తరగతి గదిని ఆకర్షణీయంగా రూపొందించడం ఎలా అనే అంశంపై స్థానిక షాదీమంజిల్‌లో ఆదివారం ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు షేక్ దస్తగిరిఅహ్మద్, గాజుపల్లి రామిరెడ్డిలు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సర్వశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, జేవీవీ జాతీయ నాయకుడు డాక్టర్ జీ సుధాకర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారామపురం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాల్గొనాలని వారు కోరారు.

చెత్త సంపద షెడ్ల నిర్మాణాలు పూర్తి

కలిగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చెత్తసంపద తయారీ కేంద్రాల షెడ్ల నిర్మా ణాలను త్వరిత గతిన పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎల్.శ్రీధర్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం నిర్మాణ దశల్లో ఉన్న షెడ్లను మండల విస్తరణాధికారి వెలుగోటి మధుతో కలిసి పరిశీలిం చారు. స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్‌ల సహకారంతో ఈ షెడ్లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలని ఆదేశిం చారు. కలిగిరి చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి తడి, పొడ చెత్తలను వేరు చేసి వర్మీకంపోస్ట్ ఎరువు తయారీ విధానంపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈ రవిచంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో కాలువలు.. సాగునీరందక దిగాలు

● ఆందోళనలో కర్షకులు



ఆక్రమణలతో పూడిపోయిన కాలువ

ఉదయగిరి రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో సాగునీటి కాలువలు, చెరువులను ఆక్రమించుకొని ఏకంగా పంటలు సాగు చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణదారుల ఆగడాలతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలం భైరవకోన అడవుల నుంచి వరదనీరు ప్రవహించే కాలువను ఆర్లపడియ గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలానికి ఆనుకొని ఉన్న ప్రాంతంలో ఆక్రమించి పంటల సాగుకు పూనుకున్నాడు. దీంతో నామరూపాలు లేకుండా పూడిపోయిన ఆ కాలువలో చుక్కనీరు కూడా ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోయింది. ఆ కాలువ కింది భాగంలోని గండిపాళెం చెరువుతో సహా వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లి, ఇస్కపల్లి గ్రామాల చెరువులకు సైతం వరదనీరు చేరే అవకాశం లేకుండా పోయింది. నెలల తరబడి జోరుగా ప్రవహించే ఆ కాలువ నీరు ప్రస్తుతం రైతులకు ఏమాత్రం ఉపయోగం లేకుండా వృథాగా పోతుండడంతో ఆక్రమణదారులతో పాటు అధికారుల తీరుపై రైతులు మండిపడుతున్నారు. అంతేగాక అడుగంటిన చెరువులతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం కూడా లేకుండా పోతోందని మోటార్ల కింద పంటలు సాగుచేసే రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆక్రమణదారుల చెరలో తోటలచెరువుపల్లి చెరువు

తోటలచెరువుపల్లి చెరువును సమీప సాతువారిపల్లి గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించుకొని పంటలు సాగు చేసుకుంటుండగా, మరి కొంతమంది ముళ్లకంచెలను ఏర్పాటు చేసుకొని తమ ఆధీనంలో ఉంచుకొని కాలం గడుపుతున్నారు. దీంతో విస్తారమైన ఆ చెరువు రోజురోజుకు కుచించుకుపోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి: దొడ్లా మౌలాలీ, చెరువు చైర్మన్



తమ గ్రామానికి చెందిన చెరువును కొంత మంది ఇష్టానుసారంగా ఆక్రమించు కోవడంతో విస్తీర్ణం తగ్గుతోంది. ప్రధానంగా కాలువను కూడా ఆక్రమించుకోవడంతో వాటి పరిధిలో వ్యవసాయం చేసే రైతులకు సాగునీరు అందే అవకాశం లేకుండా పోతోంది. పాలకులు, అధికారులు వెంటనే స్పందించి చెరువులు, కాలువల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి రైతులకు న్యాయం చేసి ఆదుకోవాలి.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన అవసరం



ఆత్మకూరు : మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజక్‌ప్రవీణ్

సంగం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమన తిప్ప ఎస్టీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డిప్యూటీ తహసీల్దారు సంధ్య ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో రెండు గ్లాసుల పద్ధతి ఉంటే చట్టరీత్యా నేరమన్నారు. కొన్నిచోట్ల అగ్రవర్ణాల వారు ఎస్సీ, ఎస్టీలను ఆలయాల ప్రవేశం చేయకుండా అడ్డుకుంటున్న సందర్భాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 మల్లయ్య, వీఆర్వో మోహన్‌రావు, వెల్ఫేర్ అసిస్టెంట్, సెక్రటరీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

●ఆత్మకూరు : మండలంలోని వాసిలి గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో పి ఐజక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. భారత రాజ్యాంగం అందరికీ స్వేచ్ఛ, సమానత్వం తదితర హక్కులు కల్పించిందని, వివక్షతలేని సమాజంలో అందరూ అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి, ఆర్ఐ కొండయ్య, సర్పంచ్ చెలిక రమ పాల్గొన్నారు.

●ఏఎస్ పేట : ఎస్సీ ఎస్టీల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దారు శ్రీరామకష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఎస్టీ కాలనీలో ఎస్ఐ సైదులుతో కలసి సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పౌర హక్కుల గురించి, ఎస్సీ, ఎస్టీ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల అధి కారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

●ఉదయగిరి : ప్రతి పౌరుడు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఉప తహసీల్దారు షాజియా పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి ఎస్సీ కాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు కల్పించే హక్కులను వివరించారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలను చక్కగా చదివించాలన్నారు. అలాగే పలు ప్రభుత్వ శాఖల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఆర్ఐ సురేంద్ర, ఏఈలు శ్రీనివాసరాజు, జగన్నాథం, ఏఎస్‌డబ్ల్యూవో ఆదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ, ఫడ్స్ డైరెక్టర్ రమణయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ మాదాల బాబూరావు పర్యవేక్షించారు.

కన్యకా పరమేశ్వరికి పూజలు

సీతారామపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక అమ్మవారిశాలలోని కన్యకా పరమేశ్వరిదేవి కి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ఫీజు పోరును విజయవంతం చేయండి

ఆత్మకూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన నిర్వహించే ఫీజుపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక మేకపాటి క్యాంపు కార్యాలయంలో ఫీజు పోరు పోస్టర్‌ను వైసీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల సహకారంతో ప్రేమ వివాహం

అనంతసాగరం జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిలలో ఒక ప్రేమ జంట వివాహానికి పోలీసులు సహకారం అందించారు. పవన్‌కుమార్ అనే యువకుడు తమ సామాజిక వర్గానికి చెందిన యువతిని కొంతకాలంగా ప్రేమించాడు. అయితే పెళ్లి చేసుకునేందుకు పెద్దల అంగీకారం లభించలేదు. దీంతో రెండు కుటుంబాలతో శుక్రవారం పోలీసుస్టేషన్‌లో గ్రామపెద్దలు చర్చించి పెళ్లికి ఒప్పించి వివాహం జరిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై స్పష్టత ఏదీ?

● విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు గుర్రప్ప



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గుర్రప్ప

కావలి టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విశాఖఉక్కు పరిశ్రమకు కేంద్రం ప్యాకేజీ ప్రకటించడం సంతోషకరమే అయినా ప్రైవేటీకరణ చేయమన్న మాటపై స్పష్టత ఏదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు గుర్రప్ప ప్రశ్నించారు. నెల్లూరులో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలకు హాజరయ్యేలా విశాఖ నుంచి చేపట్టిన విశాఖ ఉక్కు పరిరక్షణ ప్రచారజాత శుక్రవారం కావలికి చేరుకుంది. మద్దూరుపాడు జాతీయ రహదారి వద్ద స్థానిక పార్టీ నాయకులు స్వాగతం పలికి పట్టణ బ్రిడ్జి కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గుర్రప్ప మాట్లాడారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఎంతోమంది ప్రాణత్యాగం చేసి విశాఖ ఉక్కు సాధించుకున్నారని తెలి పారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి వంతపాడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో రామస్వామి రామ్మోహన్ గౌడ్,జీ శ్రీనివాసరవు, మహేష్, శోమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ఆత్మకూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని స్థానిక సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఆత్మకూరు నాగయ్య మాట్లాడుతూ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం నిరంతర పోరాటం చేస్తోందన్నారు. ఈ మహాసభలకు ఆత్మకూరు నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం నాగేంద్ర, పేమల వెంకటయ్య, సాలారుద్దీన్, మహబూబ్‌బాషా, అశోక్, కోడూరు ప్రసాద్, టంగుటూరు బాజ్జి పాల్గొన్నారు.

తక్షణ వైద్యసాయంపై అవగాహన ఉండాలి : ఆర్టీవో



వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీవో లక్ష్మి

కందుకూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ వైద్యసహాయం అందించేందుకు వైద్యులు కృషి చేయటమే కాకుండా వారిని వెంటనే హాస్పిటల్‌కు తీసుకొచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కందుకూరు ఆర్టీవో టీవీఎస్.లక్ష్మి కోరారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల, పలు ప్రైవేటు హాస్పిటల్స్‌లో రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పించి ప్రచార పత్రికలను అతికించారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి సహాయం చేసేందుకు అనేకమంది భయపడి వెనుకడుగు వేస్తుంటారని అయితే మానవతాదృకృథంతో స్పందించాలన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కందుకూరు ఎంవీఐ చెన్నూరి రాంబాబు మాట్లాడారు. ప్రమాదం జరిగిన గంటలోపు క్షతగాత్రులను హాస్పత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ.5వేలు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏరియా హాస్పత్రి సూపరింటెండెంట్ శకుంతల, నెల్లూరు అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

మనగ్రోమోర్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఏడీ దేవసేనమ్మ

అనంతసాగరం జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆత్మకూరు వ్యవసాయ శాఖ ఏడీ దేవసేనమ్మ తెలిపారు. శుక్రవారం స్థానికంగా నూతనంగా ఏర్పాటుచేసిన మనగ్రోమోర్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఎరువులు కొనుగోలు చేసిన తరువాత బిల్లులు తీసుకోవాలని రైతులకు సూచించారు. అన్నిరకాల ఉత్పత్తులు మనగ్రోమోర్ సెంటర్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీధర్‌రెడ్డి, అనంతసాగరం చెరువు సొసైటీ అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు చల్లా శివారెడ్డి, మెట్టుకూరు మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జయశ్రీ, ఉద్యాన శాఖాధికారి



ఉదయగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని ఉదయగిరి ఉద్యాన శాఖాధికారి జయశ్రీ సూచించారు.

? పండ్లతోటలకు రాయితీలు ఎలా.

! హెక్టార్‌లో సాగుచేసే బత్తాయి (ఏడాదికి) రూ.9,600, అరటికి రూ.30వేలు, దానిమ్మకు రూ.16వేలు, ఆయిల్‌ఫామ్, అంతర పంటకు (ఏడాదికి) రూ.10,250, మామిడికి 7,980 ఇస్తారు. పట్టాదారు పాసు పుస్తకాలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

? తోటల్లో నీటికుంటలు ఏర్పాటు చేస్తున్నారా.

! పండ్లతోటల్లో భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం రాయితీ ద్వారా నీటికుంటల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. 20 మీటర్లు పొడవు, 20 మీటర్ల వెడల్పు, 3మీటర్ల లోతు ఉండేలా రైతులు కుంటలను ఏర్పాటుచేస్తే ప్రభుత్వం రూ.75 వేలు సబ్సిడీ కింద అందజేస్తుంది.

? బిందు, తుంపర సేద్య పరికరాలు అందజేస్తున్నారా.

! దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు ఏపీఎంఐపీ ద్వారా బిందు, తుంపర సేద్య పరికరాలు అందజేస్తున్నాం. ఐదెకరాల్లోపు ఉన్న వారికి 90 శాతం, ఐదెకరాల పైన ఉన్నవారికి 70 శాతం సబ్సిడీతో ఈ పరికరాలు అందజేస్తున్నాం.

న్యూస్ బాక్స్

నిర్మాణాల తొలగింపు పరిశీలన

బిట్రగుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా మందిర ఆవరణలోని నిర్మాణాలు తొలగించడం తగదని ఎస్ఐ భోజ్యా తెలిపారు. శుక్రవారం జువ్వలదిన్నె పంచాయతీ వడ్డిపాలెం గ్రామస్థులు కూల్చిన ప్రార్థన మందిర ఆవరణలోని కట్టడాలను పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

రిటైర్డ్ టీచరుకు సన్మానం

వలేటివారిపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పోకూరు డీపీఈపీ పాఠశాలలో టీచరుగా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన కామేపల్లి సులోచనను ఎంఈఓలు రవికుమార్, మల్లికార్జునరావు టీచర్లు శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కల్లగుంట మోహన్‌రావు, సంగా మహేంద్ర, వెంకట్రావు, దేవూరి శివనారాయణ, వలేటి మాల కొండయ్య, శ్యామ్యాలు, శ్రీనివాసులు, మాధవరావు, హనుమంతరావు జాన్సన్, రవికుమార్, ప్రసాద్‌రావు, పాల్గొన్నారు.

ఏఎస్ఐకి సన్మానం

బిట్రగుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల తిప్ప పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ సీహెచ్.సుధాకర్‌రెడ్డి శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ భోజ్యా, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ జయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

అనంతసాగరం జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కంబంపాడులో ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చింతగుంట నరసింహారెడ్డి, రొండా వెంకటరమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిబిరంలో నెల్లూరు డిఎస్ఆర్ ఆసుపత్రి నుంచి నరాల స్పెషలిస్ట్ దువ్వూరు దయాకర్‌రెడ్డి, బీ సుధాకర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు అందజేస్తామని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

అనంతసాగరం జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగం గుంటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పాపిశెట్టి నరసింహులుకు ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానం చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయానికి నరసింహులు తన సొంత నిధులు వెచ్చించి కంప్యూటర్, ఉపాధ్యాయులకు బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి మోహన్‌ప్రసాద్, మండల నాయకులు సాదిక్, రాజ్యలక్ష్మి, ఖాజామొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ కోటలో పారిశుధ్య పనులు

లింగసముద్రం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):వీఆర్ కోటలో శుక్రవారం ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు, కార్యదర్శి సాయి కిరణ్‌లు శుక్రవారం సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించారు.గ్రామంలోని పలు వీధుల్లోని మురుగు కాలువల వెంబడి ఉన్న జంగిల్‌ను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. కాలువలో పేరుకొనిపోయిన ఉన్న చెత్తా చెదారం మురుగు పూడికను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. త్వరలో గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వంకాయల పాటి మాల్యాద్రి, బోయిళ్ల కొండపనాయుడు, ముప్పరాజు లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.